RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS
We undertake Printing of Daily News Papers

హైదరాబాద్ 08 సెప్టెంబర్ 2026 మంగళవారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:22 | సంచిక:87

## అసెంబ్లీలో కంటతడి పెట్టిన స్పీకర్ ప్రసాద్

**తాతా మధు వ్యాఖ్యలపై సభలో తీవ్ర చర్చ**

**తాతా మధును డిస్మిస్ చేయాలని సీఎం డిమాండ్**

**వ్యాఖ్యలను ఖండించిన బీజేపీ నేత మహేశ్వర్ రెడ్డి**

**స్పీకర్ తల్లి ప్రస్తావనపై సీతక్క ఆవేదన**



తెలంగాణ అసెంబ్లీలో సోమవారం అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. సభా కార్యకలాపాలు కొనసాగుతున్న సమయంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తీవ్ర భావోద్వేగానికి గురై కంటతడి పెట్టారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు స్పీకర్‌ను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేసినట్టు ఆరోపణలు రాగా, దీనిపై సభలో చర్చ జరుగుతున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది.

ఉదయం అసెంబ్లీ వెలుపల తాతా మధు చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. ఈ వ్యవహారంపై సీఎం రేవంత్ రెడ్డి సహా పలువురు మంత్రులు సభలో తీవ్రంగా స్పందించారు. స్పీకర్‌ను ఉద్దేశించి అభ్యంతరకరమైన భాషను ఉపయోగించడం చట్టసభల గౌరవాన్ని దెబ్బతీయడమేనని సీఎం అన్నారు. తాతా మధు శాసనమండలి సభ్యత్వాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

సభాపతికి జరిగిన అవమానం సభ్య సమాజానికి జరిగిన అవమానమని రేవంత్ రెడ్డి అన్నారు. ఇలాంటి భాషను చట్టసభల్లో సహించకూడదని స్పష్టం చేశారు.

బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి కూడా తాతా మధు వ్యాఖ్యలను ఖండించారు. స్పీకర్‌పై అనుచిత భాష ఉపయోగించిన సభ్యుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈ అంశంపై చర్చ జరుగుతున్న సమయంలో ప్రసాద్ కుమార్ భావోద్వేగానికి గురయ్యారు. ఛైర్‌లో ఉండగానే కన్నీళ్లు పెట్టుకున్నారు. దీంతో సభలో ఒక్కసారిగా ఉద్విగ్న వాతావరణం నెలకొంది.

మంత్రి సీతక్క కూడా ఈ ఘటనపై తీవ్రంగా స్పందించారు. స్పీకర్ తల్లిని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు బాధాకరం అంటూ ఆమె ఆవేదన వ్యక్తం చేస్తూ భావోద్వేగానికి గురయ్యారు. అణగారిన వర్గాల నుంచి వచ్చిన వ్యక్తులు అత్యున్నత పదవుల్లో ఉండటాన్ని కొందరు ఓర్వలేకపోతున్నారని బీఆర్ఎస్‌పై విమర్శలు చేశారు. తాతా మధును వెంటనే సస్పెండ్ చేయాలని, ఆయన సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ క్షమాపణ చెప్పాలని కోరారు.

## కేసీఆర్ క్షమాపణ చెప్పాలి

**తాతా మధు వ్యాఖ్యలపై సీఎం ఆగ్రహం**

**ఎమ్మెల్సీని డిస్మిస్ చేయాలని మండలి చైర్మన్ ను కోరిన వైనం**

**స్పీకర్‌ను గౌరవించడం సభా సంప్రదాయమని వ్యాఖ్య**

**బీఆర్ఎస్ నేతలపై సీఎం తీవ్ర ఆరోపణలు**



బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను ఉద్దేశించి తీవ్ర వ్యాఖ్యలు చేశారంటూ సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. తాతా మధును తక్షణమే చట్టసభ నుంచి డిస్మిస్ చేయాలని శాసనమండలి ఛైర్మన్‌ను కోరారు. ఈ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

శాసనసభలో సోమవారం మాట్లాడిన రేవంత్ రెడ్డి.. సభాపతి స్థానానికి ఎంతో గౌరవం ఉందన్నారు. స్పీకర్‌ను గౌరవించడం చట్టసభల కనీస సంప్రదాయమని చెప్పారు. సభాపతిపై అభ్యంతరకరమైన భాషను ఉపయోగిస్తే చూస్తూ ఊరుకోబోమని స్పష్టం చేశారు. ఇది స్పీకర్‌కు జరిగిన అవమానం మాత్రమే కాదని, సభలోని ప్రజాప్రతినిధులందరికీ జరిగిన అవమానమని అన్నారు.

బీఆర్ఎస్ సభ్యులను కేసీఆర్ తన ఫామ్‌హౌస్‌కు పిలిపించి ఉసిగొల్పి పంపడం వల్లే ఆ పార్టీ నేతలు ఈ విధంగా వ్యవహరిస్తున్నారని రేవంత్ ఆరోపించారు. సభ్యుల హక్కులను కాపాడుతున్న స్పీకర్‌ను ఉద్దేశపూర్వకంగా అవమానించారని విమర్శించారు. ప్రభుత్వం కొన్ని సందర్భాల్లో సంయమనం పాటిస్తుందని, దాన్ని తమ చేతగానితనంగా భావించవద్దని హెచ్చరించారు.

తన రాజకీయ జీవితంలో ఎన్నో సభలను చూశానని, చట్టసభల్లో ఇంత అభ్యంతరకరమైన భాషను ఎప్పుడూ చూడలేదని రేవంత్ అన్నారు. ఇలాంటి వైఖరిని క్షమిస్తూ పోతే ప్రజాస్వామ్య వ్యవస్థలపై ప్రజలకు ఉన్న గౌరవం దెబ్బతింటుందని హెచ్చరించారు.

మరోవైపు బీజేపీపైనా సీఎం విమర్శలు చేశారు. బీఆర్ఎస్ నేతలను కాపాడేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ)లో నిర్ణయం తీసుకున్న తర్వాతే బీజేపీ లేవనెత్తిన అంశాలపై చర్చిస్తామని రేవంత్ స్పష్టం చేశారు.

**శాసనసభ దగ్గర ఉద్రిక్తత..**
**ఎమ్మెల్యేలకు గాయాలు**
వార్తా 2 లో

### తెలంగాణలో కోటి ఓట్ల తొలగింపునకు కుట్ర:

## సీఎం రేవంత్ రెడ్డి

**బీజేపీ వ్యతిరేక ఓట్లపై ప్రత్యేక నిఘా ఉందని ఆరోపణ**

**కొడంగల్‌లో 81 వేల ఓట్లు అనామలీస్ జాబితాలో ఉన్నాయని వెల్లడి**

**2029లో మోదీ ఓటమికి పునాది అన్న సీఎం**

**పేదలు, గిరిజనుల ఓట్లపైనా కుట్ర జరుగుతోందని ఆరోపణ**

**లౌకిక శక్తులు ఏకం కావాలని రేవంత్ పిలుపు**

తెలంగాణలో కోటి ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఓటర్ల జాబితా సవరణ (సర్) ప్రక్రియపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యతిరేక ఓటర్లను గుర్తించేందుకు బీజేపీ ప్రత్యేక ఏజెన్సీలను ఏర్పాటు చేసిందని విమర్శించారు. 2009 నుంచి ఓటింగ్ సరళిని పరిశీలించి బీజేపీకి వ్యతిరేకంగా ఉన్నవారి ఓట్లు తొలగిస్తున్నారని ఆరోపించారు.

రవీంద్రభారతిలో నేడు రైతు నేత సారంపల్లి మల్లారెడ్డి సంస్మరణ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. నరేంద్ర మోదీ విధానాలకు వ్యతిరేకంగా వ్యవస్థ మొత్తం సిద్ధమవుతోందని అన్నారు. అందుకే ఎస్ఐఆర్ పేరుతో కొత్త కుట్రలకు తెరలేపారని ఆరోపించారు. తెలంగాణలో కోటి ఓట్లు తొలగిస్తున్నా బీఆర్ఎస్ స్పందించడం లేదని మండిపడ్డారు.

**కొడంగల్‌లో 81 వేల ఓట్లు**

తన నియోజకవర్గం కొడంగల్‌లో వలస వెళ్లిన వేలాది మంది పేదల ఓట్లను తొలగిస్తున్నారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. కొడంగల్‌లో 81 వేల ఓట్లను అనామలీస్ జాబితాలో చేర్చారని తెలిపారు. ప్రస్తుత ఓట్లతోనే 2029లో మోదీ ఓటమికి పునాది పడుతుందని అన్నారు.

బీజేపీ వ్యతిరేక ఓట్లు అంటే మైనార్టీలవే అనుకోవద్దని సీఎం చెప్పారు. పేదలు, గిరిజనుల ఓట్లను తొలగించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. జాతీయ స్థాయిలో లౌకిక శక్తులు ఏకమై మోదీకి వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు.

**సారంపల్లి సేవలు చిరస్మరణీయం**

రైతుల కోసం జీవితాన్ని అంకితం చేసిన సారంపల్లి మల్లారెడ్డి మరణం రైతాంగానికి తీరని లోటని సీఎం అన్నారు. రైతు సమస్యలపై అవగాహన ఉన్న నాయకత్వం క్రమంగా తగ్గుతోందని పేర్కొన్నారు. కౌలు రైతులు, గిట్టుబాటు ధరలు సహా అనేక రైతు సమస్యలపై సారంపల్లికి అపారమైన అవగాహన ఉందని కొనియాడారు.

కమ్యూనిస్టు ఉద్యమాల పోరాటాల వల్లే కాంగ్రెస్ పలు చట్టాలు తీసుకొచ్చిందని రేవంత్ రెడ్డి అన్నారు. కార్మికులు, పేదల సమస్యలపై కమ్యూనిస్టులు చేసిన పోరాటాలు తమ ప్రభుత్వ ఏర్పాటుకు ప్రత్యక్షంగా, పరోక్షంగా దోహదపడ్డాయని చెప్పారు.

## స్పీకర్ పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అనుచిత వ్యాఖ్యలు.. తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన కాంగ్రెస్

**స్పీకర్ ను ఉద్దేశించి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు అనుచిత వ్యాఖ్యలు**

**కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ ను కోరిన కాంగ్రెస్ దళిత ఎమ్మెల్యేలు**

**ఎమ్మెల్సీ సభ్యత్వాన్ని రద్దు చేయాలన్న సీతక్క**

శాసనసభ స్పీకర్ స్థానంలో ఉన్న దళిత నేతను బీఆర్ఎస్ నాయకులు తీవ్రంగా అవమానించారంటూ చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం నిప్పులు చెరిగారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు స్పీకర్‌ను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. రాజ్యాంగబద్ధమైన స్థానానికి కనీస గౌరవం ఇవ్వకుండా 'ఎవడ్రా', 'స్పీకర్ గాడు' అంటూ ఏకవచనంతో సంబోధించడమే కాకుండా, 'అధికారం ఇచ్చిన వాడు ఎవడ్రా' అంటూ తీవ్ర అసభ్య పదజాలంతో బూతులు తిట్టడం బీఆర్ఎస్ నేతల అహంకారానికి, దళిత వ్యతిరేక మనస్తత్వానికి అద్దం పడుతోందని మండిపడ్డారు.

ఈ వ్యవహారాన్ని కాంగ్రెస్ దళిత ఎమ్మెల్యేలు అత్యంత తీవ్రంగా పరిగణించారు. అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి, తాతా మధుపై కఠిన చర్యలు తీసుకోవాలని వినతిపత్రం సమర్పించారు. దళిత వర్గానికి చెందిన స్పీకర్‌ను అసభ్యకర పదజాలంతో దూషించిన తాతా మధును తక్షణమే ఎమ్మెల్సీ పదవి నుంచి తప్పించాలని, ఆయనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని సీఎంను కోరారు. మరోవైపు ఈ ఘటనపై పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క కూడా



తీవ్రంగా స్పందించారు. స్పీకర్‌ను అవమానించిన సదరు ఎమ్మెల్సీ సభ్యత్వాన్ని రద్దు చేయడంతో పాటు, బీఆర్ఎస్ పార్టీ నుంచి ఆయనను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

## మహిళా ఎమ్మెల్యే చీర లాగిన వాళ్లను వదిలిపెట్టం: హరీశ్ రావు

**బీఆర్ఎస్ సభ్యులు సభలోకి రాకుండా అడ్డుకోవాలనే కుట్రతో రేవంత్ ప్రభుత్వం ఉందన్న హరీశ్ రావు**

**శాసనసభ చరిత్రలో ఈరోజు ఒక చీకటి రోజుగా మిగిలిపోతుందని వ్యాఖ్య**

**శాసనసభ కౌరవసభలా మారిందని విమర్శ**



తెలంగాణ శాసనసభ సమావేశాల వేళ తమ పార్టీ ప్రజాప్రతినిధులపై పోలీసులు అత్యంత దురుసుగా వ్యవహరించారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు హరీశ్‌రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ సభ్యులు ఎవరూ సభలోకి అడుగుపెట్టకుండా అడ్డుకోవాలనే కుట్రతోనే రేవంత్ ప్రభుత్వం ఈ రకమైన అణచివేత చర్యలకు ఒడిగట్టిందని మండిపడ్డారు. ప్రతిపక్షం లేని సభను నడిపించుకోవాలని చూస్తున్నారని ధ్వజమెత్తిన ఆయన... అసెంబ్లీ వద్ద చోటుచేసుకున్న ఉద్రిక్తతలపై మీడియాతో మాట్లాడుతూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

"కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలు నిరసన టీషర్టులు ధరించి పార్లమెంట్‌కు వెళ్లినప్పుడు లేని తప్పు, మేం అసెంబ్లీకి నల్ల టీషర్టులతో వస్తే తప్పవుతుందా? నల్ల టీషర్టులపై ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని అడగడం నేరమా? ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతిపక్షాలకు లేదా?" అని హరీశ్‌రావు నిలదీశారు. తెలంగాణ శాసనసభ చరిత్రలో ఈరోజు ఒక చీకటి రోజుగా మిగిలిపోతుందని, ఇది అసలైన శాసనసభలా కాకుండా కౌరవసభలా మారిందని తీవ్రస్థాయిలో అభివర్ణించారు.

మాజీ మంత్రి సునీతా లక్ష్మారెడ్డి చీర లాగి, సబితా ఇంద్రారెడ్డి గొంతు నొక్కిన పోలీస్ అధికారులను, అలాగే మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డిని కిందపడేసి హింసించిన ఖాకీలను సప్తసముద్రాల అవతల ఉన్నా వదిలేది లేదని తీవ్రంగా హెచ్చరించారు. ఆందోళనలో కేటీఆర్ చేయి, ముఖంపై గాయాలయ్యాయని, కనీసం ఆసుపత్రికి కూడా తరలించకుండా అడ్డుకోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులపై జరిగిన ఈ దాడులు, అక్రమ అరెస్టులన్నింటికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హరీశ్‌రావు స్పష్టం చేశారు.

ప్రజాబలం

08 సెప్టెంబర్ 2026 మంగళవారం

# మళ్లీ మొదటికి నీటి పంచాయితీ

కృష్ణా జలాల్లో వాటాల విషయంలో కొట్లాడుకుంటున్న అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆరెస్ పార్టీల నేతలు.. అసలు విషయాన్ని పక్కన పెట్టి.. షాడో ఫైట్ చేస్తున్నారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నీటి వాటాలు ఉన్నా.. వాటిని వినియోగించుకునేందుకు తగిన ప్రాజెక్టులు ఏవని సాగునీటి నిపుణులు ప్రశ్నిస్తున్నారు. ముందుగా పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేస్తే.. కేటాయింపుల మేరకైనా నీటిని నిల్వ చేసుకునే అవకాశం లభిస్తుందని సూచిస్తున్నారు.ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మధ్య నీళ్ల పంచాయితీ ఇంకా తెగలేదు. కృష్ణా జలాలపై తమ వాటాలపై ఇంకా ఎటూ తేలలేదు. శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాలను తాగునీటి అవసరాల కోసం రెండు రాష్ట్రాలకు పంపిణీ చేసేందుకు శుక్రవారం హైదరాబాద్‌లోని జలసౌధ కృష్ణా బోర్డు ఆఫీసులో త్రిసభ్య కమిటీ భేటీ అయింది. కృష్ణా బోర్డు మెంబర్ సెక్రటరీ సతీష్ కాంబోజ్, తెలంగాణ నీటిపారుదల శాఖ ఈఎన్సీ రమేశ్‌బాబు, ఏపీ జలవనరుల శాఖ ఈఎన్సీ నరసింహమూర్తి సమావేశం అయ్యారు. ఆగస్టు 25న జరిగిన సమావేశంలో చర్చలు కొలిక్కి రాకపోవడంతో బోర్డు సమావేశం వాయిదా పడిన సంగతి తెలిసిందే. తిరిగి శుక్రవారం మరోసారి బోర్డు సమావేశం జరిగినా.. ఎలా ఫలితం తేలకుండానే ముగిసింది. ఈ నెల చివరి వారంలో మరోసారి జరిగే కృష్ణా బోర్డు సమావేశానికి కేఆర్ఎంబీ ఛైర్మన్ బోర్డు అధ్యక్షత వహించనున్నారు. ఎల్‌నినో ప్రభావంతో.. శ్రీశైలం, నాగార్జునసాగర్‌లలోని నీటి నిల్వలను తాగునీటికే వినియోగించాలని మొదటిగా చర్చించారు. కృష్ణా బేసిన్‌లో ప్రజలకు ఎక్కువ భాగం తాగునీటిని సరఫరా చేయాలని, ముఖ్యంగా హైదరాబాద్‌తోపాటు పరిసర ప్రాంతాలకు 50% వాటా కింద నీటిని విడుదల చేయాలని తెలంగాణ కోరింది. వచ్చే ఏడాది ఆగస్టు వరకు 200 టీఎంసీలు కేటాయించాలని కోరింది. తమ అవసరాలకు 104 టీఎంసీల కేటాయించాలని ఏపీ.. కృష్ణా బోర్డును కోరింది. ఏపీ, తెలంగాణలకు 66:34 నిష్పత్తిని అమలు చేస్తూ తక్షణమే తమకు 97 టీఎంసీల నీళ్లు విడుదల చేయాలని ఏపీ కోరింది. అయితే ఎల్‌నినో ప్రభావం ఎక్కువగా ఉండడంతో 50 శాతం చొప్పున జలాలు కేటాయించాలని తెలంగాణ కోరింది. పోతిరెడ్డిపాడు, వెలిగొండ ప్రాజెక్టు నుంచి నిబంధనలకు విరుద్ధంగా నీటిని తరలిస్తున్నారని తెలంగాణ ఆరోపించింది. దీనిపై ఏపీ స్పందిస్తూ న్యాయబద్ధంగా వచ్చిన నీటి నుంచే పోతిరెడ్డిపాడు, వెలిగొండ ద్వారా తీసుకుంటున్నట్లు పేర్కొంది. అవసరం లేకున్నా.. తెలంగాణ శ్రీశైలం ప్రాజెక్టు నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసి నీటిని దిగువకు వదులుతోందని పేర్కొంది. దానిని వెంటనే అడ్డుకోవాలని కోరింది. దీనికి తెలంగాణ స్పందిస్తూ పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి ఏపీ తరలిస్తున్న నీటిని వెంటనే నియంత్రణ కోరింది. ఎల్‌నినో ప్రభావంతో ఇరు రాష్ట్రాలు ఉమ్మడి జలాశయాల నుంచి నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని బోర్డు మెంబర్ సెక్రటరీ సతీష్ కాంబోజ్ సూచించారు. శ్రీశైలం నుంచి పోతిరెడ్డిపాడుకు నీటి విడుదలను ఏపీ నియంత్రించాలి. విద్యుదుత్పత్తికి నీటిని విడుదల చేయడాన్ని తెలంగాణ ఆపాలని కోరారని మినిట్స్‌లో తెలియజేశారు. పులిచింత, కేడీఎస్, తుంగభద్రతో సహా అనేక ప్రాజెక్టుల్లో, పెన్నా బేసిన్‌లో 80 టీఎంసీలు ఉన్నాయని తెలంగాణ ఈఎన్సీ రమేశ్ బాబు తెలిపారు. ఎల్‌నినో ప్రభావం వల్ల ఉమ్మడి జలాశయాల్లో నీటి లభ్యత గణనీయంగా తగ్గిందని, ప్రస్తుతం ఉన్న నిల్వలను కేవలం తాగునీటి అవసరాలకే కేటాయించాలని తెలంగాణ వాదించింది. హైదరాబాద్ మహానగరంతో పాటు పరిసర ప్రాంతాల తాగునీటి అవసరాలను పరిగణనలోకి తీసుకుని, ఉమ్మడి జలాశయాల నుంచి 200 టీఎంసీల నీటిని కేటాయించాలని కోరింది. అలాగే పాత విధానం కాకుండా రెండు రాష్ట్రాలకు 50:50 నిష్పత్తిలో సమానంగా నీటిని పంపిణీ చేయాలని తెలంగాణ ఈఎన్సీ రమేశ్‌బాబు ప్రతిపాదించారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి ఏపీ నిబంధనలకు విరుద్ధంగా నీటిని తరలిస్తోందని, ఇటీవల ప్రారంభించిన వెలిగొండ ప్రాజెక్టు ద్వారా కూడా అనుమతుల్లేకుండా జలాలను తోడేస్తోందని తెలంగాణ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది.తెలంగాణ డిమాండ్‌ను ఏపీ తీవ్రంగా తిరస్కరించింది. ప్రస్తుతానికి తక్షణ అవసరాల కోసం 97 టీఎంసీలను విడుదల చేయాలని కోరారు. తమ వాటా పరిధిలోనే పోతిరెడ్డిపాడు, వెలిగొండ ద్వారా నీటిని వాడుకుంటున్నామని స్పష్టం చేస్తూ.. తెలంగాణ డిమాండ్ చేసిన 200 టీఎంసీల కేటాయింపు సహేతుకం కాదన్నారు. పైగా తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి పేరుతో శ్రీశైలం నుంచి అనవసరంగా దిగువకు నీటిని విడుదల చేస్తోందని, దీనిని తక్షణమే నిలువరించాలని ఏపీ ఫిర్యాదు చేసింది.పోతిరెడ్డిపాడు 19 టీఎంసీలు, చెన్నై తాగునీటి కోసం 15 టీఎంసీలు తీసుకుంటున్నారు. ఈ ఏడాది అక్టోబరు వరకు 22 టీఎంసీలు తీసుకుంటామని ఏపీ చెప్పిందన్నారు. ఇప్పటికే 20 టీఎంసీలు వాడుకున్నారన్నారు. వెలిగొండ నుంచి కూడా వాడుకుంటూ.. ఇంకా పాత నిష్పత్తిలో నీటి కేటాయింపు కావాలని కోరడం సరికాదన్నారు. వచ్చే ఏడాది ఆగస్టు వరకు ఏపీకి 104 టీఎంసీలు కావాలని కోరామని ఏపీ ఈఎన్సీ నరహింమూర్తి తెలిపారు. తెలంగాణ 200 టీఎంసీలు కావాలనడం సరికాదన్నారు. ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంపు కోసం కర్ణాటక ప్రభుత్వం భూసేకరణ పనులు వేగవంతం చేసున్నా.. తెలంగాణ ప్రభు త్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో లేని నీటి వివాదాలు ఇప్పుడే ఎందుకు వస్తున్నాయని, ఆయన హయాంలో ఏపీ నాయకులు ఎందుకు ఇంత ధైర్యం చేయలేదని ప్రశ్నించారు. వరదలు లేని సమయంలో వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించడంలో ఆంతర్యమేందని నిలదీశారు. కాళేశ్వరం బరాజ్‌లు సురక్షితమేనని ఎన్‌డీఎస్‌ఏ, సీడబ్ల్యూపీఆర్ఎస్ సంస్థలు స్పష్టత ఇచ్చిన తర్వాతైనా కన్నెపల్లి పంపులను వెంటనే ఆన్‌చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాలమూరు పంపులనూ ఆన్ చేయాలని కోరారు.సీఎం రేవంత్‌రెడ్డికి కృష్ణా నదిపై ఉన్న ప్రాజెక్టులపై కనీస అవగాహన లేదని మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ఎద్దేవా చేశారు. జూరాల ప్రాజెక్టు సామర్థ్యం కేవలం 6.5 టీఎంసీలే కావడం వల్ల భీమా, నెట్టెంపాడు, ఆర్డీఎస్ కింద లక్షలాది ఎకరాల పంటలు ఎండిపోయే ప్రమాదం ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. కేసీఆర్ హయాంలోనే వలసల జిల్లా పాలమూరు రూపురేఖలు మారాయని గుర్తుచేశారు. కాంగ్రెస్ వచ్చాక పాలమూరు బిడ్డలు మళ్లీ వలసబాట పట్టే దుస్థితి దాపురించిందని ఆవేదన వ్యకం చేశారు.

# శాసనసభ దగ్గర ఉద్రిక్తత.. ఎమ్మెల్యేలకు గాయాలు





హైదరాబాద్: సోమవారం ఉదయం అసెంబ్లీ మెయిన్ గేట్ వద్ద ఉద్రిక్తత నెలకొంది. బీఆర్ ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అడ్డుకున్నారు. బ్లాక్ టీషర్ట్స్ తో వెళ్లేందుకు అనుమతి లేదని చెప్పారు. సభలోకి పంపాలంటూ హరీష్ రావు టీషర్ట్ తీసేసారు. ఈ నేపథ్యంలో పోలీసులతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల మధ్య వాగ్వాదం జరిగింది. తోపులాటలో హరీష్ రావు, జగదీష్ రెడ్డి కింద పడిపోయారు. ఎమ్మల్యే సబితా ఇంద్రారెడ్డిని మెడపట్టి నెట్టేసారు. తన చీర లాగేశారని సునీత లక్ష్మారెడ్డి కంటతడి పెట్టారు. తోపులాటలో కేటీఆర్, జగదీష్ రెడ్డికి గాయాలు అయ్యాయి. కేటీఆర్ ముఖం, చేతికి గాయాలు అయ్యాయి. తరువాత పోలీసులు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పీఎస్ కు తరలించారు.

# జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ ఆధ్వర్యంలో 2000 మంది ఆడపడుచులకు సామూహిక శ్రీమంతం



అంగరంగ వైభవంగా జరిగిన సామూహిక శ్రీమంతం అన్న అనే మాటను సార్థకం చేసుకుని..పుట్టింటి కానుకగా చీర–సారె, పసుపు, కుంకుమ అందజేసిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే. .పోషకాహార వారోత్సవంలో భాగంగా నవయువ నిర్మాణ్ సంస్థ మరియు కాంగ్రెస్ పార్టీ సంయుక్త ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని యూసుఫ్‌గూడ మహమ్మద్ ఫంక్షన్ హాల్‌లో సామూహిక శ్రీమంతాలు,అన్నప్రాసన కార్యక్రమాన్ని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్ ఘనంగా నిర్వహించారు..

ఈ కార్యక్రమానికి సుమారు 2,000 మంది గర్భిణీలు, చిన్నారులు అధిక సంఖ్యలో హాజరై సందడి చేశారు..కాబోయే తల్లులకు ఆరోగ్యం, ఆనందం, ఆయురారోగ్యాలతో నిండిన జీవితం కలగాలని ఆకాంక్షిస్తూ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ గారు పుట్టింటి కానుకగా చీర–సారెతో పాటు పసుపు, కుంకుమ అందజేసి సామూహికంగా శ్రీమంతం చేశారు..అన్నగా అండగా నిలిచి.. ఆడపడుచుల పట్ల తనకున్న ఆప్యాయతను చాటుకుంటూ, పేద కుటుంబాలకు చెందిన మహిళలకు అండగా నిలిచేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం పట్ల మహిళలు హర్షం వ్యక్తం చేశారు..అదేవిధంగా చిన్నారి తొలిసారిగా అన్నం రుచి చూసే మధురమైన, చిరస్మరణీయమైన అన్నప్రాసన కార్యక్రమాన్ని గద్వాల్ విజయలక్ష్మి , జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేశ్రీ వి. నవీన్ యాదవ్ రు కలిసి నిర్వహించి చిన్నారులకు ఆశీస్సులు అందించారు..ఈ కార్యక్రమనికి ౹ఖఅఅ అధ్యక్షులు, మహేష్ కుమార్ మంత్రులు,దుద్ధిల్లా శ్రీధర్ బాబు, సీతక్క, అజ్జరుద్దీన్, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు గద్వాల విజయలక్ష్మి గారు,మైనార్టీ నాయకులు ఫాహీం ఖురేషి ..ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ మాజీ ఎంపీ మధుయాష్ గౌడ్ , ఓఏఅ అద్దంకి దయాకర్ .. ఎమ్మెల్యేలు, దానం నాగేందర్ , మరియు ఉత్తమ్ పద్మావతి రెడ్డి ,చిత్తం పర్ణిక రెడ్డి , యశస్విని రెడ్డి , టీజీ సోషల్ మీడియా ప్రెసిడెంట్ సామ రామ్మోహన్ రెడ్డి , గద్దర్ వెన్నెలరు, కాల్వ సుజాత , కొత్తకోట సీతా దయాకర్ రెడ్డి , దీపక్దీపక్ జాన్ ,సరిత తిరుపతయ్య , చిత్రపురి కాలనీ ప్రెసిడెంట్ వల్లభనేని అనిల్ ఇతర కాంగ్రెస్ పార్టీ నాయకులు, ,తదితరులు, హాజరయ్యారు..

# స్టేట్ ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్ పర్సన్ గా బాధ్యతలు స్వీకరించిన గద్వాల్ విజయలక్ష్మి

స్టేట్ ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్ పర్సన్ గా గద్వాల్ విజయలక్ష్మి సోమవారం ప్రజాభవన్ లో పదవీ బాధ్యతలు స్వీకరించారు.ప్రజా భవన్ కు విచ్చేసిన గద్వాల్ విజయలక్ష్మికి వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం పూజా కార్యక్రమాలు నిర్వహించి వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య విజయలక్ష్మి ఫైల్ పై సంతకం చేశారు.అనంతరం సీఎం ప్రజావాణి హాల్ ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు డాక్టర్ కే కేశవరావు, వి. హనుమంతరావు, డాక్టర్ రోహిన్ రెడ్డి, ప్లానింగ్ శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్, ప్రజావాణి స్టేట్ నోడల్ ఆఫీసర్ కే. విద్యాసాగర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వానికి అసెంబ్లీలో చర్చించే ధైర్యం లేకనే అక్రమ అరెస్ట్ లు చేయిస్తుంది...

### మాజీమంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్



హైదరాబాద్ అసెంబ్లీ సమావేశాలకు రమ్మని బయటే అరెస్ట్ లు చేయడం అప్రజాస్వామికం. ప్రభుత్వానికి అసెంబ్లీలో చర్చించే ధైర్యం లేకనే అక్రమ అరెస్ట్ లు చేయిస్తుందని మాజీ మంత్రి ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మహిళా సభ్యుల పట్ల వ్యవహరించిన తీరు అత్యంత దుర్మార్గం. పెద్ద సంఖ్యలో పోలీసులను మోహరించి సభ్యులను అరెస్ట్ చేయాల్సిన అవసరం ఏముంది. ప్రజా సమస్యలపై నిరసన తెలిపేందుకే నల్ల టీ షర్ట్ లతో బిఆర్ఎస్ పార్టీ సభ్యులు వచ్చారు. అసెంబ్లీ లోపలికి వెళ్ళక ముందే అరెస్ట్ దుర్మార్గమని అన్నారు.

పార్లమెంట్ కు రాహుల్ గాంధీ నల్ల టీ షర్ట్ వేసుకెళ్ళొచ్చు... మా సభ్యులు మాత్రం వేసుకోవద్దా. అక్రమ అరెస్ట్ లు చేసినంత మాత్రాన తాము ప్రజా సమస్యలపై పోరాటాన్ని ఆపబోమని అన్నారు.



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి :** భాగ్‌లింగంపల్లిలో కాసాని ఆనంద్ యదవ్ ఆధ్వర్యంలో శ్రీ క్రిష్ణ జన్మాష్టమి గో పూజ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా కాండ్రెస్ నాయకులు మాజీ ఎంపీ అంజన్ కూమార్ యాదవ్ విచ్చేసి గోపూజ కార్యక్రమంనిర్వహించినారు. ఈ కార్యక్రమంలో లోకేష్ యాదవ్ ,శ్రీధర్ యాదవ్ శేఖర్ ,పవన్ , ప్రేమ్ ,నరేష్ ,మరియు కాంగ్రెస్ నాయకులు ఎస్.ధన్‌రాజ్ ,కొత్త రఘుగౌడ్ ,ప్రసాద్‌యాదవ్ తదితరులు పాల్గోన్నారు.

# ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోంది

**ఆటో ఛార్జీల పెంపునకు ప్రభుత్వం సానుకూలం కమిటీ నివేదిక ఆధారంగా త్వరలో ఛార్జీల పెంపు అమలు**
**లాస్ట్ మైల్ కనెక్టివిటీ లో భాగంగా ఆర్టీసీ ఈవీ ఆటో లు నడిపే ప్రసక్తే లేదు ఇది దుష్ప్రచారం మాత్రమే**
**ఓలా, ఉబెర్ తరహా లో ప్రభుత్వమే యాప్ ప్రవేశపెట్టడానికి ఐటీ శాఖ తో సంప్రదింపులు జరిపాం**
**హైదరాబాద్‌లో 18,700 ఆటోలకు రెట్రోఫిట్మెంట్ కోసం రూ.1.50 లక్షల చొప్పున ఆర్థిక సహాయం**
**ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటుపై కేబినెట్‌లో చర్చించి శాసన సభ లో బిల్లు ప్రవేశపెడతాం - ఆటో కార్మిక సంఘాల సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకట్ స్వామి**





హైదరాబాద్, సెప్టెంబర్ 7:రాష్ట్రంలోని ఆటో డ్రైవర్లు, ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి తెలంగాణ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ,కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకట్ స్వామి తెలిపారు. ఆటో కార్మిక సంఘాల ప్రతినిధులతో సచివాలయంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకట్ స్వామి కీలక సమావేశం నిర్వహించారు.

ఆటో డ్రైవర్లు, కార్మిక సంఘాలు తమ సమస్యలను మంత్రుల దృష్టికి తీసుకురాగా.. ఆయా అంశాలపై మంత్రులు, ఉన్నతాధికారులు సుదీర్ఘంగా చర్చించారు. గత ఆగస్టు 23న జరిగిన సమావేశంలో చర్చించిన అంశాలపై తీసుకున్న చర్యలను కూడా సమీక్షించారు.

సమావేశంలో కీలక నిర్ణయాలు, అంశాలు

ఈవీ ఆటోలపై తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దు

టీజీఎస్ఆర్టీసీ ద్వారా ఈవీ ఆటోలను ప్రవేశపెట్టి లాస్ట్ మైల్ కనెక్టివిటీ పాలసీ తీసుకురానున్నట్లు జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ప్రస్తుతం అలాంటి విధానంపై ఎలాంటి చర్చ జరగడం లేదన్నారు.

ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు

ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటుపై కార్మిక శాఖతో కలిసి ప్రాధాన్యతా ప్రాతిపదికన చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. ఈ అంశాన్ని కేబినెట్‌లో చర్చించి శాసనసభలో ప్రవేశపెట్టేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఆటో ఛార్జీల పెంపునకు సానుకూల నిర్ణయం

2012 తర్వాత ఆటో ఛార్జీలను పెంచలేదని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ఆటో ఛార్జీలను పెంచేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రవాణా శాఖ అధికారులు, ఆటో కార్మిక సంఘాల ప్రతినిధులతో కమిటీ ఏర్పాటు చేసి, సమగ్ర ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తారని చెప్పారు. ఎంత మేర ఛార్జీలు పెంచాలనే అంశాన్ని కమిటీ నిర్ణయించి ప్రభుత్వానికి సూచనలు చేస్తుందని, ఆ నివేదిక ఆధారంగా త్వరలో ఛార్జీల పెంపును అమలు చేస్తామని మంత్రి తెలిపారు.

ఓలా, ఉబర్, ర్యాపిడో తరహాలో ప్రభుత్వ ప్రత్యేక యాప్

ఆటో డ్రైవర్లకు ఉపయోగపడేలా ఓలా, ఉబర్, ర్యాపిడో తరహాలో ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రత్యేక యాప్ రూపొందించే అంశంపై ఇప్పటికే ఐటీ శాఖ మంత్రికి లేఖ రాశామని మంత్రి తెలిపారు. ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను రూపొందించి అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటుందని చెప్పారు.

పెండింగ్, తిరస్కరించిన పర్మిట్లకు పరిష్కారం

జీఓ ఎంఎస్ నం.263 కింద తిరస్కరించబడిన కేసులు, గడువు ముగిసిన పర్మిట్లకు సంబంధించిన ఆటో రిక్షా పర్మిట్ కోటాను విడుదల చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అగ్రిగేటర్ పాలసీపై అధ్యయనానికి కమిటీ

అగ్రిగేటర్ల ద్వారా వైట్ ప్లేట్ వాహనాల వినియోగంపై ఆటో సంఘాలు లేవనెత్తిన అంశాలను ప్రభుత్వం పరిశీలిస్తోందని మంత్రి తెలిపారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ప్రకటించిన అగ్రిగేటర్ పాలసీలో ద్విచక్ర వాహనాలను ఉపయోగించుకునే అవకాశం ఉందని, దీనివల్ల నిరుద్యోగ సమస్యను కొంతవరకు తగ్గించే అవకాశం ఉందన్నారు. రాష్ట్రంలో అగ్రిగేటర్ పాలసీపై రవాణా శాఖ అధికారులతో కమిటీ ఏర్పాటు చేసి, పూర్తి స్థాయిలో అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించినట్లు తెలిపారు.

ఇతర జిల్లాల ఆటోలపై నిబంధనల అమలు

ఇతర జిల్లాలకు చెందిన ఆటోలు హైదరాబాద్ నగరంలో తిరగకుండా నిబంధనలను కఠినంగా అమలు చేయాలని ఆటో సంఘాలు కోరాయి. దీనిపై అవసరమైన చర్యలు తీసుకుంటామని రవాణా శాఖ హామీ ఇచ్చింది. నిబంధనల అమలులో నగర ఆటో కార్మిక సంఘాలు కూడా ప్రభుత్వానికి సహకరించాలని మంత్రి సూచించారు.

సారథి పోర్టల్‌లో ఆటో లైసెన్స్ సమస్యకు పరిష్కారం

సారథి పోర్టల్‌లో ఆటో రిక్షా డ్రైవింగ్ లైసెన్స్ కేటగిరీకి సంబంధించి స్పష్టత లేదని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రస్తుతం ఎల్ఎంవీ (లైట్ మోటార్ వెహికల్) లైసెన్స్ ఉన్న వారికి ఆటో నడిపే విషయంలో ఉన్న నిబంధనలను సవరించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాస్తున్నట్లు తెలిపారు.

హైదరాబాద్‌లో 18,766 ఆటోలకు రెట్రోఫిట్మెంట్ కోసం ఆర్థిక సహాయం

హైదరాబాద్ నగరంలో డీజిల్, పెట్రోల్ ఆటోల స్థానంలో పర్యావరణహిత వాహనాలను ప్రోత్సహించాలనే ప్రభుత్వ ఆలోచన ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఇందులో భాగంగా ఆటోలను రెట్రోఫిట్మెంట్ చేసుకునేందుకు హైదరాబాద్ నగరంలోని సుమారు 18,700 ఆటోలకు ఒక్కో ఆటోకు రూ.1.50 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని చెప్పారు.

ఈ కార్యక్రమం కోసం వివిధ శాఖల సమన్వయంతో సుమారు రూ.200 కోట్ల నిధులను ఖర్చు చేయనున్నట్లు మంత్రి తెలిపారు.

ఆటో డ్రైవర్లకు ప్రత్యేక బీమా పాలసీ పై

ఆటో డ్రైవర్ల ప్రమాద, సహజ మరణ బీమా అంశంపై కార్మిక శాఖతో చర్చించి చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. ఆటో డ్రైవర్లతో పాటు ఇతర వర్గాలకు కూడా భరోసా కల్పించేలా ప్రత్యేక బీమా పాలసీని తీసుకురావడానికి ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోందని చెప్పారు. ప్రతి ఒక్కరికీ రక్షణ కల్పించేలా ఇందిరమ్మ పాలసీ తీసుకువచ్చే దిశగా ప్రభుత్వం ఆలోచిస్తోందన్నారు.

ఆటో డ్రైవర్ల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. వివిధ శాఖల సమన్వయంతో ఆటో కార్మికుల సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తామని, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

ఈ సమావేశంలో రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి, కార్మిక శాఖ కార్యదర్శి దాసరి హరిచందన, అడిషనల్ కమిషనర్ రమేష్, జేటీసీలు చంద్రశేఖర్ గౌడ్, శివలింగయ్య, వెంకట రమణ, కార్మిక శాఖ అధికారులు, పోలీస్, ట్రాఫిక్ అధికారులు, వివిధ ఆటో కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## అందోల్ జోగిపేట నూతన ఆర్డిఓ కార్యాలయానికి భూమి పూజ కార్యక్రమం

**నూతన ఆర్డీవో కార్యాలయానికి కొబ్బరికాయలు కొట్టి భూమి పూజ చేసిన మున్సిపల్ చైర్మన్ కృష్ణారెడ్డి,**

అందోల్ నియోజకవర్గం ప్రతినిధి సెప్టెంబర్ 7 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా :ఈరోజు సోమవారం అందోల్ -జోగిపేట మున్సిపల్ పరిధిలో జోగిపేట తహసీల్దార్ ఆఫీస్ వెనకాల ఉన్న ఖాళీ ప్రదేశంలోగౌరవతెలంగాణ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వర్యులు దామోదర రాజనరసింహ ఆదేశానుసారం, నూతనంగా జోగిపేట లో (ఆర్డిఓ ) ఆఫీసును గౌరవ మున్సిపల్ చైర్మన్ ఎస్. కృష్ణారెడ్డి చేతులమీదుగా కొబ్బరికాయ కొట్టి భూమి పూజ కార్యక్రమం చేపట్టడం జరిగింది









మొత్తము 3 కోట్ల 83, లక్షల రూపాయల తో జి o1 ఆర్డీవో ఆఫీస్ మరియు రెసిడెన్స్ క్వార్టర్స్ కట్టడం జరుగుతుంది ఈకార్యక్రమం లో వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ (చిట్టిబాబు)పెద్దలు జగన్ మోహన్ రెడ్డి సురేందేర్ గౌడ్ , మాజీ మున్సిపల్ చైర్మన్ గూడెం మల్లయ్య ,చేనేత సహకార సంఘము అధ్యక్షులు పడిగే సత్యం తహసీల్దార్ మధుకర్ రెడ్డి కౌన్సిలర్లు కోషికే రాజశేఖర్,మద్రి అరుణకుమారి, మాజీ కౌన్సిలర్ దుర్గేష్ ,మాజీ కౌన్సిలర్ హరికృష్ణ గౌడ్ గ మాజీ కౌన్సిలర్ ప్రదీప్ గౌడ్ మాజీ కౌన్సిలర్ నాగరాజు, మాజీ కౌన్సిలర్ అల్లే శ్రీకాంత్ య,మాజీ కౌన్సిలర్ పిట్ల లక్ష్మన్, మాజీ కౌన్సిలర్ తుపాకుల సునీల్ కుమార్ ,కో ఆప్షన్ మెంబర్ డేవిడ్ , మాజీ అందోల్ సర్పంచ్ శ్రీనివాస్ మాజీ వార్డు సభ్యులు పట్లోళ్ల ప్రవీణ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు బేగరి అనిల్ కుమార్ గుర్రం కృష్ణ, మాసానిపల్లి మాజీ సర్పంచ్ అశోక్ నాయకులు కృష్ణ (ఆర్ అండ్ బి )అధికారులు (డి ఈ) రవీందర్ , (ఏ ఈ) శశాంక్, నాయకులు గూడెం చందు, మోదీని రాజు, ఇతర నాయకులు పాల్గొన్నారు...

## సేవాభావంతో వైద్య సేవలు

సేవాభావంతో వైద్య సేవలు చేస్తున్నామని సేవా భారతి, లయన్స్ క్లబ్ గ్రీన్ ల్యాండ్స్, ఈశ్వరచంద్ర చారిటబుల్ ట్రస్టు వైద్యాధికారి డా. వేద ప్రకాష్ అన్నారు. ఇంటిగ్రేటెడ్ హెల్త్కేర్ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ ఎన్ఎన్ గ్లోబల్ ఆధ్వర్యంలో సీఎస్ఆర్ కింద సీతారాంబాగ్ లోని సేవా భారతి ఆసుపత్రికి ఆధునిక శస్త్రచికిత్స పరికరాలు అందజేసింది. వైద్య బీమా లేని ప్రజలకు ఇక్కడ నాణ్యమైన శస్త్రచికిత్సలు అందించేందుకు ఈ పరికరాలు దోహదం చేస్తాయని చెప్పారు. ఎన్జన్ గ్లోబల్ సంస్థ ప్రతినిధుల శ్రీనివాస్ అయ్యగారి, అరవింద శ్రీని వాసన్, సేవాభారతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామమూర్తి, కార్యదర్శి సుబ్రహ్మణ్యం, లయన్స్ క్లబ్ ప్రతినిధి వద్యా భూషన్ తదితరులు పాల్గొన్నారు.

## కేటీఆర్ అరెస్టుపై భగ్గుమన్న బీఆర్ఎస్

### కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై వేములవాడలో తీవ్ర నిరసన



**వేములవాడ ప్రజాబలం ప్రతినిధి:** ప్రజా సమస్యలను అసెంబ్లీ వేదికగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసులు అడ్డుకుని అరెస్టు చేయడంపై వేములవాడ పట్టణ బీఆర్ఎస్ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేటీఆర్ అరెస్టును నిరసిస్తూ పట్టణంలోని తెలంగాణ చౌక్‌లో బీఆర్ఎస్ నాయకులు ఆందోళన నిర్వహించి కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.



ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలు, రైతులను తీవ్రంగా ఇబ్బందులకు గురిచేస్తున్న 22ఏ భూముల సమస్య తదితర అంశాలను అసెంబ్లీలో ప్రస్తావించేందుకు కేటీఆర్, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నల్ల దుస్తులు ధరించి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకుని అరెస్టు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు."ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే అరెస్టులా?" అంటూ ప్రభుత్వాన్ని నిలదీశారు. ప్రతిపక్ష నాయకుల గొంతు నొక్కేందుకు అరెస్టులు చేయడం ద్వారా ప్రజా సమస్యలను పక్కదారి పట్టించలేరని స్పష్టం చేశారు. ప్రజల తరఫున ప్రశ్నించే కేటీఆర్‌ను అడ్డుకున్నంత మాత్రాన బీఆర్ఎస్ పోరాటం ఆగదని హెచ్చరించారు.

22ఏ భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం

రాజన్న సిరిసిల్ల జిల్లాతో పాటు వేములవాడ నియోజకవర్గంలోని పలువురు రైతులు 22ఏ భూముల సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. అర్హులైన రైతుల భూములను 22ఏ జాబితా నుంచి తొలగించి, వారికి పూర్తిస్థాయి హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించి వారికి న్యాయం చేయాలని కోరారు.

ఆరు గ్యారెంటీలపై ప్రభుత్వాన్ని నిలదీత

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. హామీల అమలుపై ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని కోరారు. ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి ప్రతిపక్షాలను అణచివేయడంపైనే దృష్టి పెట్టడం సరికాదని విమర్శించారు.తెలంగాణ చౌక్‌లో నిర్వహించిన నిరసన సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు. "కేటీఆర్‌ను అడ్డుకోవడం ఆపాలి.. 22ఏ రైతులకు న్యాయం చేయాలి.. ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి" అంటూ నినదించారు.ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ నిరంతరం ప్రజల పక్షాన పోరాడుతుందని, ప్రభుత్వం స్పందించే వరకు తమ ఆందోళనలు కొనసాగిస్తామని నాయకులు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి, కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ ఏనుగు తిరుపతి రెడ్డి, మాజీ సెస్ డైరెక్టర్ రామతీర్థపు రాజు, సీనియర్ నాయకులు వెంగళ శ్రీకాంత్ గౌడ్, వాసాల శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు నిమ్మశెట్టి విజయ్, సిరిగిరి చందు, వార్డు నాయకులు, బీఆర్ఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గోపాలమిత్రలకు కృత్రిమ గర్భధారణ (ఎఐ)టార్గెట్లను తొలగించాలి.

### ఖమ్మం జిల్లా జనసేన నాయకులు సంగీతం సాయిచందు.



**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం సెప్టెంబర్ 7:**గోపాలమిత్రలపైన పశుసంవర్ధక శాఖ అధికారులు ెలకు 120 నుండి 150 ఎఐ చేయాలని అసాధ్యమైన టార్గెట్లు పెడుతు టార్గెట్ చేయకపోతే గౌరవ వేతనం ఆపుతామని, ఉద్యోగం నుండి తీసేస్తామని బెదిరిస్తున్నారు.గ్రామాల్లో పశువులు తక్కువగా ఉన్నా టార్గెట్ ఒత్తిడి వల్ల తప్పుడు లెక్కలు చూపించాల్సి వస్తోంది. సరైన స్ట్రాలు, నైట్రోజన్, ప్రయాణ ఖర్చులు ఇవ్వకుండా టార్గెట్ అనడం అన్యాయం. ఇలాంటి ఎఐ పద్ధతి ద్వారా ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి పడే అవకాశం ఉందని తెలిపారు.

కాబట్టి ప్రభుత్వం వెంటనే ఈ నిర్బంధ ఎఐ టార్గెట్ విధానాన్ని రద్దు చేసి, గోపాలమిత్ర సేవలను సంఖ్యతో కాకుండా రైతుల సంతృప్తితో అంచనా వేయాలని సాయిచంద్ డిమాండ్ చేశారు.

## స్పీకర్‌పై వ్యాఖ్యలు దళిత ద్రోహానికి పరాకాష్ఠ..


### తాతా మధు వ్యాఖ్యలను ఖండించిన కాంగ్రెస్ నేత.. కిలారి శ్రీనివాస్‌బాబు.



**కూకట్పల్లి (ప్రజాబలం) సెప్టెంబర్ 07:** శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలను వసంత్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కిలారి శ్రీనివాస్‌బాబు తీవ్రంగా ఖండించారు. రాజ్యాంగబద్ధమైన అత్యున్నత పదవిలో ఉన్న స్పీకర్‌ను, ఆయన కుటుంబాన్ని కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం బాధాకరమని పేర్కొన్నారు.

దళిత వర్గానికి చెందిన వ్యక్తి స్పీకర్ పదవిలో కొనసాగడాన్ని ఓర్వలేకే వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారా అనే అనుమానం కలుగుతోందని శ్రీనివాస్‌బాబు అన్నారు. దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తామని గతంలో హామీ ఇచ్చి విస్మరించిన చరిత్ర బీఆర్ఎస్‌కు ఉందని విమర్శించారు. ఇప్పుడు దళిత స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం ఆ పార్టీ దళిత వ్యతిరేక వైఖరికి నిదర్శనమని ఆరోపించారు.చర్యలు తీసుకోవాలి తాతా మధు వ్యాఖ్యలపై సమగ్ర విచారణ జరిపి, వర్తించే చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని శ్రీనివాస్‌బాబు డిమాండ్ చేశారు. ఈ ఘటనపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించి తమ వైఖరిని స్పష్టం చేయాలని కోరారు.

## అసెంబ్లీ స్పీకర్ వంటి అత్యున్నత రాజ్యాంగ పదవిలో ఉన్న వ్యక్తిపైఓ ఎమ్మెల్సీఅమర్యాదకగా మాట్లాడటాన్ని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తీవ్రంగా ఖండించారు.



**అందోల్ నియోజకవర్గంల ప్రతినిధి సెప్టెంబర్ 07 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా,:** అసెంబ్లీ స్పీకర్ వంటిఅత్యున్నత రాజ్యాంగ పదవిలో ఉన్న వ్యక్తిపై,ఓఎమ్మెల్సీబూతలు తిడుతూ,అమర్యాదకరంగా మాట్లాడటాన్ని మంత్రి దామోదర్రాజనర్సింహ,తీవ్రంగాఖండించారు,స్పీకర్‌ను కించపరిచేలా, అసభ్య పదజాలంతో మాట్లాడటం ప్రజాస్వామ్య వ్యవస్థకు, శాసనసభ గౌరవానికి అవమానకరం అని మంత్రి పేర్కొన్నారు.రాజకీయ విభేదాలు ఉండవచ్చు. విధానాలపై విమర్శలు చేయవచ్చు. కానీ ఒక రాజ్యాంగ పదవిలో ఉన్న వ్యక్తిని వ్యక్తిగతంగా కించపరిచేలా మాట్లాడటం ఎవిధంగానూ సమర్థనీయం కాదన్నారు.ప్రత్యేకించి, దళిత సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి అత్యున్నత రాజ్యాంగ పదవిలో ఉన్నప్పటికీ ఆయనను అవమానించేలా మాట్లాడటం అత్యంత ఆందోళనకరమైన విషయంఅనిమంత్రిఅన్నారు దళితులు ఉన్నత విద్యను అభ్యసించి ,ఉన్నత స్థాయికి ఎదిగి,అత్యున్నత పదవులను అలంకరించినప్పటికీ వారిపై వివక్ష,చిన్నచూపు,అవమానకరమైన వ్యవహారశైలి ఇంకా కొనసాగుతుండటం దురదృష్ట కరమన్నారు.స్వాతంత్ర్యం వచ్చిఎనభైఏళ్లు అవుతున్నాఇప్పటికి కూడాదళితులపట్లఇలాటి మానసికవివక్షకొనసాగడం బాధాకరం అని దామోదర్ రాజనర్సింహ అన్నారు.

రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమానత్వంగౌరవంకల్పించినప్పటికీ,దళితలు ఎంత ఉన్నత స్థాయికి ఎదిగినా వారిని ఇంకా చిన్నచూపు చూసే మనస్తత్వం కొనసాగడం సమాజశీ ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అంశమన్నారు. ఒక దళితుడు అత్యున్నత రాజ్యాంగ పదవిలో ఉన్నప్పుడు కూడా అవమాన కరమైన వ్యాఖ్యలకు గురి. కావడం కేవలం ఒక వ్యక్తిని అవమానించడం మాత్రమే కాదని, దళిత సమాజం పట్లఉన్న వివక్షపూరిత మనస్తత్వాన్నిప్రతిబింబిస్తుందని మంత్రిఅన్నారు.ప్రజాప్రతినిధులుతమహోద బాధ్యతలను గుర్తించి మాట్లాడాలని, పరస్పర గౌరవాన్ని పాటించాలని ఆయన సూచించారు. రాజ్యాంగ పదవుల గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ప్రజా ప్రతినిధి పైఉందన్నారు సదరు ఎమ్మెల్సీ పై శాసనసభ నియమావళి ప్రకారంచర్యలు తీసుకోవాలని, స్పీకర్ ను మంత్రి కోరారు....

## తాతా మధు వ్యాఖ్యలను ఖండిస్తూ కాంగ్రెస్ భారీ నిరసన ర్యాలీ.

### దళిత స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం రాజకీయ అహంకారానికి నిదర్శనం

### జిల్లా కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి పమ్మి అశోక్

**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం సెప్టెంబర్ 7:**తెలంగాణ శాసనసభ స్పీకర్ శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్ పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ వైరా మండల, పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు.



ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి పమ్మి అశోక్ మాట్లాడుతూ, రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న తెలంగాణ శాసనసభ స్పీకర్ శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్ పై అనుచిత, అవమానకర పదజాలంతో మాట్లాడటం తీవ్రంగా ఖండించదగిన విషయమన్నారు.



దళిత సమాజానికి చెందిన వ్యక్తి రాజ్యాంగబద్ధమైన అత్యున్నత పదవుల్లో ఒకటైన శాసనసభ స్పీకర్ పదవిలో కొనసాగుతున్న సమయంలో ఆయనను కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం ఒక ప్రజాప్రతినిధిని అవమానించడం మాత్రమే కాదని, యావత్ దళిత సమాజం ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్యగా కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు.

ఎమ్మెల్సీగా ఎన్నిక కావడానికి దళిత ప్రజాప్రతినిధుల ఓట్లు అవసరమైన తాతా మధు, అదే దళిత సమాజానికి చెందిన ప్రజాప్రతినిధిపై అవమానకర వ్యాఖ్యలు చేయడం ఆయన రాజకీయ అహంకారానికి నిదర్శనమని పమ్మి అశోక్ విమర్శించారు.

దళితులను అవమానించే విధంగా వ్యాఖ్యలు చేయడం బీఆర్ఎస్ రాజకీయ సంస్కృతిగా మారిందా? అని ప్రశ్నించారు. తాతా మధు వెంటనే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, దళిత సమాజానికి మరియు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచే వ్యాఖ్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధులపై అవమానకర వ్యాఖ్యలు చేసే వారిపై పోలీసులు చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

“దళిత సమాజం ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేస్తే చూస్తూ ఊరుకునేది లేదు. తాతా మధు వెంటనే తన వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పాలి. లేనిపక్షంలో ప్రజాస్వామ్య పద్ధతిలో మరింత పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతాం” అని కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు.

పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

అనంతరం తాతా మధు చేసిన వ్యాఖ్యలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ వైరా పోలీస్ స్టేషన్‌లో కాంగ్రెస్ నాయకులు పిటిషన్ సమర్పించి, కేసు నమోదు చేసి సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు.

ఈ నిరసన ర్యాలీలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు శీలం చంద్రశేఖర్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు వీరంశెట్టి సీతారాములు, జిల్లా నాయకులు పోదిల హరినాథ్, డాక్టర్స్ సెల్ అధ్యక్షులు డాక్టర్ కాపా మురళి కృష్ణ, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పణితి శ్రీనివాస్ రావు, సర్పంచులు నూతి వెంకటేశ్వర్లు, జవ్వాజి అశ్విని నాగరాజ్, తడికమళ్ళ నాగార్జున, కౌన్సిలర్లు మోర్ శ్రీకాంత్, రాచబంటి బలరామయ్య, ఉండ్రు శ్యాంబాబు, వేముల రత్నాకర్, కర్నాటి హనుమంతరావు, కొల్లి రమేష్, మిట్టపల్లి శ్రీనివాసరావు, చప్పిడి వెంకటేశ్వర్లు, పువ్వాళ్ళ రాము, తోటకూర గోపి, తెళ్ళూరి వీరయ్య, జవ్వాజి నాగరాజు, వేల్పుల వెంకటేశ్వర్లు, వంకూడోతు భిక్యా, సయ్యద్ అన్వర్, గరిడేపల్లి వెంకటేశ్వర్లు, ఖమ్మ మీరా, వేల్పుల రత్న భారత్, సరిపుడి కోటేశ్వరరావు, పాసంగులపాటి రవి, చింతనిప్పు ప్రసాద్, పరస రవి, తేజవత్ రాము, మోదుగు వెంకటి, షేక్ ఉద్దండు, షేక్ సైదులు, తోటకూర వీరబాబు, పూర్ణకంటి లక్ష్మయ్య తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, దళిత నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## భీమేశ్వరాలయంలో భక్తుల రద్దీపై ప్రత్యేక పర్యవేక్షణ

### క్యూలైన్లను పర్యవేక్షించిన డీఈవో ప్రతాప నవీన్





**వేములవాడ ప్రజాబలం ప్రతినిధి, సెప్టెంబర్ 7:** శ్రావణ మాసం చివరి సోమవారం సందర్భంగా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ శ్రీ భీమేశ్వర స్వామి ఆలయానికి భక్తులు భారీగా తరలివచ్చారు. స్వామివారి దర్శనం, కోడె మొక్కులు చెల్లించుకునేందుకు తెల్లవారుజాము నుంచే భక్తులు బారులు తీరారు.

ఈవో శ్రీమతి రమాదేవి ఆదేశాల మేరకు డీఈవో ప్రతాప నవీన్ ఆలయంలోనే ఉండి భక్తుల రద్దీని స్వయంగా పర్యవేక్షించారు. ఉచిత, శీఘ్ర, అతి శీఘ్ర దర్శన క్యూలైన్లను క్రమబద్ధీకరించడంతో పాటు కోడె మొక్కుల కౌంటర్ల వద్ద రద్దీ పెరగకుండా చర్యలు చేపట్టారు. భక్తుల కోసం గ్రీన్ టెంట్లు, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేశారు.

క్యూలైన్‌లో ఓ భక్తుడు అస్వస్థతకు గురికాగా డీఈవో వెంటనే స్పందించి సిబ్బంది సహాయంతో బయటకు తీసుకువచ్చి ఉపశమనం కల్పించారు. అనంతరం త్వరగా దర్శనం కల్పించారు. భక్తుల రాకపోకలకు రెండు ఎగ్జిట్ గేట్లు ఏర్పాటు చేసి తొక్కిసలాటకు అవకాశం లేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

ఆలయ సిబ్బందితో పాటు ఎస్పీఎఫ్, హోంగార్డులు, పోలీసు సిబ్బంది భద్రతా విధుల్లో పాల్గొన్నారు. పదవీ విరమణ పొందిన పాత ఉద్యోగులు సైతం స్వచ్ఛందంగా క్యూలైన్ల నిర్వహణలో సహకరించారు. అధికారులు భక్తుల వద్దకు వెళ్లి సౌకర్యాలపై ఆరా తీశారు. ఈవో రమాదేవి మార్గదర్శకత్వంలో ఆలయ అధికారులు సమన్వయంతో పనిచేయడంతో దర్శనాలు ప్రశాంతంగా కొనసాగాయి.

## స్వదేశ్ దర్శన్ పేరుతో బుద్ధిస్ట్ ఎక్స్ పీరియన్స్

శ్రీకాకుళం సెప్టెంబర్ 7, స్వదేశ్ దర్శన్ 2.0, ప్రసాద్ పథకాల కింద మొత్తం రూ. 419.30 కోట్లతో రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. స్వదేశ్ దర్శన్ పథకంలో రూ. 152 కోట్లతో ఇప్పటికే అరకు గుహలు, సూర్యలంక బీచ్ అభివృద్ధి చేయడంతో పాటు నాగార్జునసాగర్ వద్ద బుద్దిస్ట్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ కూడా నిర్మిస్తున్నారు. భవిష్యత్‌లో అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయలో రూ. 101.07 కోట్లతో అరకు కల్చరల్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్, శ్రీకాకుళం జిల్లాలో ప్రసిద్ధి చెందిన అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయ పరిసరాలు, గన్నవరం మైస్ సెంటర్ ఏర్పాటు, నెల్లూరు జిల్లాలో వేదగిరి లక్ష్మి నరసింహస్వామి ఆలయ అభివృద్ధి చేయనున్నారు.ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న ప్రకృతి అందాలను బయట ప్రపంచానికి చూయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. టూరిస్ట్ ప్లేస్‌లుగా పేరొందిన కొన్ని ప్రదేశాలను మరింత అందంగా మార్చేందుకు భారీగా నిధులు వెచ్చిస్తున్నారు. స్వదేశ్ దర్శన్ 2.0, ప్రసాద్ పథకాల కింద మొత్తం రూ. 419.30 కోట్లతో రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల అభివృద్ధికి ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది.అరకు, అరసవల్లి, గన్నవరం, వేదిగిరి ప్రాంతాల అభివృద్ధికి కేంద్రానికి ప్రతిపాదనలు పంపిన టెండర్లకు కూడా ఆహ్వానించింది. స్వదేశ్ దర్శన్ పథకంలో రూ. 152 కోట్లతో ఇప్పటికే అరకు గుహలు, సూర్యలంక బీచ్ అభివృద్ధి చేయడంతో పాటు నాగార్జునసాగర్ వద్ద బుద్దిస్ట్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ కూడా నిర్మిస్తున్నారు.అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయలో రూ. 101.07 కోట్లతో అరకు కల్చరల్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ఏర్పాటు చేయనున్నారు. కొత్తవలసలో ఐటీడీఏకు చెందిన 19.23 ఎకరాల స్థలంలో దీన్ని అభివృద్ధి చేయనున్నారు. గిరిజన సంస్కృతి, స్థానిక వంటకాలు, అరకు కాఫీ, చిరు ధాన్యాల ప్రత్యేకతలను పర్యాటకులకు పరిచయం చేయనున్నారు.శ్రీకాకుళం జిల్లాలో ప్రసిద్ధి చెందిన అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయ పరిసరాలను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రూ. 107.94 కోట్లతో అరసవల్లి సన్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ఏర్పాటు చేయనున్నారు. నాగావళి నది ఒడ్డున చారిత్రక డచ్ హెరిటేజ్ భవనాన్ని పునరుద్ధరించి వినియోగంలోకి తీసుకురానున్నారు.

## వ్యవసాయ కూలి నుంచి లేడీ డాన్ వరకు..

తిరుపతి, సెప్టెంబర్ 7, చిన్న గదిలో ఉంటూ.. వ్యవసాయ కూలీగా జీవితం మొదలుపెట్టిన ఓ మహిళ మాజీ మంత్రి కీలక అనుచరుడి సాయంతో లేడీ డాన్‌గా ఎదిగింది. ఆమె మదలనపల్లెకు చెందిన కోనేటి సులోచన. స్థానికంగా ‘లేడీ డాన్’గా చలామణి అవుతూ అనేక అక్రమాలకు పాల్పడింది. శనివారం కోనేటి సులోచన ఇంట్లో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. మాజీ మంత్రి ముఖ్య అనుచరుడితో చేతులు కలిపి వందల కోట్ల విలువైన భూములను అక్రమంగా కాజేసిన వ్యవహారం వెలుగులోకి రావడంతో.. కోర్టు ఆదేశాలతో తనిఖీలు నిర్వహించారు. మదనపల్లె డీఎస్పీ బుచ్చిరాజు ఆధ్వర్యంలో సీఐలు మోహన్ కుమార్, రాజారెడ్డి, మహమ్మద్ రఫీలతో కూడిన మూడు టీమ్‌లు నిర్వహించాయి. సులోచన నివాసంతో పాటు ఆమె సోదరుడు శ్రీనివాసులు ఇంట్లో తనిఖీలు చేశారు. పోలీసులు తనిఖీల్లో 50 రకాల కీలక ఆస్తి డాక్యుమెంట్స్ స్వాధీనం చేసుకున్నారు. వీటిల్లో 15 ఫోర్జరీ సంతకాలు చేసి ఉంచిన పాత ఖాళీ బాండు పేపర్లు బయటపడ్డాయి. అప్పులు ఇచ్చినట్లు నమ్మించి, వారి నుంచి బలవంతంగా ఖాళీ బాండ్లపై సంతకాలు తీసుకుని ఆస్తులు లాక్కోవడానికి వీటిని ఉపయోగించినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఈ పత్రాలను ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీకి పంపినట్లు డీఎస్పీ తెలిపారు.

# నర్సు హత్య ఘటనపై మేజిస్టీరియల్ విచారణ

### ఫాస్ట్రాక్ కోర్టు ద్వారా సత్వర న్యాయం అందించాలని ముఖ్య మంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశం

హైదరాబాద్ ఇటీవల హైదరాబాద్ శివార్లలోని తుక్కుగూడలో ప్రైవేట్ హాస్పిటల్ లో నర్సు హత్యాచారానికి గురైన ఘటనను ముఖ్యమంత్రి ఎ. రేవంత్రెడ్డి తీవ్రంగా పరిగణించారు. ఈ ఘటనకు సంబంధించిన అన్ని అంశాలపై సమగ్రంగా మేజిస్టీరియల్ విచారణ జరిపించాలని అధికారులను ఆదేశించారు. ఘటనకు దారితీసిన పరిస్థితులు, బాధితురాలు ఉంటున్న వసతి ప్రదేశంలో భద్రతా ఏర్పాట్లు, సంబంధిత సంస్థ నిర్వహణలో ఏవైనా నిర్లక్ష్యాలు ఉన్నాయా, మహిళా ఉద్యోగుల భద్రత విషయంలో పాటించాల్సిన నిబంధనలు అమలయ్యాయా అనే అంశాలన్నింటినీ విచారణలో పరిశీలించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.ఈ కేసులో ఇప్పటికే నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్న నేపథ్యంలో దర్యాప్తును అత్యంత పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు.

దర్యాప్తు, ఫోరెన్సిక్ నివేదికలు, ఇతర సాంకేతిక ఆధారాల సేకరణను వీలైనంత వేగంగా పూర్తి చేసి సమగ్ర ఛార్జీషీట్ దాఖలు చేసేలా పోలీసు ఉన్నతాధికారులు కేసును నిరంతరం పర్యవేక్షించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

ఈ కేసులో బాధిత కుటుంబానికి సత్వర న్యాయం అందేలా ఫాస్ట్రాక్ కోర్టు ద్వారా విచారణ చేపట్టేందుకు అవసరమైన చర్యలను ప్రారంభించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. న్యాయశాఖ, పోలీసు శాఖ, ప్రాసిక్యూషన్ విభాగాలు సమన్వయంతో పనిచేసి కేసు విచారణలో జాప్యం లేకుండా చూడాలని సూచించారు.బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఇప్పటికే ప్రభుత్వం తరపున మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క కుటుంబాన్ని పరామర్శించారు. ప్రభుత్వం తరపున ఆర్థిక సహాయం అందించడంతో పాటు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేశారు. ఘటనకు కారణమైన వ్యవస్థాపరమైన లోపాలను గుర్తించి సరిదిద్దాలని అధికారులను ఆదేశించారు. ఫాస్ట్రాక్ కోర్టు ద్వారా వీలైనంత త్వరగా కేసు విచారణ పూర్తయ్యేలా అన్ని చర్యలు తీసుకోవాలని చెప్పారు.

## నెల రోజులు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలి: కేటీఆర్

హైదరాబాద్ సోమవారం నాడు వర్షాకాల అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం సందర్భంగా గన్ పార్కోని అమరవీరుల స్థూపానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి నివాళులు అర్పించారు. ప్రజా సమస్యలు, కాంగ్రెస్ 1000 రోజుల పాలన, 22o వంటి అంశాలపై చర్చించేందుకు నెల రోజులపాటు శాసనసభ సమావేశాలు నిర్వహించాలని కేటీఆర్ కోరారు. ఆరు గ్యారంటీలు, 420 హామీల పేరుతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం, 1000 రోజులైనా ఆ హామీలను నెరవేర్చడంలో ఘోరంగా విఫలమైందంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నిరసన వ్యక్తం చేసారు. ప్రధాన ప్రతిపక్షంగా ప్రజల తరఫున ప్రభుత్వాన్ని నిలదీస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ తెలిపారు.

నల్ల టీషర్టతో అసెంబ్లీకి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ 1000 రోజుల పాలనకు నిరసనగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నల్ల టీషర్టతో అసెంబ్లీ, కౌన్సిల్ సమావేశాలకు హాజరయ్యారు. వినూత్న రీతిలో నిరసన తెలిపిన బీఆర్ఎస్ నేతలు.. ప్రభుత్వ పాలనపై తమ నిరసనను వ్యక్తం చేశారు.

## మెగా డీఎస్సీపై... .ఓపెన్ డిబేట్ సాధ్యమా

విజయవాడ, సెప్టెంబర్ 7, ఆంధ్రప్రదేశ్‌లో మెగా డీఎస్సీ ఉపాధ్యాయ నియామకాల చుట్టూ ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ నడుపుతున్న రాజకీయ డ్రామా రోజురోజుకూ తన విశ్వసనీయతను కోల్పోతోంది. నియామక ప్రక్రియలో అక్రమాలు జరిగాయంటూ సామాజిక మాధ్యమాల్లో బురద చల్లడం, ప్రెస్ మీట్లలో వ్యాఖ్యలు చేసి వెళ్లిపోవడం కాకుండా.. ధైర్యముంటే బహిరంగ చర్చకు రావాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విసిరిన సవాల్‌పై వైసీపీ నోరు మెదపకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఆధారాలుంటే ప్రజల ముందు పెట్టాలి తప్ప, తెరవెనుక దాక్కుని రాళ్లేయడం, ముసుగు సంస్థలతో తప్పుడు ప్రచారాలు చేయించడం, రాజకీయ ప్రయోజనాల కోసం సీబీఐ విచారణ కోరడం రాజకీయం కాదు. అసలు సీబీఐకి అప్పగించిన ఏ కేసును ఆ సంస్థ ఎంత త్వరగా పూర్తి చేసిందో వైసీపీ స్పష్టం చేయగలదా? మాజీ ఎంపీ వివేకానందరెడ్డి హత్య కేసు విచారణే ఏళ్ల తరబడి కొలిక్కిరాకుండా సాగుతుంటే, ఉపాధ్యాయ నియామకాలను సీబీఐకి ఇవ్వాలనడం పదహారు వేల మంది టీచర్ల కుటుంబాలపై కుట్రలు చేయడమే.ప్రజాస్వామ్యంలో ఏ విషయమైనా తేలాల్సింది ప్రజల సమక్షంలో, చట్టసభల ప్రాంగణంలో! విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అసెంబ్లీ లోపలైనా, బయటైనా, సమయం–వేదిక జగన్ రెడ్డి ఇష్టానికే వదిలేస్తూ పాయింట్ టు పాయింట్ చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. 16,347 ఉపాధ్యాయ పోస్టులను రికార్డు స్థాయిలో 148 రోజుల్లో అత్యంత పారదర్శకంగా, టీసీఎస్ ప్లాట్‌ఫారమ్ ద్వారా, సుప్రీంకోర్టు రిజర్వేషన్ నిబంధనలకు కట్టుబడి భర్తీ చేశామని ప్రభుత్వం ఆధారాలతో సహా వివరణ ఇచ్చింది.141 రకాల కోర్టు కేసులతో నియామకాలను నిలిపివేసేందుకు ప్రయత్నించినా, న్యాయస్థానాలు వాటిని కొట్టివేస్తూ నోటిఫికేషన్‌లోని పారదర్శకతను సమర్థించాయి. ఇన్ని వాస్తవాలు కళ్లముందు కనిపిస్తుంటే, నాకు నేను చాలు అంటూ వైసీపీకి చెందిన ద్వితీయ శ్రేణి నేతలతో కవర్ డ్రైవ్‌లు వేయించడం జగన్ రెడ్డికి రాజకీయంగా మారింది. .నేరుగా లోకేష్ రాజీనామాను డిమాండ్ చేస్తున్నది జగన్ మోహన్ రెడ్డి అయినప్పుడు, ఆయనే స్వయంగా వచ్చి చర్చకు కూర్చోవాల్సిన బాధ్యత ఉంది. విద్యాశాఖ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ప్రతి అంశంలోనూ పారదర్శకత పాటిస్తున్నామని మంత్రి లోకేష్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అసెంబ్లీలో డేటాను సమర్పించారు. మరి వైసీపీ వద్ద నిజంగానే డీఎస్సీ ప్రక్రియలో లోపాలు ఉన్నాయనడానికి ఆధారాలు ఉంటే, వాటిని మంత్రి ముందే బహిర్గతం చేసి ప్రజలకు ఎందుకు నిజాలు తెలియజేయకూడదు? బెయిల్ నిబంధనలు లేదా విచారణల సాకు చూపి చట్టసభలకు రాకుండా తప్పించుకోవడం ద్వారా తాము చేస్తున్న ఆరోపణలు కేవలం రాజకీయ బురదచల్లుడు చర్యలేనని జగన్ స్వయంగా అంగీకరించినట్లవుతోంది.రోజుకో డ్రామా ఆడటం, ఆధారం లేని ఆరోపణలు చేసి పారిపోవడం వల్ల ప్రతిపక్షానికే నష్టం. గత ఐదేళ్ల తమ హయాంలో ఒక్క డీఎస్సీని కూడా నిర్వహించలేక, దాదాపు 12 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల నుంచి ప్రైవేట్ బడులకు వెళ్లేలా విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసిన చరిత్ర వైసీపీది. అటువంటిది కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి మొదటి సంతకంతో మెగా డీఎస్సీని పూర్తి చేసి వేలాది నిరుద్యోగ యువతకు నియామక పత్రాలు అందిస్తే ఉద్యోగం రాని వారిని రెచ్చగొట్టేందుకు కుట్రలకు పాల్పడుతున్నారు. ఇప్పటికైనా మించిపోయిందేమీ లేదు. నిరుద్యోగ యువత భవిష్యత్తు , విద్యార్హతల ఆధారంగా జరిగిన మెగా డీఎస్సీపై ఉన్న సందేహాలను నివృత్తి చేసుకోవడానికి జగన్ రెడ్డికి మంచి అవకాశం ఉంది. మీడియా ముందు హాఫ్ ట్రూత్స్ మాట్లాడటం, బాధ్యతారాహిత్యంగా రాజీనామాలు కోరడం మాని, లోకేష్ విసిరిన సవాల్‌ను స్వీకరించి ముఖాముఖి చర్చకు రావాలి. ఆధారం లేని బురద చల్లే రాజకీయాలకు ముగింపు పలికి, ప్రజల సమక్షంలో నిజానిజాలు తేల్చుకోవడమే ప్రజాస్వామ్య పద్ధతి!పారి పోవడం వీరత్వం అనిపించుకోదు; నిజాయితీ ఉంటే జగన్ రెడ్డి చర్చల వేదికపై అడుగుపెట్టాల్సిందే

## బీఆర్ఎస్ పార్టీలో చేరిన 150 మంది యువకులు..

### గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించిన మాజీ ఎమ్మెల్యే గండ్ర..

భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 23వ వార్డుకు చెందిన సుమారు 150 మంది యువకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. మనీష్ అధ్యక్షతన పెద్ద సంఖ్యలో యువత మాజీ ఎమ్మెల్యే గండ్ర సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరగా,వారికీ మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డిరు వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా జీవన్, రుచిత్,వేణు,కిరణ్, ఆకాశ్, సంపత్, సోహెల్, కారుణ్య, సంతోష్, శ్రీ చరణ్, సాయి కమల్, సాయి తేజ, శేషాంత్, ఆదిత్య, సాయి కిరణ్, రాజక్, శివ, వంశీ, మనోజ్, కార్తికేయ, సన్నీ, వివేక్, రాఖీ, సందీప్, విక్కీ, అనిల్ యారా, సాయి శివ, అనిల్, శ్రీకాంత్, అజయ్, చరణ్, సాయి, హరీష్, రాకేష్, బన్నీ, రేవంత్, సిద్ధు, సంజయ్, నిఖిల్, అన్వేష్, భారత్, సూర్య, జయంత్, హర్ష వర్ధన్, జంగంపెల్లి సాయి, సాయి చరణ్ (బ్యారెక్స్) తదితరులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ.. యువత భవిష్యత్‌తో పాటు భూపాలపల్లి నియోజకవర్గ అభివృద్ధి కోసం బిఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని అన్నారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతుకగా బిఆర్ఎస్ పార్టీ నిలుస్తోందని పేర్కొన్నారు.యువత పెద్ద సంఖ్యలో బిఆర్ఎస్ పార్టీలో చేరడం ప్రజల్లో,ముఖ్యంగా యువతలో బిఆర్ఎస్‌పై ఉన్న నమ్మకానికి నిదర్శనమని అన్నారు. రాబోయే రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ముందుండాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,23వ వార్డు యువత తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ గైర్హాజరు కథేంటీ...

హైదరాబాద్, సెప్టెంబర్ 7, తెలంగాణ శాసనసభ సమావేశాలు ప్రారంభమైనప్పుడల్లా రాజకీయ వర్గాల్లోనూ, సాధారణ ప్రజానీకంలోనూ నలిగే ఏకైక ప్రశ్నకు బీఆర్ఎస్ నుంచి ఇప్పటివరకు స్పష్టమైన సమాధానం లభించలేదు . అసలు కేసీఆర్ అసెంబ్లీకి ఎందుకు వెళ్లరు అనేదే ఆ ప్రశ్న. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సభకు రాని కేసీఆర్ రాజీనామా చేయాలి అంటూ వరుస ధర్నాలు, ఆందోళనలు చేపడుతున్న వేళ.. ఆయన నిర్వహించిన బీఆర్ఎస్ఎల్పీ సమావేశంపై అందరి దృష్టి పడింది. కానీ అక్కడ కూడా రేవంత్‌ను బూతుల రాయుడు అంటూ తీవ్ర పదజాలంతో విమర్శించారే తప్ప, తాను సభకు హాజరుకాకపోవడానికి గల అసలు కారణాలను చెప్పడంలో కేసీఆర్ మళ్లీ విఫలమయ్యారు. త్వరలోనే పాదయాత్ర చేస్తానని ప్రకటించడం ద్వారా తనకు ఆరోగ్య సమస్యలేవీ లేవనే స్పష్టతనిచ్చిన కేసీఆర్, అసెంబ్లీ దాకా అడుగులు పడకపోవడానికి గల సమీకరణాలను మాత్రం గోప్యంగానే ఉంచారు.కేసీఆర్ అసెంబ్లీకి రాకపోవడానికి ప్రధాన కారణం ఆయన భావించే రాజకీయ స్థాయి . దశాబ్దకాలం పాటు ముఖ్యమంత్రిగా రాష్ట్రాన్ని ఏకఛత్రాధిపత్యంగా ఏలిన తనకు, తానెంతో తేలికగా తీసిపారేసిన రేవంత్ రెడ్డి సభానాయకుడి హోదాలో బెంచీపై కూర్చోవడం కేసీఆర్ మనస్తత్వం అంగీకరించడం లేదనేది బహిరంగ రహస్యం. తనకంటే వయస్సులో, రాజకీయ అనుభవంలో చిన్నవాడైన రేవంత్ ముందు తాను ప్రతిపక్ష నేతగా మైక్ కోసం నిలబడటాన్ని తన స్థాయికి తక్కువగా ఆయన భావిస్తున్నారని భావిస్తున్నారు. అయితే, ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయ స్థాయిలు అనేవి స్వయంకృతాపరాధాలు కావు, ప్రజలు తీర్పు ద్వారా కట్టబెట్టే పదవులు మాత్రమే అనే కనీస సత్యాన్ని గులాబీ అధినేత విస్మరిస్తున్నారనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి.సభకు వెళ్తే రేవంత్ రెడ్డి , కాంగ్రెస్ మంత్రులు తనను వ్యక్తిగతంగా అవమానిస్తారనే భయం కేసీఆర్‌కు ఉందనుకోవడం కూడా పొరపాటే. ఒకవేళ ప్రతిపక్ష నేత స్థాయి వ్యక్తిని సభలో అధికార పక్షం అనుచితంగా అవమానిస్తే, అది రాజకీయంగా సానుభూతిని తెచ్చిపెట్టి కేసీఆర్‌కే మేలు చేస్తుంది. పైగా కేసీఆర్ సభకు వస్తే పూర్తి స్థాయి గౌరవం ఇస్తాం అని రేవంత్ రెడ్డి స్వయంగా ఒకటిరెండు సార్లు ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్‌లో జగన్‌మోహన్ రెడ్డి తనకు ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వడం లేదనే సాంకేతిక కారణాన్ని చూపి సభను బహిష్కరిస్తున్నారు. కానీ కేసీఆర్‌కు ఆ సమస్య లేదు. ఆయనను అసెంబ్లీ రికార్డులు అధికారిక ప్రతిపక్ష నేత గా గుర్తించాయి, ఆ పదవికి ఉండే క్యాబినెట్ హోదా, సదుపాయాలు కూడా ఆయన ఖాతాలోనే ఉన్నాయి. ఇన్ని అనుకూలతలు ఉండి కూడా కారణం చెప్పకుండా సభకు దూరంగా ఉండటం తీవ్ర అస్పష్టతకు దారితీస్తోంది బీఆర్ఎస్ నాయకత్వం కేసీఆర్ సభకు వస్తే రేవంత్ తట్టుకోలేడు అంటూ పైపైన చేసే వ్యాఖ్యలు కేవలం కేడర్‌లో ధైర్యాన్ని నింపేందుకు ఉపయోగపడతాయే తప్ప, సాధారణ ఓటరును మెప్పించలేవు. శాసనసభ అనేది ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసే అత్యున్నత వేదిక. అటువంటి వేదికను వదిలేసి, రాజ్యాంగబద్ధమైన ప్రతిపక్ష నేత బాధ్యతను పక్కనబెట్టి ఇతర రాజకీయాలు చేయడం సభా బాధ్యతల నుంచి పారిపోతున్నారనే సంకేతాలు ప్రజల్లోకి వెళున్నాయి. తాను పాల్గొనని సభకు ప్రతిపక్ష నేతగా కొనసాగడం కంటే, ఆ బాధ్యతలను సభకు క్రమం తప్పకుండా వచ్చే కెటిఆర్ లేదా హరీష్ రావు లాంటి క్రియాశీల నేతలకు అప్పగించి ఉంటే బాధ్యతాయుతంగా ఉండేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మొత్తానికి, కేసీఆర్ అనుసరిస్తున్న ఈ సైలెంట్ బాయ్‌కాట్ వ్యూహం కాంగ్రెస్ పార్టీకి రాజకీయంగా పెద్ద ఆయుధంగా మారింది. ప్రజలు ఇచ్చిన ప్రతిపక్ష హోదాను గౌరవించని నేత అంటూ కాంగ్రెస్ చేస్తున్న ప్రచారం రోజురోజుకూ బలాన్ని పుంజుకుంటోంది. డీఎస్సీ, రైతు రుణమాఫీ, కాళేశ్వరం లాంటి కీలక అంశాలపై సభలో నేరుగా ముఖ్య మంత్రితో తలపడి ప్రభుత్వాన్ని డిఫెన్స్‌లో పడేసే అవకాశం స్పష్టంగా ఉన్నప్పటికీ, కేవలం వ్యక్తిగత పట్టింపుల వల్ల ఆ అవకాశాన్ని బీఆర్ఎస్ చేజార్చుకుం టోందని అనుకోవచ్చు.

# పీఎం రేసులోకి కొత్త పేర్లు

చెన్నై, సెప్టెంబర్ 7, భారత జాతీయ రాజకీయం ఎప్పుడు ఏ మలుపు తిరుగుతుందో ఊహించడం కష్టం. 2029 సార్వత్రిక ఎన్నికలకు సమయం ఉన్నప్పటికీ, ప్రధానమంత్రి రేసు చుట్టూ ఇప్పుడే ఆసక్తికరమైన చర్చ మొదలైంది. కాంగ్రెస్ పార్టీకి జాతీయ స్థాయిలో రాహుల్ గాంధీ స్పష్టమైన ప్రధాని ముఖచిత్రం అనడంలో ఎలాంటి సందేహం లేదు. అయితే, కాంగ్రెస్‌కు ఏకపక్షంగా సొంత బలం దక్కక, ప్రాంతీయ మిత్రపక్షాల మద్దతుతోనే కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సిన పరిస్థితి వస్తే మాత్రం ప్రధానమంత్రి అభ్యర్థిత్వం అతిపెద్ద చిక్కుముడిగా మారుతుంది. గత చరిత్రను గమనిస్తే, సమాజ్‌వాదీ పార్టీ, తృణమూల్ కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ వంటి బలమైన ప్రాంతీయ పార్టీలు రాహుల్ గాంధీ నాయకత్వాన్ని ఏకగ్రీవంగా అంగీకరించడంలో ఎప్పుడూ సంకోచిస్తూనే ఉన్నాయి.ఇలాంటి పరిస్థితుల్లోనే మిత్రపక్షాలకు అందరికీ ఆమోదయోగ్యమైన ఒక సర్వసమ్మత నాయకుడి అన్వేషణ ప్రారంభమవుతుంది. భారత ప్రజాస్వామ్య చరిత్రలో 1996లో హెచ్.డి. దేవేగౌడ, ఐ.కె. గుజ్రాల్ వంటి నాయకులు అనూహ్యంగా ప్రధాని పీఠాన్ని అధిరోహించిన సందర్భాలు ఉన్నాయి. సరిగ్గా ఈ సమీకరణాల్లోనే, తమిళనాడు ముఖ్యమంత్రి , తమిళగ వెట్రి కళగం అధినేత జోసెఫ్ విజయ్ పేరు జాతీయ స్థాయిలో చర్చకు వస్తోంది. సంకీర్ణ రాజకీయాల్లో విపక్ష ప్రాంతీయ పార్టీలు తమ కంటే బలమైన జాతీయ నేతను ప్రధానిగా అంగీకరించడానికి ఇష్టపడవు. అక్కడ వివాదరహితుడు, అందరికీ సర్దుబాటు అయ్యే కొత్త ముఖానికే ఎక్కువ అవకాశాలు ఉంటాయి. ఇటీవల వెలువడిన సర్వేలో ప్రధాని రేసులో నరేంద్ర మోదీ, రాహుల్ గాంధీ తదుపరి స్థానంలో అనూహ్యంగా విజయ్ మూడో స్థానంలో నిలిచారు. ఇది టీవీకే శ్రేణుల్లోనే కాకుండా జాతీయంగా చర్చనీయాంశమైంది.తమిళనాడులోని టీవీకే మంత్రులు, సీనియర్ నేతలు విజయ్ కేవలం తమిళనాడుకే పరిమితం కాదని, ఉత్తరాది ప్రజలు కూడా ఆయన వైపే చూస్తున్నారని వ్యాఖ్యానించడం కాంగ్రెస్–టీవీకే కూటమిలో విబేధాలకు దారితీసింది. విజయ్‌కి ఏ జాతీయ పార్టీతోనూ దీర్ఘకాల శత్రుత్వం లేదు. దక్షిణాదికి చెందిన ప్రజాదరణ పొందిన నాయకుడు కావడం, సిద్ధాంతపరమైన తీవ్రమైన మరకలు లేకపోవడం వల్ల ప్రాంతీయ పార్టీల అధినేతలకు రాహుల్ కంటే విజయ్‌ను ప్రధాని అభ్యర్థిగా మద్దతు ఇవ్వడం సులువుగా మారవచ్చు.విజయ్‌ని ప్రధాని అభ్యర్థిగా ప్రొజెక్ట్ చేయడంపై కాంగ్రెస్ తీవ్రంగా స్పందిస్తోంది. తమిళనాడు కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మాణికం ఠాగూర్ దీనిని టీవీకే నేతల ఫ్యాన్ క్లబ్ మానసిక స్థితి గా అభివర్ణించడమే కాక, 2029లో రాహుల్‌ను ప్రధానిగా అంగీకరించకపోతే తమిళనాడు కేబినెట్ నుంచి కాంగ్రెస్ మంత్రులు తప్పుకుంటారని హెచ్చరించే స్థాయికి విభేదాలు వెళ్లాయి. అయినప్పటికీ, ఎన్నికల అనంతర సమీకరణాల్లో సీట్ల సంఖ్యే కీలక పాత్ర పోషిస్తుంది. భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయాలు ఎప్పుడూ ఒకే లైన్‌లో సాగవు. కేంద్రంలో అధికార పీఠాన్ని దక్కించుకోవడంలో కాంగ్రెస్ సంఖ్యాబలం తగ్గి, రాహుల్ గాంధీ పేరుపై మిత్రపక్షాల మధ్య అంగీకారం కుదరకపోతే.. ప్రత్యామ్నాయంగా దక్షిణాది నుంచి విజయ్ లాంటి పాపులర్ మాస్ లీడర్ ఎదిగే అవకాశాలను ఏమాత్రం కొట్టిపారేయలేం.

## తెలంగాణ ద్రోహి కేటీఆర్ గారూ.. సినిమా డైలాగులు కాదు, తెలంగాణ యువతకు ఉద్యోగాలు కావాలి: ఎంపీ వంశీకృష్ణ

పెద్దపల్లి: తెలంగాణ యువత భవిష్యత్తును రాజకీయాలకు బలి చేయకుండా, వారికి విద్య, నైపుణ్యాలు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంపై దృష్టి పెట్టాలని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. గత పదేళ్ల పాలనలో యువతకు ఇచ్చిన హామీలు, ఉద్యోగాల విషయంలో జరిగిన పరిణామాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సుమారు 1,500 మంది విద్యార్థులు ప్రాణత్యాగం చేశారని, వారి త్యాగాలతో ఏర్పడిన రాష్ట్రంలో పదేళ్ల పాటు కీలక బాధ్యతల్లో ఉన్న నాయకులు తెలంగాణ యువత భవిష్యత్తుపై మరింత బాధ్యతగా వ్యవహరించాల్సి ఉండేదని ఎంపీ వంశీకృష్ణ అన్నారు.

“ఐటీ మంత్రిగా ఉన్న సమయంలో తెలంగాణ యువతకు ఎన్ని ఉద్యోగాలు కల్పించారు? యువత నైపుణ్యాలను పెంచేందుకు ఏం చేశారు? ఉపాధి అవకాశాల కోసం ఎలాంటి ప్రణాళికలు రూపొందించారు?” అని కేటీఆర్‌ను ప్రశ్నించారు.పరీక్షా పత్రాల లీకేజీలు, ఉద్యోగ నియామకాలపై వచ్చిన అవకతవకల ఆరోపణలు విద్యార్థులు, నిరుద్యోగ యువత జీవితాలపై తీవ్ర ప్రభావం చూపాయని ఎంపీ పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేసే ఏ చర్యనైనా తాము తీవ్రంగా వ్యతిరేకిస్తామని స్పష్టం చేశారు.“సినిమా డైలాగులు చెప్పడం సులభం. కానీ తెలంగాణ ప్రజలకు కావాల్సింది డైలాగులు కాదు.. వాస్తవాలు, ఉద్యోగాలు, భవిష్యత్తు. ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారు” అని వంశీకృష్ణ అన్నారు.

పదవులు శాశ్వతం కాదని, ప్రజల భవిష్యత్తే శాశ్వతమైన అంశమని ఎంపీ వ్యాఖ్యానించారు. కుటుంబ సభ్యులకు పదవులు, నామినేటెడ్ పోస్టులు, ఎమ్మెల్సీ, రాజ్యసభ అవకాశాలు కల్పించారనే విమర్శలు ప్రజల్లో ఉన్నాయని అన్నారు.

“మేము నామినేటెడ్ పదవులతో రాలేదు. ప్రజలు మాకు ఓటు వేసి గెలిపించారు. ప్రజలు ఇచ్చిన బాధ్యతతో ప్రజల కోసం పనిచేస్తున్నాం” అని పేర్కొన్నారు.తెలంగాణ యువతను ప్రపంచస్థాయిలో నిలబెట్టడమే తమ లక్ష్యమని వంశీకృష్ణ అన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు కూడా జర్మనీ, జపాన్ వంటి దేశాలకు వెళ్లి అంతర్జాతీయ స్థాయిలో విద్య, నైపుణ్యాలు, ఉద్యోగ అవకాశాలు పొందేలా అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.“మీకు నిజంగా ధైర్యం ఉంటే రాజకీయ డైలాగులు చెప్పడం కాకుండా తెలంగాణ యువతకు ఉద్యోగాలు కల్పించే పనులు చేయండి. యువత భవిష్యత్తు కోసం పనిచేయండి. తెలంగాణ ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారు. ప్రజల తీర్పే అంతిమ తీర్పు” అని అన్నారు.

తెలంగాణ యువత హక్కుల కోసం, వారి భవిష్యత్తు కోసం తాము నిరంతరం పోరాడుతామని, ఎన్ని అడ్డంకులు ఎదురైనా వెనక్కి తగ్గేది లేదని ఎంపీ గడ్డం వంశీకృష్ణ స్పష్టం చేశారు.

# హైదరాబాద్‌లో భూగర్భ జలాలపై ఆందోళన

హైదరాబాద్, సెప్టెంబర్ 7, ఈ ఏడాది వర్షాకాలంతో భూగర్భ జలాల్లో స్వల్ప మెరుగుదల కనిపించినా.. గత ఏడాది లోటు కారణంగా ఇంకా అడుగంటే ఉన్నాయి. 2026 ఆగస్టులో సగటు నీటిమట్టం 11.20 మీటర్లకు పడిపోగా.. గత ఏడాది 6.36 మీటర్లుగా ఉంది. కుత్బుల్లాపూర్‌లో ఏకంగా 39.89 మీటర్ల లోతు నమోదైంది. లోటు వర్షపాతం, వర్షపు నీటి రీచార్జ్ లోపాలు పరిస్థితిని తీవ్రతరం చేస్తున్నాయి. అయితే మేతో పోలిస్తే ఆగస్టులో 0.80 మీటరు పెరుగుదల నమోదైంది. 11 మండలాల్లో నీటిమట్టం ఇంకా 20 మీటర్లకు మించి లోతులో ఉండటం ఆందోళన కలిగిస్తోంది. హైదరాబాద్‌లో ఈ ఏడాది వర్షాల కారణంగా భూగర్భ జలాల పరిస్థితిలో కొంత మెరుగుదల కనిపించినప్పటికీ.. గత ఏడాది నమోదైన భారీ లోటును పూర్తిగా పూడ్చే స్థాయిలో మాత్రం పునరుద్ధరణ జరగలేదు. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తీరులో వచ్చిన మార్పులు, ఈ ఏడాది లోటు వర్షాలతో నగరంలో భూగర్భ జలాలపై ఒత్తిడి మరింత పెరిగింది. భూగర్భ జలాల శాఖ తాజా అంచనాల ప్రకారం.. 2026 ఆగస్టులో హైదరాబాద్‌లో సగటు భూగర్భ జల మట్టం 11.20 మీటర్ల లోతులో నమోదైంది. 2025 ఆగస్టులో ఇది 6.36 మీటర్లుగా ఉండేది. అంటే కేవలం ఏడాది వ్యవధిలోనే సగటు నీటిమట్టం దాదాపు ఐదు మీటర్లు లోతుకు పడిపోయింది. నగరంలోని ఉత్తర, వాయవ్య, తూర్పు ప్రాంతాలతో పాటు వేగంగా పట్టణీకరణ చెందుతున్న నగర దక్షిణ శివారు ప్రాంతాల్లో పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. ముఖ్యంగా కుత్బుల్లాపూర్‌లో తీవ్ర లోటు నమోదైంది. అక్కడ ఆగస్టులో భూగర్భ జల మట్టం 39.89 మీటర్ల లోతులో నమోదైంది. గత ఏడాది ఇదే సమయంలో 14.15 మీటర్లుగా ఉండగా.. ఏకంగా 27.74 మీటర్ల తేడా కనిపించింది. తిరుమలగిరిలో 13.73 మీటర్ల పతనంతో నీటిమట్టం 17.68 మీటర్లకు చేరింది. మారేడ్‌పల్లిలోని 12.97 మీటర్ల మేర పడిపోయాయి. శేరిలింగంపల్లి, మేడిపల్లి, మేడ్చల్, ఉప్పల్, కూకట్‌పల్లి, హఫీజ్‌పేట్ ప్రాంతాల్లోని పలు కేంద్రాల్లోనూ గణనీయమైన వార్షిక పతనం నమోదైంది. ఈ పరిస్థితికి లోటు వర్షపాతం ప్రధాన కారణాల్లో ఒకటిగా అధికారులు, నిపుణులు చెబుతున్నారు. ఆగస్టు వరకు హైదరాబాద్‌కు సాధారణంగా 460 మిల్లీమీటర్ల వర్షపాతం రావాల్సి ఉండగా.. 360 మిల్లీమీటర్లు మాత్రమే నమోదైంది. దీంతో 22 శాతం లోటు ఏర్పడింది. పర్యవేక్షణలో ఉన్న 46 మండలాల్లో 28 మండలాల్లో లోటు వర్షపాతం, 17 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదవగా.. ఒక్క మొయినాబాద్‌లో మాత్రమే అధిక వర్షపాతం నమోదైంది. అయితే, వర్షాలు తక్కువగా పడటంతో పాటు కురిసిన వర్షపు నీటిని సమర్థంగా ఒడిసిపట్టుకుని భూగర్భంలోకి పంపే రీచార్జ్ వ్యవస్థలు తగినంతగా పనిచేయకపోవడం కూడా సమస్యను తీవ్రతరం చేస్తోందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. పెరుగుతున్న కాంక్రీట్ నిర్మాణాలు, తగ్గుతున్న సహజ నీటి నిల్వ ప్రాంతాలు కూడా భూగర్భ జలాల రీచార్జ్‌పై ప్రభావం చూపుతున్నాయి. మరోవైపు.. మేలో నమోదైన ముందస్తు స్థాయితో పోలిస్తే ఆగస్టులో భూగర్భ జలాలు సగటున 0.80 మీటరు మేర పెరిగాయని అధికారులు చెబుతున్నారు. 2016?2025 దశాబ్ద సగటుతో పోలిస్తే 14 మండలాల్లో ఆగస్టు నీటిమట్టాలు మెరుగ్గా ఉన్నాయని, కొన్ని ప్రాంతాల్లో ఈ పెరుగుదల 17.07 మీటర్ల వరకు ఉందని వెల్లడించారు. అయినప్పటికీ 11 మండలాల్లో నీటిమట్టం 20 మీటర్ల కంటే లోతులోనే ఉండటం నగరానికి భూగర్భ జలాల సంరక్షణ, వర్షపు నీటి రీచార్జ్‌పై మరింత దృష్టి పెట్టాల్సిన అవసరాన్ని సూచిస్తోంది.

# మజ్లీస్ తో రేవంత్ సంబంధం

హైదరాబాద్, సెప్టెంబర్ 7, తెలంగాణ రాజకీయ ముఖచిత్రం మరో కీలక మలుపు తిరుగుతోందా? పాతబస్తీ రాజకీయాల నాడిని శాసించే మజ్లిస్ పార్టీ అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు అధికార, విపక్షాల్లో చర్చనీయాంశంగా మారాయి. సైదాబాద్ వద్ద నిర్మించిన నూతన స్టీల్ ఫ్లైఓవర్ ప్రారంభోత్సవ వేదిక ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యంగా నిలిచింది. ఒకే వేదికపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ ఒకరిపై ఒకరు కురిపించుకున్న ప్రశంసలు కేవలం అభివృద్ధి సంకేతాలు మాత్రమే కావని, రాష్ట్ర రాజకీయాల్లో సరికొత్త సమీకరణాల ఆరంభానికి సూచికలని విశ్లేషకులు భావిస్తున్నారు. గతంలో తాము బీఆర్ఎస్ కి మద్దతు ఇచ్చిన విషయాన్ని అంగీకరించిన అసదుద్దీన్, తెరవెనుక జరిగిన ఒక కీలక హెచ్చరికను బయటపెట్టారు. “రేవంత్ రెడ్డి దూకుడును అడ్డుకోకపోతే మీరంతా ఇళ్లలోనే కూర్చోవాల్సి వస్తుందని నేను స్వయంగా కేసీఆర్‌కు పదే పదే చెప్పాను” అని వ్యాఖ్యానించడం ద్వారా గత ప్రభుత్వ పతనానికి రేవంత్ దూకుడే కారణమనే అంశాన్ని నొక్కిచెప్పారు. ఇది బీఆర్ఎస్ వైఫల్యాన్ని ఎత్తిచూపడమే కాకుండా, రేవంత్ రెడ్డి నాయకత్వ పటిమకు ఇచ్చిన భారీ సర్టిఫికెట్‌గా నిలిచింది. అసదుద్దీన్ ప్రసంగంలో అత్యంత కీలకమైన రాజకీయ కోణం.. పార్టీని కాదని రేవంత్ రెడ్డి వ్యక్తిత్వాన్ని ఆయన సమర్థించడం. “నేను మద్దతు ఇస్తున్నది రేవంత్ రెడ్డికి మాత్రమే, కాంగ్రెస్ పార్టీకి కాదు” అని కుండబద్దలు కొట్టారు. సాధారణంగా ఎంఐఎం అధికారంలో ఉన్న పార్టీలతో సత్సంబంధాలు నెరపుతుందనే ఒక ముద్ర ఉంది. అయితే ఈసారి అసదుద్దీన్ కాంగ్రెస్ హైకమాండ్‌కు లేదా హస్తం పార్టీ సిద్ధాంతాలకు కాకుండా, నేరుగా సీఎం రేవంత్ రెడ్డి పాలనా శైలికే తమ బాసట అని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి సారథ్యంలో హైదరాబాద్ సహా సమగ్ర తెలంగాణ శరవేగంగా అభివృద్ధి చెందాలని ఆయన మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. అంతేకాదు, రేవంత్ రెడ్డి మరీ ఎక్కువ మర్యాదస్తుడిగా మారిపోయారని, గతంలో మాదిరి దూకుడును ప్రదర్శిస్తూ ప్రజల్లోకి రావాలని హితవు పలికారు. మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం అసదుద్దీన్ ఓవైసీ, అక్బరుద్దీన్ ఓవైసీలపై ప్రశంసల జల్లు కురిపించారు. దేశభక్తి విషయంలో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలకు అసదుద్దీన్ ఏమాత్రం తీసిపోరని రేవంత్ తేల్చిచెప్పారు. కొందరు కావాలనే అసద్‌పై, ఎంఐఎంపై దేశద్రోహ ముద్ర వేసే కుట్ర చేస్తున్నారని విమర్శించారు. అంతర్జాతీయ స్థాయిలో అసదుద్దీన్‌కు ప్రత్యేక గుర్తింపు ఉందన్న రేవంత్, ఓల్డ్ సిటీ సమగ్ర పురోగతికి కట్టుబడి ఉన్నామని ప్రకటించారు. తాను సీఎం అయ్యాక ఓవైసీ సోదరులతో పాతబస్తీ అభివృద్ధి ప్రణాళికలపై చర్చించానని గుర్తుచేశారు. పాతబస్తీ సమస్యల పరిష్కారానికి, అభివృద్ధి పనులకు సంబంధించి ఎంపీ అసద్ ఇచ్చే ఏ ప్రతిపాదనలనైనా తక్షణమే పరిశీలించి నిధులు విడుదల చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్‌ను ఆ వేదికపైనే రేవంత్ ఆదేశించారు. కాంగ్రెస్ పార్టీని పక్కనపెట్టి కేవలం రేవంత్ రెడ్డికే మద్దతు ప్రకటించడం ద్వారా అసదుద్దీన్ వ్యూహాత్మకంగా వ్యవహరించారు. ఇది ఒకవైపు కాంగ్రెస్‌తో తాము పూర్తిగా కరిగిపోలేదని మజ్లిస్ క్యాడర్‌కు స్పష్టం చేస్తూనే, మరోవైపు ప్రభుత్వ సారథి అయిన రేవంత్‌తో తమ బంధం అత్యంత పటిష్టంగా ఉందనే సందేశాన్ని ఇచ్చింది. అటు రేవంత్ రెడ్డి కూడా హైదరాబాద్ రాజకీయంలో పాతబస్తీ మద్దతును సంపూర్ణంగా తన ఖాతాలో వేసుకుంటూ, ప్రభుత్వంలో తన పట్టును, ఇమేజ్‌ను మరింత పటిష్టం చేసుకున్నారు. ఈ క్రమంలో ప్రతిపక్ష బీఆర్ఎస్‌కు గట్టి హెచ్చరిక పంపడమే కాక, హైదరాబాద్ వేదికగా తిరుగులేని రాజకీయ శక్తిగా తాము కొనసాగుతామని రేవంత్–ఓవైసీల ద్వయం ఈ సభ ద్వారా చాటిచెప్పింది.

# రేవంత్ మార్క్ పాలిటిక్స్...

హైదరాబాద్, సెప్టెంబర్ 7, కాంగ్రెస్ లో అంతర్గత కుమ్ములాటలకు, నాయకత్వంపై అసమ్మతి గళాలకు ఏఐసీసీ హైకమాండ్ గట్టి ముగింపు పలికింది. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని బలపరుస్తూ, కేబినెట్ నుంచి కొండా సురేఖను తప్పించడం ద్వారా అధిష్ఠానం స్పష్టమైన సందేశాన్ని ఇచ్చింది. పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి సీఎం పీఠాన్ని అధిరోహించే వరకు ప్రతి అడుగులోనూ పరీక్షలు ఎదుర్కొన్న రేవంత్ రెడ్డి, తాజా పరిణామంతో పార్టీపై తన తిరుగులేని పట్టును మరోసారి నిరూపించుకున్నారు. క్రమశిక్షణారాహిత్యాన్ని ఉపేక్షించే ప్రసక్తే లేదని తేల్చిచెప్పిన ఢిల్లీ పెద్దలు, అసంతృప్త నేతల దూకుడుకు బలమైన కళ్లెం వేశారు. ప్రభుత్వ విధానాలు లేదా ముఖ్యమంత్రి శైలిపై బహిరంగంగా విమర్శలు గుప్పిస్తున్న నేతలకు కొండా సురేఖ ఉద్వాసన ద్వారా అధిష్ఠానం హెచ్చరికలు జారీ చేసింది. క్రమశిక్షణ తప్పితే అది విస్తరించి పార్టీ ఐక్యతకే ముప్పుగా మారుతుందన్న ఉద్దేశంతోనే కాంగ్రెస్ నాయకత్వం ఈ నిర్ణయం తీసుకుంది. రేవంత్‌ను కాదని మరో ప్రత్యామ్నాయ వర్గాన్ని ప్రోత్సహించే ఆలోచన ఏఐసీసీకి లేదని, సీఎంకు పూర్తి స్వేచ్ఛనివ్వడమే సరైన మార్గమని నాయకత్వం భావించింది. ఫలితంగా, ఇన్నాళ్లూ మంత్రివర్గ విస్తరణలో చోటు కోసం లేదా శాఖల మార్పుపై అసంతృప్తి వెళ్లగక్కుతూ వచ్చిన ఆశావహులు ఇప్పుడు ఆచితూచి మాట్లాడాల్సిన పరిస్థితి ఏర్పడింది. హైకమాండ్ రేవంత్ రెడ్డికి ఇంతటి అండగా నిలవడానికి బలమైన రాజకీయ, ఎన్నికల కారణాలు ఉన్నాయి. 2023 శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడం మొదలుకొని.. ఆ తర్వాత జరిగిన పంచాయతీ, పురపాలక ఎన్నికలు, జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక వరకు రేవంత్ నాయకత్వంలో పార్టీ వరుస విజయాలను నమోదు చేసింది. దక్షిణ భారతదేశంలో పార్టీకి అత్యంత కీలకమైన తెలంగాణలో ప్రత్యర్థి పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీలను నిలువరించడంలో రేవంత్ వ్యూహాలు విజయవంతమయ్యాయి. ఈ పనితీరును గుర్తించిన కాంగ్రెస్ అగ్రనాయకత్వం, రేవంత్ నాయకత్వాన్ని బలహీనపరిస్తే పార్టీ పునాదులకే నష్టమని స్పష్టం చేసింది. త్వరలోనే జరగనున్న కీలకమైన పట్టణ స్థానిక సంస్థల సమరానికి పార్టీని సమాయత్తం చేయడమే అధిష్ఠానం తక్షణ లక్ష్యం. హైదరాబాద్ మెట్రోపాలిటన్ రీజియన్‌లోని క్యూర్ పరిధిలోకి వచ్చే జీహెచ్ఎంసీ, మల్కాజ్‌గిరి, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ల ఎన్నికలు పార్టీ భవిష్యత్తుకు అత్యంత కీలకంగా మారాయి. ఈ నగర పోరుకు ముందు గ్రూపు రాజకీయాలకు స్వస్తి పలికి, ఏకతాటిపై పార్టీని నడిపించేందుకు రేవంత్‌కు పూర్తి స్వేచ్ఛను ఇవ్వాలని అధిష్ఠానం నిర్ణయించింది. ఈ తాజా రాజకీయ మార్పులతో త్వరలో జరగబోయే మంత్రివర్గ విస్తరణ, ప్రక్షాళనపై సీఎం రేవంత్ రెడ్డికి పూర్తి వెసులుబాటు దక్కింది.

# మండలి కోసం పోటా పోటీ

వరంగల్, సెప్టెంబర్ 7, తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ, త్వరలో జరగనున్న పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటోంది. వచ్చే ఏడాది మార్చి నెలలో జ ం ˇ ా ˇ న ు న ్ మహబూబ్‌నగర్–హైదరాబాద్–రంగారెడ్డి, అలాగే నల్గొండ–వరంగల్–ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గాల ఎన్నికల వేడి గాంధీభవన్‌లో ఇప్పుడే మొదలైంది. అక్టోబర్ నెల నుంచి ఓటరు నమోదు కార్యక్రమాలు ప్రారంభం కానుండటంతో, అధికార పార్టీలో టికెట్ ఆశిస్తున్న నేతల హడావిడి పీక్స్‌కు చేరింది. ఈ రెండు పట్టభద్రుల స్థానాల పరిధిలో ఉమ్మడి ఆరు జిల్లాలు ఉన్నాయి. హైదరాబాద్, రంగారెడ్డి మినహా మిగిలిన నాలుగు ఉమ్మడి జిల్లాల్లోని మెజారిటీ అసెంబ్లీ స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకుంది. పట్టభద్రుల తీర్పు ప్రభుత్వ పనితీరుకు రెఫరెండంగా మారే అవకాశం ఉండటంతో, ఫలితం తేడా వస్తే భవిష్యత్ ఎన్నికలపై ప్రభావం పడుతుందన్న అంచనాతో సీఎం రేవంత్‌రెడ్డి ఈ ఎన్నికలను ఛాలెంజ్‌గా తీసుకున్నారు. ఈ క్రమంలో పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు కీలక మంత్రులు అభ్యర్థుల ఎంపికపై ముమ్మర కసరత్తు చేస్తున్నారు. ప్రతి నియోజకవర్గానికి మూడు నుంచి నాలుగు పేర్లతో కూడిన షార్ట్‌లిస్ట్‌ను అధిష్ఠానానికి పంపేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. మహబూబ్‌నగర్–రంగారెడ్డి–హైదరాబాద్ స్థానానికి ఆశావహులు పెద్దఎత్తున పోటీ పడుతున్నారు. ఇన్‌ఛార్జ్ మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, దామోదర రాజనర్సింహ స్థానిక ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సంప్రదింపులు జరిపి జాబితా రూపొందించారు. పార్టీ సీనియర్ నేత, మీడియా అండ్ కమ్యూనికేషన్స్ విభాగం మాజీ చైర్మన్ సామా రామ్మోహన్‌రెడ్డి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డికి ఉపాధ్యాయ సంఘాల నేపథ్యం ఉంది. ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ పేరు కూడా పరిశీలనలో ఉన్నాయి. టీశాట్ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, బీసీ నేత గౌరి సతీష్, షాప్ మాజీ చైర్మన్ శివసేనారెడ్డితో పాటు కాలుష్య నియంత్రణ మండలి బోర్డు సభ్యుడు రాకూర్ బాలాసింగ్ పేర్లను కూడా పార్టీ నాయకత్వం పరిశీలిస్తోంది. ఇక నల్గొండ–ఖమ్మం–వరంగల్ స్థానంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నివాసంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క ప్రత్యేకంగా భేటీ అయ్యారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తనయుడు గుత్తా అమిత్‌రెడ్డి టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఆర్టీఐ కమిషనర్ పి.వి. శ్రీనివాస్, నల్గొండ డీసీసీ అధ్యక్షుడు కైలాష్ నేత పేర్లు ప్రముఖంగా ఉన్నాయి. స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి పోటీ చేసిన ఇందిర, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చనగాని దయాకర్, పార్టీ నేత లోకేష్ యాదవ్, ఖమ్మం విద్యాసంస్థల అధినేత మొండిం కిరణ్‌కుమార్ ఆశావహుల జాబితాలో ఉన్నారు. మరోవైపు పొత్తులో భాగంగా ఈ సీటు తమకు కేటాయించాలని టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం కోరుతుండటం గమనార్హం. పట్టభద్రుల స్థానాలతో పాటు నవంబర్, డిసెంబర్ నెలల్లో నాలుగు గవర్నర్ కోటా ఎమ్మెల్సీ సీట్లు భర్తీకి రానున్నాయి. ప్రస్తుత ఎమ్మెల్సీలు గోరటి వెంకన్న, బస్వరాజు సారయ్య, బొగ్గారపు దయానంద్‌ల పదవీకాలం నవంబర్ 14న ముగియనుంది. డిసెంబర్ 18న మధుసూదనాచారి పదవీకాలం పూర్తవుతుంది. ఈ నాలుగు నామినేటెడ్ స్థానాలు కూడా అధికార కాంగ్రెస్ ఖాతాలోకే వెళ్లనున్నాయి. కళాకారుల కోటాలో సీఎంతో సన్నిహిత సంబంధాలున్న గోరటి వెంకన్నను మళ్లీ కొనసాగిస్తారా లేదా అన్నది ఆసక్తికరంగా మారింది. బీఆర్ఎస్ ద్వారా నామినేట్ అయి ప్రస్తుతం కాంగ్రెస్‌లో ఉన్న బస్వరాజు సారయ్య మళ్లీ అవకాశం ఆశిస్తున్నారు. మరోవైపు సమాచార కమిషనర్ బోరెడ్డి అయోధ్యరెడ్డి, కరీంనగర్ గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం పేర్లు గవర్నర్ కోటా రేసులో బలంగా వినిపిస్తున్నాయి. సామాజిక సమీకరణాలు, గెలుపు గుర్రాలకే ప్రాధాన్యం ఇస్తూ కాంగ్రెస్ అధిష్ఠానం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. గ్రౌండ్ రియాలిటీని బేరీజు వేసుకుంటూ, ఆశావహుల అసంతృప్తి పార్టీపై పడకుండా శాసనమండలి పోరులో క్లీన్‌స్వీప్ చేయడమే లక్ష్యంగా హస్తం పార్టీ కసరత్తు ముమ్మరం చేసింది.

# దేవాదాయశాఖ సెంటిమెంట్ కంటిన్యూ...

హైదరాబాద్, సెప్టెంబర్ 7, రాజకీయాల్లో కొన్ని శాఖలకు ప్రత్యేకమైన గుర్తింపు ఉంటుంది. అందులో దేవాదాయ ధర్మాదాయ శాఖది అత్యంత సున్నితమైన స్థానం. దేవుడి మాన్యాలు, ఆలయ పాలనతో ముడిపడి ఉండే ఈ పోర్ట్‌ఫోలియోను బాధ్యతగా భావించినా.. రాజకీయంగా మాత్రం మంత్రులకు అస్సలు కలిసిరావడం లేదు. ఇది త ఆరు దశాబ్దాల చరిత్ర చెప్తున్న చేదు నిజం. తాజాగా మంత్రివర్గం నుంచి కొండా సురేఖ ఉద్వాసనకు గురికావడంతో మరోసారి దేవాదాయ శాఖ సెంటిమెంట్ తెరపైకి వచ్చింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి మొదలుకొని ఇప్పటి ప్రత్యేక తెలంగాణ వరకు.. ఈ శాఖను చేపట్టిన పలువురు నేతల రాజకీయ ప్రస్థానం ఊహించని మలుపులు తిరిగి, క్రమంగా అస్తమించడమో లేదా తెరమరుగవడమో జరుగుతూ వస్తోంది. ఈ శాఖకు మంత్రుల పదవీకాలానికి ఉన్న విచిత్రమైన లింక్ 1962 నుంచే కనిపిస్తుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తొలి మహిళా దేవాదాయ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన సదాలక్ష్మి కేవలం ఏడాది తిరిగేలోపే ఆ పదవిని కోల్పోవాల్సి వచ్చింది. శాఖలో ఆమె తీసుకున్న సంస్కరణలు, నిర్ణయాలపై తీవ్ర వ్యతిరేకత వెల్లువెత్తడంతో సంక్షేమ శాఖకు మార్చారు. ఆ వెంటనే 1967 ఎన్నికల్లో ఆమె పరాజయం పాలయ్యారు. ఇక 1983 జనవరిలో ఎన్టీఆర్ ప్రభుత్వ హయాంలో ఈ బాధ్యతలు చేపట్టిన ఈలి ఆంజనేయులు పదవిలో ఉండగానే కేవలం నెలల వ్యవధిలోనే అనారోగ్యంతో కన్నుమూశారు1999?2004 మధ్య చంద్రబాబు రెండోసారి సీఎంగా ఉన్న సమయంలో దామోదరం ఆంజనేయులు 1999లో దేవాదాయ శాఖ బాధ్యతలు తీసుకున్నారు. 2001 నాటి కేబినెట్ పునర్వ్యవస్థీకరణ, రాజకీయ సమీకరణాల్లో పదవి కోల్పోయారు. ఆ తర్వాత బాధ్యతలు చేపట్టిన దండు శివరామరాజు 2004 సాధారణ ఎన్నికల్లో ఓటమి చెంది, ఆపై ప్రత్యక్ష రాజకీయాలకు దూరమయ్యారు. దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలోనూ ఈ గండం కొనసాగింది. 2004–2005 మధ్య 14 నెలలపాటు బాధ్యతలు నిర్వర్తించిన ఎం.సత్యనారాయణ రావు.. హైదరాబాద్ పరిధిలోని దేవరయాంజాల్ భూముల వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొని పదవిని వీడాల్సి వచ్చింది. క్రీడల శాఖకు మారినా, ఏడాదిలోనే రాజీనామా చేయాల్సి వచ్చింది. అనంతరం 2009 ఎన్నికల్లో వేములవాడ నుంచి పోటీ చేసి ఓడిపోయి రాజకీయాలకు దూరమయ్యారు. వైఎస్ కేబినెట్‌లోనే 2009 మే నుంచి దేవాదాయ శాఖ నిర్వహించిన జూపల్లి కృష్ణారావు, 2011 జూన్ 1న తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో తన మంత్రి పదవికి రాజీనామా చేశారు. అటు 2014లో ఏపీ టీడీపీ–బీజేపీ సంకీర్ణ ప్రభుత్వంలో ఈ శాఖ చూసిన మాణిక్యాలరావు 2019 ఎన్నికల్లో కనీసం డిపాజిట్ కూడా దక్కించుకోలేకపోయారు. ఆ తర్వాత ఆయన కన్నుమూశారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ ఏడాది పాటు ఎవరికీ ఈ బాధ్యతలు అప్పగించలేదు. 2014 డిసెంబరులో అల్లోల ఇంద్రకరణ్ రెడ్డికి దేవాదాయ శాఖ దక్కింది. 2018 ఎన్నికల తర్వాత కేసీఆర్ రెండో కేబినెట్‌లోనూ 2023 ఎన్నికల వరకు ఆయనే కొనసాగినప్పటికీ, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలయ్యారు. సుదీర్ఘకాలం శాఖను నడిపించినా ఆయనకు రాజకీయంగా పెద్దగా మైలేజ్ దక్కలేదనే వాదన ఉంది. ఇక 2023 డిసెంబరులో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖలను చేపట్టిన కొండా సురేఖ సైతం పలు రాజకీయ వివాదాల్లో చిక్కుకుని అనూహ్యంగా మంత్రివర్గం నుంచి ఉద్వాసనకు గురయ్యారు. గతంలో కేసీఆర్ హయాంలో ఆరోగ్యశాఖ నిర్వహణ లోపాల వల్ల పదవి కోల్పోయిన డాక్టర్ టి.రాజయ్య, ఇప్పుడు పదవి కోల్పోయిన కొండా సురేఖ.. ఇద్దరూ ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలే కావడం కాకతాళీయం. సంక్షేమ పథకాలు, భారీ బడ్జెట్లు, రాజకీయ పలుకుబడిని పెంచే ఇతర శాఖలతో పోలిస్తే.. దేవాదాయ శాఖ పూర్తి భిన్నమైనది. భూముల వివాదాలు, ఆలయ నిధులు, స్థానిక ఆధిపత్య పోరు ఈ శాఖను నిరంతరం పర్యవేక్షణలో ఉంచుతాయి. కారణాలు పాలనాపరమైనవి కావొచ్చు, రాజకీయ సమీకరణాలు కావొచ్చు.. కానీ దేవాదాయ శాఖ పగ్గాలు పట్టిన నేతలకు కాలం కలిసిరావడం లేదన్న భావన రాజకీయ వర్గాల్లో బలంగా నాటుకుపోతోంది.

## దళితులంటే బిఆర్ఎస్ పార్టీకి అంత చిన్న చూపా

## దళితుల జోలికి వస్తే ఖబడ్దార్

## ఎమ్మెల్సీ తాతా మధు వ్యాఖ్యలను ఖండించిన మంగాపురం ఉపసర్పంచ్ గుజ్జర్లపూడి చింటు



తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలపై తల్లాడ మండలం కాంగ్రెస్ పార్టీ నాయకులు గుజ్జర్లపూడి చింటు తీవ్రంగా స్పందించారు. దళిత నాయకుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని ఆయన అన్నారు,

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితులంటే ఎమ్మెల్సీ తాతా మధుకు ఎందుకంత చులకన? పదవిలో ఉన్నామనే అహంకారంతో మాట్లాడటం సరికాదు. దళిత సమాజాన్ని అవమానించే విధంగా ఎవరైనా మాట్లాడితే ప్రజాస్వామ్య పద్ధతిలో తీవ్రంగా వ్యతిరేకిస్తాం” అని అన్నారు,

దళితులు, బహుజనుల ఆత్మగౌరవాన్ని కించపరిచే వ్యాఖ్యలు పునరావృతం చేయవద్దని వారు సూచించారు. “పదవులు శాశ్వతం కాదు.. ప్రజల గౌరవం, రాజ్యాంగ విలువలే శాశ్వతం” అని పేర్కొన్నారు. రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్న నాయకులపై వ్యక్తిగత విమర్శలు చేయకుండా, ప్రజా సమస్యలు మరియు అభివృద్ధి అంశాలపై మాట్లాడాలని ఆయన అన్నారు.

# సెప్టెంబర్ 10న "చలో హైదరాబాద్ -- మహా ధర్నా"ను విజయవంతం చేయాలి

## TGEJAC హైదరాబాద్ సిటీ ఆధ్వర్యంలో వివిధ శాఖల్లో సన్నాహక సభలు -- చైర్మన్ కట్కూరి శ్రీకాంత్

**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** హైదరాబాద్, సెప్టెంబర్ 7, 2026:తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న న్యాయమైన డిమాండ్ల సాధన కోసం తెలంగాణ గవర్నమెంట్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ (TGEJAC) ఆధ్వర్యంలో సెప్టెంబర్ 10, 2026న నిర్వహించనున్న "చలో హైదరాబాద్ -- మహా ధర్నా" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ౦+జుజీూజ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది.




ఈ పిలుపు మేరకు TGEJAC హైదరాబాద్ సిటీ చైర్మన్ కట్కూరి శ్రీకాంత్ ఆధ్వర్యంలో హైదరాబాద్ నగరంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో సన్నాహక సభలు నిర్వహించారు.

సన్నాహక సభలు నిర్వహించిన శాఖలు:

1. నీటిపారుదల శాఖ
2. వాణిజ్య పన్నుల శాఖ -- HoD
3. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్
4. మీడియా అకాడమీ

ఈ సన్నాహక సభల్లో ఉద్యోగులకు సెప్టెంబర్ 10న నిర్వహించనున్న చలో హైదరాబాద్ కార్యక్రమం యొక్క ప్రాధాన్యతను వివరించారు. ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా చలో హైదరాబాద్ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఉద్యోగుల హక్కుల సాధన కోసమే పోరాటం

ఈ సందర్భంగా TGEJAC హైదరాబాద్ సిటీ చైర్మన్ కట్కూరి శ్రీకాంత్ మాట్లాడుతూ, ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేపడుతున్న ఈ నిరసన కార్యక్రమం ప్రభుత్వానికి, ప్రజలకు లేదా మరే ఇతర వర్గానికి వ్యతిరేకంగా కాదని, ఉద్యోగుల హక్కులు, న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వహిస్తున్న పోరాటమని తెలిపారు.

సెప్టెంబర్ 10న నిర్వహించనున్న భారీ "చలో హైదరాబాద్ -- మహా ధర్నా" కార్యక్రమానికి ఈ సన్నాహక సభలు ఒక ముందడుగని పేర్కొన్నారు. ఉద్యోగులంతా ఐక్యంగా, సంఘటితంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఉద్యోగుల ఐక్యత, సంఘటిత పోరాటంతోనే న్యాయమైన డిమాండ్లను సాధించుకోగలమని శ్రీకాంత్ తెలిపారు.

ఉద్యోగులంతా ఐక్యంగా పాల్గొనాలి -- గండూరి వెంకట్

TGEJAC హైదరాబాద్ సిటీ కన్వీనర్ గండూరి వెంకట్ మాట్లాడుతూ, TGE-JAC రాష్ట్ర చైర్మన్ మారం జగదీశ్వర్ నాయకత్వంలో ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా పనిచేయాలని కోరారు.

సెప్టెంబర్ 10న నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమాల్లో హైదరాబాద్ జిల్లా కన్వీనర్ కృష్ణ యాదవ్, నజీర్ అహ్మద్ వైస్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ సెక్రెటరీ టీఎన్జీఎస్ భీమ్ సింగ్, అర్మని రాజు, నీటిపారుదల శాఖ అధ్యక్షులు మన సెక్రెటరీ శిరీష గణేష్ వాణిజ్య పనుల శాఖ అధ్యక్షులు చిన్నన్న కార్యదర్శి, సర్వీస్ కమిషన్ శివకుమార్ నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. వివిధ శాఖలకు చెందిన గెజిటెడ్ అధికారులు (GOs), నాన్-గెజిటెడ్ అధికారులు (NGOs), DEOs మరియు ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అనంతరం సెప్టెంబర్ 10న నిర్వహించనున్న "చలో హైదరాబాద్" కార్యక్రమానికి సంబంధించిన "ఉద్యోగ పోరుబాట" గీతాన్ని ఆలకించి ఉద్యోగులు ఉత్తేజం పొందారు.

# స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు.. మర్పల్లిలో కాంగ్రెస్ భగ్గుమంది

### తాతా మధు దిష్టిబొమ్మ దహనం.. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు బహిరంగంగా బేషరతుగా క్షమాపణ చెప్పాలి.. లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన : కాంగ్రెస్ నాయకుల హెచ్చరిక

**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధిమర్పల్లి, సెప్టెంబర్ 7 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండల ప్రెసిడెంట్ తుమ్మల సురేష్ యాదవ్ ఆధ్వర్యంలోతెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు అసెంబ్లీ ఆవరణలో అనుచిత పదజాలంతో వ్యాఖ్యలు చేశారంటూ మర్పల్లి మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం తీవ్ర నిరసన చేపట్టారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తుమ్మల సురేష్ యాదవ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మర్పల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి తాతా మధు దిష్టిబొమ్మను ర్యాలీగా బస్టాండ్‌కు తీసుకువచ్చారు. అనంతరం నడిరోడ్డుపై దిష్టిబొమ్మను దహనం చేసి బీఆర్ఎస్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.





ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ మచ్చలేని తమ నాయకుడు, శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌ను అసభ్య పదజాలంతో దూషించడం తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కేవలం ఆయన దళిత నాయకుడు కావడంతోనే అహంకారపూరితంగా ఇలా మాట్లాడుతున్నారని ఆరోపించారు. స్నేహశీలి, సహృదయుడు, ప్రజల సమస్యలు తెలుసుకుని స్పందించే ప్రజా నాయకుడిగా గడ్డం ప్రసాద్ కుమార్‌కు మంచి గుర్తింపు ఉందన్నారు.

గడ్డం ప్రసాద్ కుమార్ జోలికి వస్తే ఖబడ్దార్.. విడిచిపెట్టేది లేదని కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. బీఆర్ఎస్ పార్టీ అహంకారపూరిత చర్యలను కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ తిప్పికొడుతుందని స్పష్టం చేశారు. ప్రజలు బీఆర్ఎస్ పార్టీని భూస్థాపితం చేసే రోజులు దగ్గర పడ్డాయని విమర్శించారు.అనంతరం కాంగ్రెస్ నాయకులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి తాతా మధు వ్యాఖ్యలపై ఫిర్యాదు చేశారు. తాతా మధు వెంటనే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని గడ్డం ప్రసాద్ కుమార్‌కు బహిరంగంగా బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# హమారప్రసాద్ దిష్టిబొమ్మ దగ్ధం

## డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కల్పిత నాయకుడని పుస్తకం రాసినందుకు



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి సెప్టెంబర్ 07 ప్రజాబలం సంగారెడ్డి జిల్లా:** ప్రపంచ మేధావి, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, "కల్పిత నాయకుడని "ఒక "కల్పిత పుస్తకం రాస్తున్న" (హమారా ప్రసాద్,) నిన్నఆదివారం పుల్కల్ మండల కేంద్రంలో హామర ప్రసాద్, దిష్టిబొమ్మను పుల్కల్ మండల అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో తగలబెట్టడం జరిగింది, పుల్కల్ పోలీస్ స్టేషన్లో హమారప్రసాద్,మీద కంప్లైంట్ కూడా ఇవ్వడం జరిగింది, ఈ కార్యక్రమంలో పెద్ద రెడ్డిపేట మాజీ సర్పంచ్ తలారి అంజయ్య, సింగూరు మధుసూదన్, బేగరి కరుణాకర్, పుల్కల్ ఉపసర్పంచ్ ప్రవీణ్, మేతరి శ్రీనివాస్, నిరంజన్, లక్ష్మణ్, కృష్ణ, ఏసు, ఉదయ్, ప్రవీణ్, వినయ్, పోచయ్య,కిరణ్, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



# ఆలయాల శంకుస్థాపన మహోత్సవంలో ఎంపీ రఘురాం రెడ్డి.



**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం సెప్టెంబర్ 7:** మండలంలోని తనికెళ్ళలో గల ప్రఖ్యాత చంద్రమౌళీశ్వర స్వామి, ఆంజనేయస్వామి దేవాలయాల శంకుస్థాపన మహోత్సవాన్ని సోమవారం నిర్వహించగా.. ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా బాలాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఆలయానికి 85 ఏళ్ల చరిత్ర ఉందని, ఇప్పుడు రూ. 3.50 కోట్లతో నిర్మించబోతున్నట్లు పునః నిర్మాణ కమిటీ బాధ్యులు వివరించారు. అనంతరం ఎంపీ రఘురాం రెడ్డి స్పందిస్తూ..తన సహకారం ఉంటుందని ప్రకటించాగా.. కమిటీ వారు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గడల కళావతి, కాంగ్రెస్ నాయకులు ఊకంటి గోపాలరావు, కొప్పుల చంద్రశేఖర్, కోసూరి శ్రీను, ఆలయ పున:ప్రతిష్ట కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



# దశాబ్దాల ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజల కలకు రెక్కలు.

### గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయానికి కదలికలు
### భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సీతంపేట, గరీబ్ పేట, అబ్బుగూడెంలలో ప్రతిపాదిత భూముల పరిశీలన
### ఏఏఐ అధికారులతో కలిసి అటవీ ప్రాంతాల్లో ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి పర్యటన
### బురదలో నడుస్తూ.. గుట్టలు ఎక్కుతూ అనువైన ప్రాంతాల పరిశీలన
### దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న విమానయాన కల సాకారం దిశగా కీలక అడుగు

**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం సెప్టెంబర్ 7:**భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రతిపాదిత గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయానికి స్థల ఎంపిక ప్రక్రియ కీలక దశకు చేరుకుంది. గతంలో పరిశీలించిన రెండు ప్రాంతాలు సాంకేతిక కారణాలతో అనుకూలం కాదని తేలడంతో.. రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ప్రతిపాదించిన ఆరు ప్రత్యామ్నాయ ప్రాంతాలపై కేంద్ర సాంకేతిక బృందం, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) అధికారులు సోమవారం క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. సుజాతనగర్ మండలం సీతంపేట, లక్ష్మీదేవి పల్లి మండలం గరీబ్ పేట, అన్నపురెడ్డిపల్లి మండలం అబ్బుగూడెం ప్రాంతాల్లో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి ప్రత్యేక చొరవతో అధికారులతో కలిసి పర్యటించి పరిస్థితులను స్వయంగా పరిశీలించారు.





బురద డొంకల మీదుగా కాలినడకన వెళ్లి, కొండ ప్రాంతాల్లో తిరుగుతూ అటవీ ప్రాంతాల్లోకి ముందుకుసాగారు. ఆయా ప్రాంతాల భౌగోళిక పరిస్థితులు, రన్‌వే నిర్మాణానికి ఉన్న అవకాశాలు, విమానాల రాకపోకలకు అనువుగా ఉంటాయా? తదితర అంశాలను అధికారులు అంచనా వేశారు.

సాంకేతిక అంశాలపై అంచనా

ప్రతిపాదిత ప్రాంతాల్లో విమానాల ల్యాండింగ్, టేకాఫ్‌కు అనువైన పరిస్థితులు, భౌగోళిక స్వరూపం, వాతావరణ పరిస్థితులు, రన్‌వే నిర్మాణానికి అవసరమైన సాంకేతిక అంశాలను కేంద్ర బృందం పరిశీలిస్తోంది. క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం సాంకేతిక నివేదికను రూపొందించనుంది. ఆ నివేదిక ఆధారంగా విమానాశ్రయానికి అనువైన ప్రాంతాన్ని ఖరారు చేసే అవకాశం ఉంది.దశాబ్దాల కలకు రెక్కలు దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానానికి వచ్చే భక్తులతో పాటు.. జిల్లాలోని పారిశ్రామిక, పర్యాటక, రవాణా రంగాల అభివృద్ధికి విమానాశ్రయం కీలకం కానుంది. దశాబ్దాల కాలంగా ఈ ప్రాంత ప్రజలకు అందని విమానయాన సదుపాయం ఇప్పుడు సాకారం అయ్యే దిశగా అడుగులు పడుతున్నాయి.

నేడు.. దుమ్ముగూడెం, పాల్వంచ మండలాల్లో పరిశీలన

కేంద్ర బృందం మంగళవారం దుమ్ముగూడెం, పాల్వంచ మండలాల్లో ప్రతిపాదిత స్థలాలను పరిశీలించనుంది. అన్ని ప్రాంతాల క్షేత్రస్థాయి పరిశీలన పూర్తయిన అనంతరం విమానాశ్రయానికి అనువైన ప్రాంతాన్ని ఎంపిక చేయనున్నట్లు తెలుస్తోంది. దీంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయ ఏర్పాటుపై ఆశలు మరింత బలపడ్డాయి.

# ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలకై బిజెపి చలో అసెంబ్లీ

**బిజెపి మీడియా ప్యానలిస్ట్ ప్రభ గౌడ్ తో పాటు పలువురి అరెస్ట్**
**ప్రభ గౌడ్ కాలికి గాయం కేర్ ఆసుపత్రికి తరలింపు**

విద్యార్థుల హక్కుల కోసం..
ధర్నా చౌక్‌లో 'విద్యార్థి మహాధర్నా'కు పిలుపునిస్తే భయపడి అనుమతి నిరాకరణ!






**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** హైద్రాబాద్ సెప్టెంబర్ 8: ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు, 22హా సహా ప్రజా సమస్యలపై బీజేపీ రాష్ట్ర శాఖ ఇచ్చిన పిలుపు మేరకు బిజెపి మీడియా ప్యానలిస్ట్ ప్రభ గౌడ్ ఆద్వర్యం లో సోమవారం చలో అసంబ్లీ కార్యక్రమాన్ని నిర్వహించారు.ప్రభ గౌడ్ నేతృత్వం లో అఫ్జల్ గంజ్ నుండి పెద్ద ఎత్తున బిజెపి కార్యకర్తలు ర్యాలీగా అసంబ్లీ వైపు బయలు దేరారు. దీనితో పోలీసులు వారిని అడ్డుకోవడం తో ఉద్రిక్త వాతావరణం నెలకొంది ఈ సందర్బంగా ఇరు వర్గాల మధ్య తోపులాట మధ్య ప్రభ గౌడ్ తో పాటు పలువురు నాయకులు కార్య కర్తలను పోలీసులు అరెస్ట్ చేశారు.ఈ సందర్బంగా ప్రభ గౌడ్ కాలికి గాయమైంది. వెంటనే ఆమెను నాంపల్లి లోని కేర్ ఆసుపత్రికి తరలించారు.ఈ సందర్బంగా ప్రభ గౌడ్ మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని,, 22హా ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.ప్రజా సమస్యలపై ప్రశ్నించడం ప్రతిపక్ష హక్కు మాత్రమే కాదు ప్రజాస్వామ్య బాధ్యత కూడా అని అన్నారు.

?15000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకుండా 40 లక్షల మంది తెలంగాణ విద్యార్థుల జీవితాలను అంధకారంలోకి నెట్టేస్తూ, వారి ఆశల మీద నీళ్లు చల్లుతున్న

కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ తీరును ప్రభ గౌడ్ తీవ్రంగా ఖండించారు.

అసెంబ్లీ ముట్టడికి వెళ్తే పోలీసుల చేత అక్రమ అరెస్టులు.. గృహ నిర్బంధాలు..

పోలీసులను అడ్డం పెట్టుకుని ప్రశ్నించే గొంతులను అణచివేయాలని చూస్తే ఊరుకునేది లేదు.విద్యార్థుల పక్షాన బీజేపీ పోరాటం ఆగదు.ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేసే వరకు..విద్యార్థుల హక్కులు సాధించే వరకు..కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం కొనసాగుతూనే ఉంటుంది!తెలంగాణలో ప్రజాస్వామ్య నిరసనలను హౌస్ అరెస్టులు, ముందస్తు నిర్బంధాలతో అణచివేయడం సరికాదు.చలో అసెంబ్లీ కార్యక్రమం నేపథ్యంలో అదుపులోకి తీసుకున్న బీజేపీ, బీజేవైఎం నాయకులు, కార్యకర్తలందరినీ ప్రభుత్వం వెంటనే, ఎలాంటి షరతులు లేకుండా విడుదల చేయాలని ప్రభ గౌడ్ డిమాండ్ చేశారు.

# ఉత్తమ అధ్యాపకుని గా బియ్యపు శంకర్ యాదవ్ కు ఘన సన్మానం



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** హైద్రాబాద్ సెప్టెంబర్ 8:ఉపాధ్యాయ దినోత్సవం ను పురస్కరించుకొని లయన్స్ ఇంటర్నేషనల్ క్లబ్ ఆద్వర్యం లో బోయినపల్లి లోని శోభా గార్డెన్స్ లో శ్రీ స్వామినారాయణ్ ఇంటర్నేషనల్ విద్యాలయ నందు అధ్యాపకుని గా కామర్స్ భోదిస్తున్న బియ్యపు శంకర్ యాదవ్ ను ఉత్తమ అధ్యాపకుని గా ఎంపిక చేసి సత్కారించారు.ఈ కార్యక్రమం లో ప్రముఖ సహస్రవధాని పద్మశ్రీ గరికపాటి నరసింహారావు , లయన్స్ క్లబ్ గవర్నర్ శశికాంత్, లయన్స్ క్లబ్ అఫ్ హైదరాబాద్ ప్రెసిడెంట్ రాపాక రాయమల్లు, ఈవెంట్ ఛైర్పర్సన్ భారత్ రాజ్, తెలంగాణ కు చెందిన అనేక పాఠశాలల, కళాశాల ల ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు. శ్రీ స్వామి నారాయణ గురుకుల్ విద్యాలయ యాజమాన్యం, పూజ్య పాధ్ సుఖీవల్లభదాస్ స్వామీజీ, హరివల్లభదాస్ స్వామీజీ, సి ఈ. ఓ. సతీష్ రెడ్డి ప్రిన్సిపాల్ ప్రవీణ్ కుమార్ , కో ఆర్డినేటర్ శ్రీనివాస్ , సహ అధ్యాపకులు, పలువురు,బియ్యపు శంకర్ యాదవ్ కు అభినందనలు తెలిపారు.

## సివిక్స్ అధ్యాపకుడి కోసం విద్యార్థుల ఆందోళన..

**కళాశాల ఎదుట రోడ్డుపై బైఠాయించి ధర్నా.. సమస్య పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరిక.**

**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి సెప్టెంబర్ 07:** ఖమ్మం జిల్లా వేంసూర్ మండల పరిధిలోని కందుకూరు బండి సోమకాంతం జూనియర్ ప్రభుత్వ కళాశాలలో సివిక్స్ అధ్యాపకుడిని నియమించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు సోమవారం ఆందోళనకు దిగారు. కళాశాల ఎదుట ప్రధాన రహదారిపై బైఠాయించి ధర్నా నిర్వహించారు.



కళాశాల ప్రారంభమైన 2023లో ప్రిన్సిపాల్‌తో పాటు ఒక్క ఫిజిక్స్ అధ్యాపకుడు మాత్రమే అందుబాటులో ఉన్నారని విద్యార్థులు తెలిపారు. అనంతరం 2024లో జువాలజీ, తెలుగు, ఎకనామిక్స్ విభాగాలకు సిబ్బందిని నియమించారని పేర్కొన్నారు. 2025-26 విద్యా సంవత్సరానికి కళాశాలలో దాదాపు పూర్తిస్థాయిలో బోధనా సిబ్బంది ఉన్నప్పటికీ, సివిక్స్ సబ్జెక్టుకు మాత్రం అధ్యాపకుడు లేకపోవడం తమ చదువులకు తీవ్ర ఆటంకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రస్తుతం కళాశాలలో సుమారు పది మంది బోధనా సిబ్బంది ఉన్నప్పటికీ, సివిక్స్ అధ్యాపకుడు లేకపోవడంతో ఆ సబ్జెక్టు చదువుతున్న విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పరీక్షలు సమీపిస్తున్న సమయంలో బోధన లేకపోవడం వల్ల తమ భవిష్యత్తుపై ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

వెంటనే సివిక్స్ అధ్యాపకుడిని నియమించి తమ సమస్యను పరిష్కరించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. ఈ విషయంపై విద్యాశాఖ ఉన్నతాధికారులకు వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. అధికారులు స్పందించి తక్షణమే సమస్యను పరిష్కరించకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని విద్యార్థులు హెచ్చరించారు.

# ప్రజావాణిలో సైబరాబాధ్ మున్సిపల్ కమిషనర్కు ఛార్జ్‌షీట్ను అందజేత




**గండిపేట మండలం ప్రజాబలం ప్రతినిధి** 7ప్రజావాణి ద్వారా సైబరాబాధ్ మున్సిపల్ కమిషనర్కు ఛార్జ్‌షీట్ను అందజేయడం జరిగినది సెప్టెంబర్ 2026 ఖాశీగ్రెసు పార్టీ గద్దెనెక్కక ముందు కళ్ల బొల్లి మాటలతో 6 గ్యారంటీలు 420 హామీలు అమలు పరుస్తామని నమ్మబలికి ఒడ నెక్కెదాకా ఒడ మల్లన్న ఒడ దిగినాకా బోడ మల్లన్న అన్న చందాన తీరా ఖాశీగ్రెసు పార్టీ తెలంగాణలో ప్రభుత్వ గద్దెనెక్కి 1000 రోజులు గడిచినను ప్రజా క్షేమం కోరి ప్రతిష్టాత్మక సంక్షేమ పథకాలను కొనసాగించకుండా మోసపూరితముగా వ్యవహారిస్తున్నారు. అసంతృప్తితో ఉన్న ప్రజల బాగోగులు ప్రత్యేకించి మణికొండ, నెక్నాంపూర్ మున్సిపల్ డివిజన్లలోని ప్రధాన సమస్యలైన పుప్పలగూడ అంబేద్కర్ భవనం, శ్మశానవాటిక రహదారి, బుల్కాపూర్ నాలా, భూగర్భజలాల మురుగునీటి పారుదల పైప్ లైన్కు అయిన ఖర్చుపద్దు, క్రొత్తగా కట్టిన మున్సిపల్ భవనం నిధుల ఖర్చుపద్దు, క్రికెట్ గ్రౌండ్ నిర్మాణ నిధుల ఖర్చు పద్దుల వివరాలు, ఇంటి కిరాయి పద్దతిగా ఆస్తిపన్ను కొనసాగింపూ, రహదారుల విస్తీర్ణత, విద్యుత్ స్తంభాలు ప్రక్కకు జరుపుట, నెమలి నగర్ వాసులకి ఇంటి నెంబర్లు కేటాయించాలని, చిత్రపురి కాలనీ సంబంధిత ఖాళీ స్థలల దస్తావేజుల వివరాలు, అలకపూర్ టౌన్ షిప్ తదితర ప్రాంతాల్లో వీధి దీపాలు, ట్రాఫిక్ సమస్యలు, రోడ్డు గుంతల సమస్యలను మున్సిపల్ శాఖ సిబ్బంది పట్టించుకోనందున ప్రజా ప్రయోజన కార్యక్రమాలుపై భారత రాష్ట్ర సమితి పార్టీ మణికొండ, నెక్నంపూర్ డివిజన్ నాయకులు

సీతారం ధూళిపాళ, గుట్టమీది నరేందర్, అందె లక్ష్మణ్ రావు, ఆరిఫ్ మహమ్మద్, సుమనలిని, జయరాం, బాబురావు, మంజుల, శివ తదితరులు పోరుబాట సందర్భంగా ప్రజావాణి ద్వారా సైబరాబాధ్ మున్సిపల్ కమిషనర్కు ఛార్జ్‌షీట్ను అందజేయడం జరిగినది.

# డిజిటల్ అరెస్టుల పేరిట ఘరానా మోసం

**హెచ్. ప్రతాప్**

:హైదరాబాద్‌లో 68 ఏళ్ల మహిళను 'డిజిటల్ అరెస్టు' పేరుతో రూ.21 లక్షలకు మోసం చేసిన ఘటనపై మీడియాలో వచ్చిన వార్తలు కలకలం రేపుతున్నాయి. ఇటువంటి సైబర్ నేరాలు రోజురోజుకూ కొత్త రూపాలు సంతరించుకుంటుండటంపై నెటిజన్లు కూడా తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా వృద్ధులు, ఒంటరిగా నివసించే వారు సైబర్ నేరగాళ్లకు సులభంగా లక్ష్యాలుగా మారడం ఆందోళన కలిగిస్తోంది.మీడియా కథనాల ప్రకారం, హైదరాబాద్‌కు చెందిన ఆ వృద్ధురాలికి తొలుత టెలికాం అధికారులమంటూ ఫోన్ చేశారు. అనంతరం ఆమె పేరు అక్రమ కార్యకలాపాలతో ముడిపడి ఉందని, అరెస్టు తప్పదని బెదిరించారు. పోలీసు, సీబీఐ అధికారులుగా నటిస్తూ వీడియో కాల్ ద్వారా నకిలీ విచారణ నిర్వహించి ఆమెను తీవ్ర మానసిక ఒత్తిడికి గురిచేసినట్లు సమాచారం. అరెస్టు భయంతో సైబర్ నేరగాళ్లు సూచించిన బ్యాంకు ఖాతాలకు ఆమె రూ.21 లక్షలు బదిలీ చేశారు. మరింత డబ్బు పంపాలని బెదిరింపులు కొనసాగడంతో సెప్టెంబరు 5న కుమారుడికి విషయం తెలిపారు. అనంతరం సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం డబ్బు జమ అయిన బ్యాంకు ఖాతాలు, నేరగాళ్ల వ్యవహారశైలిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు వార్తా కథనాలు వెల్లడించాయి.

ఈ ఘటన ఒక కుటుంబానికి జరిగిన ఆర్థిక నష్టంగా మాత్రమే చూడకూడదు. నకిలీ అధికారులు, నకిలీ గుర్తింపు పత్రాలు, వీడియో కాల్స్, భయపెట్టే భాషతో సైబర్ నేరగాళ్లు ప్రజల విశ్వాసాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. 'డిజిటల్ అరెస్టు' పేరుతో చట్టబద్ధమైన ప్రక్రియ ఏదీ లేదని కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే స్పష్టం చేసింది. పోలీసులు లేదా దర్యాప్తు సంస్థలు ఫోన్, వీడియో కాల్ ద్వారా అరెస్టు చేసి డబ్బు బదిలీ చేయాలని కోరడం జరగదు.

అందువల్ల ఇలాంటి ముఠాలపై పోలీసులు కఠినంగా, వేగంగా చర్యలు తీసుకోవాలి. బాధితుల నుంచి ఫిర్యాదు అందిన వెంటనే డబ్బు వెళ్లిన ఖాతాలను గుర్తించి నిలిపివేయడంతో పాటు, ఆ ఖాతాల వెనుక ఉన్న అసలు సూత్రధారులను వెలికితీయాలి. నకిలీ బ్యాంకు ఖాతాలు, సిమ్‌కార్డులు, గుర్తింపు పత్రాలు సమకూర్చే వ్యక్తులపై కూడా చర్యలు ఉండాలి. ఇతర రాష్ట్రాలు, విదేశాల్లోని నెట్‌వర్క్‌లతో సంబంధాలుంటే సంబంధిత సంస్థల సమన్వయంతో దర్యాప్తు చేపట్టాలి.

సైబర్ నేరాల్లో వేగమే కీలకం. డబ్బు ఇతర ఖాతాలకు తరలిపోయేలోపే చర్యలు తీసుకునే వ్యవస్థ మరింత బలోపేతం కావాలి. బ్యాంకులు కూడా అనుమానాస్పదంగా పెద్ద మొత్తాల లావాదేవీలను గుర్తించి తక్షణ హెచ్చరికలు జారీ చేసే విధానాలను మెరుగుపరచాలి.

ప్రజల్లో అవగాహన పెంచడం కూడా అత్యవసరం. అనుమానాస్పద కాల్ వస్తే భయపడకుండా వెంటనే సంబంధాన్ని తెంచుకుని కుటుంబ సభ్యులకు తెలియజేయాలి. 1930కు ఫిర్యాదు చేయడం ద్వారా తక్షణ సహాయం పొందే అవకాశం ఉంది. ప్రజలను భయపెట్టి డబ్బు దోచుకునే సైబర్ నేరగాళ్లకు చట్టం పట్ల భయం కలిగేలా కఠిన చర్యలు చేపట్టడమే ఇటువంటి ఘటనలకు సమర్థమైన సమాధానం.

# హామీలు అమలుపరచని రేవంత్ సర్కార్ వెంటనే రాజీనామా చేయాలి

**రోడ్డు పై బైటాయెంచి ధర్నా..**
**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రాల దహనం**






**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** హైద్రాబాద్ సెప్టెంబర్ 8: హామీలు అమలుపరచని రేవంత్ సర్కార్ వెంటనే రాజీనామా చేయాలని బిఆర్ఎస్ పార్టీ నేతలు డిమాండ్ చేశారు.బీఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావు గౌడ్ ఆదేశాలతో సీతాఫల్మండి, బౌద్ధనగర్ డివిజన్ల మాజీ కార్పొ రేటర్ల ఆద్వర్యం లో సీతాపల్ మండి లో ధర్నానిర్వహించారు.దీంతోసికింద్రాబాద్..రామ్ నగర్ వెళ్లే వాహనాలకు అంతరాయం ఏర్పడింది.ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారెంటీలతో ప్రజలను మోసం చేసిందని, అమలు కాని హామీలను ఇచ్చి తప్పుదారిలో అధికారంలోకి వచ్చింద న్నారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీలు అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. వారాసిగూడ చౌరస్తా నుండి ర్యాలీని ప్రారంభించి సీతాఫల్మండి, నామాలగుండు, సీతాఫల్మండి చౌరస్తా, వరకు కొన సాగించి అనంతరం రొడ్డు పై బైఠాయించి ధర్నా

ప్రభుత్వం ఏర్పడి మూడేండ్లు కావస్తున్నాపేదలకు ఇప్పటికీ ఆర్థిక సాయం చేసిన పాపాన పోలేదని విమర్శించారు.

ఇప్పటికైనా ఇచ్చిన హామీలు అమలు చేయాలని, లేకుంటే బీఆర్ఎస్ పార్టీ తరపున పోరాటం చేస్తామని హెచ్చరించారు.ఈ సందర్భంగాముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రాలను దహనం చేశారు. అనంతరం సికింద్రాబాద్ జీహెచ్ఎం సి కార్యలయానికి వెళ్లి కమిషనర్ కు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కంది శైలజ,సామల హేమా సీనియర్ నాయకులు బల్ల గీత, బెజ్జంకి రాజేష్, మిట్టపల్లి బాబురావు, శైలేందర్, నారాయణ, కరాటే రాజు, సుజాత, సుమలత, ఫరీదా, లత, సులోచన, నందిత, మానస, ఆంజనేయులు గౌడ్, బస్తాన్ బాబా ఇతర నేతలు పాల్గొన్నారు.

## నేత్రదానంతో మరొకరి జీవితంలో వెలుగులు

## నేత్ర పరీక్షల శిబిరంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



మేడ్చల్--మల్కాజిగిరి, సెప్టెంబరు 7: జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఐడీఓసీ కలెక్టరేట్‌లోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో నేత్ర పరీక్షల శిబిరం నిర్వహించారు. అదనపు కలెక్టర్ (అర్బన్ లోకల్ బాడీస్) ఫైజాన్ అహ్మద్ శిబిరాన్ని ప్రారంభించారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డా. కె. ఆనంద్ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు.

ఈ సందర్భంగా డా. కె. ఆనంద్ మాట్లాడుతూ..




ప్రజల్లో నేత్ర ఆరోగ్యంపై అవగాహన పెంచడం, కంటి సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి సకాలంలో వైద్య సేవలు అందించడం, నేత్రదానంపై చైతన్యం కల్పించడం శిబిరం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. నేత్రదానం ద్వారా మరణానంతరం కూడా మరో వ్యక్తి జీవితంలో వెలుగులు నింపవచ్చని, ప్రతి ఒక్కరూ నేత్రదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

ఈ శిబిరంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో పాటు జిల్లా అధికారులు, వివిధ శాఖల సిబ్బంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. వైద్య సిబ్బంది నేత్ర ఆరోగ్యం, కంటి సంరక్షణపై అవగాహన కల్పించారు.

ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. సి. చంద్రకళ ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బందితో నేత్రదాన ప్రతిజ్ఞ చేయించారు. మరణానంతరం నేత్రాలను దానం చేయడం ద్వారా అంధులకు చూపును అందించవచ్చని, నేత్రదానం ప్రాముఖ్యతను వివరించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మాలతి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సాంబశివరావు, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా. కౌశిక్, డా. బరీరా ఫరీద్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ఎల్ఏ), సి. మోక్షిత, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (యూఎల్‌సీ), వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## హైలెవల్ కమిటీ సభ్యుల బెదిరింపు ధోరణి గర్హణీయం




హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ ప్రజాబలం ప్రతినిధి: పాలిటెక్నిక్ సంబంధిత జీవో 97 పై ఆందోళన చేస్తున్న పాలిటెక్నిక్ విద్యార్థులు, ఉద్యోగులతో చర్చించేదుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన హై లెవల్ కమిటీ విద్యార్థులను చర్చల కోసం పిలిచి విద్యార్థులు లేవనేత్తిన అంశాలకు సరిగ్గా సమాధానాలు చెప్పకుండా విద్యార్థులను బెదిరించడం సరికాదని పాలిటెక్నిక్ విద్యార్థి జేఏసీ ప్రతినిధులు మేకల అక్షయ్ కుమార్, జగన్, జనార్దన్, విశాల్, నాగరాజు అన్నారు.

ఈమేరకు సోమవారం రోజున సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో 30 కాలేజీల ప్రతినిధులు, పూర్వ విద్యార్థులు విలేకరుల సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జెఎసి నేతలు, విద్యార్థులు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో ప్రతి తెలంగాణ బిడ్డ పాల్గొన్నట్టే మా పాలిటెక్నిక్ విద్యార్థులంతా, ఉద్యోగులంతా గత 20రోజులుగా పోరాటంలో ఉన్నారని అన్నారు. వీరికి మద్దతుగా తల్లిదండ్రులు, రిటైర్డ్ ఉద్యోగులు ముఖ్యంగా పూర్వ విద్యార్థులు పాలిటెక్నిక్ విద్యావ్యవస్థ పరిరక్షణకొరకు పోరాటంలో భాగమవుతున్నారని తెలిపారు.

జీవో 97 పై విద్యాశాఖను పర్యవేక్షిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, శక్తి శాఖ మంత్రి వివేక్, విద్యా కమిషన్ మాజీ చైర్మన్ ఆకునూరి మురళి, హైలెవల్ కమిటీ చైర్మన్ కేకే తలోరీతిగా మాట్లాడుతున్నారని.. మా ప్రశ్నలకు వారి నుండి సరైన సమాధానం రావడం లేదని తెలిపారు.

ముందుగా పాలిటెక్నిక్ విద్యను నాశనం చేసిందే కాకుండా ఇప్పుడు చర్చల సమయంలో సైతం బెదిరింపు ధోరణితో వ్యవహరిస్తున్న కమిటీ సభ్యుడు నవీన్ మిట్టల్ ను వెంటనే కమిటీ నుండి తీసివేయాలని విద్యార్థులు డిమాండ్ చేశారు.

97 జీవో పై ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో చర్చించాలని విద్యార్థులు కోరారు. ప్రభుత్వం కమిటీ పేరుతొ కాలయాపన చేయడం సరికాదని.. అసెంబ్లీ సమావేశం ముగిసే లోపు జీవో 97 ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పాలిటెక్నిక్ వ్యవస్థలో భాగస్వాములంతా ఈ ప్రభుత్వ మొండివైఖరికి నిరసనగా పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా వివిధ పాలిటెక్నిక్ కళాశాలల ప్రతినిధులు సాత్విక, శ్రుతి, రాజు, కీర్తన, ధీరజ్, రేవంత్, జ్ఞానదీప్, రబి, లలిత, ప్రణిత్, గృణస్మయి, నాయబ్, పరమేష్, విశాల్, అశ్వత్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల కంటి చూపుపై ప్రత్యేక శ్రద్ధ..

## ఉచితంగా కంటి అద్దాల పంపిణీ



వేములవాడ ప్రజాబలం ప్రతినిధి, సెప్టెంబర్ 07:వేములవాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే) ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారుల బృందం 6 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు రక్త, నేత్ర పరీక్షలు నిర్వహించడంతో పాటు ఎత్తు, బరువు కొలిచి వారి ఆరోగ్య వివరాలను నమోదు చేసింది. నేత్ర పరీక్షల్లో పలువురు విద్యార్థులకు దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించిన వైద్యులు వారికి ఉచితంగా కంటి అద్దాలను అందజేశారు. విద్యార్థులు చిన్న వయసు నుంచే కంటి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, దృష్టిలో ఇబ్బందులు ఎదురైతే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. క్రమం తప్పకుండా ఆరోగ్య, నేత్ర పరీక్షలు చేయించుకోవడం ద్వారా కంటి సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి తగిన చికిత్స పొందవచ్చని వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ప్రభాకర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజారత్నం, ఉపాధ్యాయులు మల్లేశం, కోటేశ్వర్, సలాం, హమీద్, చంద్రమౌళి, జ్యోతి, శిరోమణి, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

## అక్షర యజ్ఞంలో అందరూ భాగస్వాములు కావాలి

## ప్రతి అక్షరాస్యుడు ఒకరికి చదువు నేర్పాలి: అదనపు కలెక్టర్

మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం, సెప్టెంబరు 7: అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో అవగాహన ర్యాలీలు, అక్షర యజ్ఞ కార్యక్రమాలు నిర్వహించాలని అదనపు కలెక్టర్ (ఎల్‌బీ) ఫైజాన్ అహ్మద్ ఆదేశించారు. జిల్లాను సంపూర్ణ అక్షరాస్య జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

జిల్లాలో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'ఉల్లాస్--నవభారత సాక్షరతా కార్యక్రమం' ద్వారా అక్షరాస్యతను పెంపొందిస్తున్నామని తెలిపారు. ఇది కేవలం ప్రభుత్వ కార్యక్రమం కాదని, సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు.

ఒక్కరికి చదువు నేర్పినా.. అదే అక్షర యజ్ఞం

సమాజంలో చదువుకున్న ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి కనీసం ఒకరు లేదా ఇద్దరికి చదువు నేర్పించి వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని అదనపు కలెక్టర్ కోరారు. ప్రతి అక్షరాస్యుడు ఒక ఉపాధ్యాయుడిగా మారితే జిల్లాలో సంపూర్ణ అక్షరాస్యత సాధించడం సులభమవుతుందని పేర్కొన్నారు.

స్వయం సహాయక సంఘాల మహిళలు ఉల్లాస్ కార్యక్రమం ద్వారా అక్షరాస్యతతో పాటు డిజిటల్, ఆర్థిక, జీవన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. తద్వారా వారు నిత్య జీవితంలో ఆత్మవిశ్వాసంతో, ఆత్మగౌరవంతో జీవించడంతో పాటు కుటుంబ జీవన ప్రమాణాలను మెరుగుపరుచుకోవచ్చని తెలిపారు.

మండల విద్యాధికారులు (ఎంఈఓలు), సీఆర్‌పీలు, వాలంటీర్ ఉపాధ్యాయులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, ప్రజాప్రతినిధులు, అభ్యసనదారులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ కోరారు.

## మట్టి గణపతిని ప్రతిష్ఠిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

## కలెక్టరేట్‌లో మట్టి వినాయక విగ్రహాల ఉచిత పంపిణీ



మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం, సెప్టెంబరు 7: పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయక విగ్రహాల వినియోగాన్ని ప్రోత్సహించాలని మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి సూచించారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లో పర్యావరణహిత మట్టి వినాయక విగ్రహాల వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయం, మేడ్చల్ పర్యావరణ ఇంజనీర్, నోడల్ అధికారి బి. రాజేందర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పర్యావరణహిత మట్టి వినాయక విగ్రహాల వినియోగంపై రూపొందించిన అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు.



అనంతరం మట్టి వినాయక విగ్రహాల స్టాల్‌ను ప్రారంభించి కలెక్టరేట్ ఉద్యోగులు, సిబ్బంది, ప్రజలకు విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. ప్రతి సంవత్సరం తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పర్యావరణహిత మట్టి వినాయక విగ్రహాల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

రసాయనాలతో తయారైన విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితమయ్యే అవకాశం ఉన్నందున మట్టి విగ్రహాలను వినియోగించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని తెలిపారు. 'మట్టి గణపతిని ప్రతిష్ఠిద్దాం--పర్యావరణాన్ని పరిరక్షిద్దాం'అనే సందేశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయం, మేడ్చల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు.. తాతా మధుపై చర్యలకు డిమాండ్.

## సత్తుపల్లి పోలీస్ స్టేషన్‌లో కాంగ్రెస్ నేతల ఫిర్యాదు



సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి సెప్టెంబర్ 07: తెలంగాణ అసెంబ్లీ సమావేశాల తొలి రోజున సభ వెలుపల బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వ్యవహరించిన తీరుపై సత్తుపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. శాసనసభ స్పీకర్‌పై ఎమ్మెల్సీ తాతా మధు అనుచిత, దుర్భాషలతో వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు.

స్పీకర్ పదవికి ఉన్న గౌరవాన్ని కించపరిచేలా వ్యాఖ్యలు చేయడాన్ని ఖండిస్తూ సోమవారం సత్తుపల్లి పోలీస్ స్టేషన్‌లో కాంగ్రెస్ పార్టీ తరఫున ఫిర్యాదు చేశారు. తాతా మధు చేసిన వ్యాఖ్యలను పరిశీలించి, చట్టప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.



రాజకీయ విభేదాలు ఏమైనప్పటికీ రాజ్యాంగబద్ధ పదవుల్లో ఉన్న వ్యక్తుల పట్ల గౌరవం పాటించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందని కాంగ్రెస్ శ్రేణులు పేర్కొన్నారు. శాసనసభ స్పీకర్ పట్ల అనుచిత భాషను ఉపయోగించడం సభా సంప్రదాయాలను, ప్రజాస్వామ్య విలువలను అవమానించడమేనని అన్నారు.

స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన తాతా మధుపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సత్తుపల్లి కాంగ్రెస్ నాయకులు పోలీసులను డిమాండ్ చేశారు. ఫిర్యాదుపై పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో సత్తుపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నిజాంపేట జర్నలిస్టుల ఆధ్వర్యంలో రామాయంపేట నియోజకవర్గ ఏర్పాటుకై రిలే నిరాహార దీక్షలు



**మెదక్ ఉమ్మడి జిల్లా ప్రజాబలం ప్రతినిధి:**గతంలో రామాయంపేట నియోజకవర్గం ఉండేదని, మళ్లీ డీ లిమిటేషన్ లో భాగంగా నియోజకవర్గన్నీ ఏర్పాటు చేయాలని నిజాంపేటలో ఆదివారం మండల జర్నలిస్ట్ ల ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. రామాయంపేట నియోజకవర్గంగా ఏర్పడితే అన్ని మండలాలు అభివృద్ధి చెందుతాయని, గత1952 సంవత్సరం నుండి 2009 వరకు రామాయంపేట నియోజకవర్గంగా కొనసాగిందన్నారు. అదేవిధంగా మళ్లీ రామాయంపేట నియోజకవర్గాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ దీక్షకు బీజేపీ జిల్లా కిసాన్ మోర్చ ప్రధాన కార్యదర్శి ఆకుల రమేష్, మండల అధ్యక్షులు సిద్దారాం రెడ్డి సంఘీభావం తెలిపారు. మళ్లీ రామాయంపేట ను నియోజకవర్గంగా ఏర్పాటు చేయాలని, కోరారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ లు బండారి చంద్రం, దుబాసిసంజీవ్, బండారి సిద్దరాములు, కుర్మా బాలరాజు, ఎదుగని అంజయ్య, కొమ్మాట రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి - నేతీకార్ ప్రేమ్ లాల్




గురుపూజోత్సవం సందర్భంగా ప్రేమ్ లాల్ ను సన్మానిస్తున్న తెలంగాణ ఖటిక్ సమాజ్ నాయకులు

కార్వాన్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని అఖిల భారత్ ఖటిక్ సమాజ్ సంరక్షకులు నేతీకార్ ప్రేమ్ లాల్ అన్నారు. ఈ మేరకు తెలంగాణ ఖటిక్ సమాజ్, హైద్రాబాద్ నగర ఖటిక్ సమాజ్ ల ఆధ్వర్యంలో రెండు రోజుల ప్రగతి కార్యక్రమాన్ని జియాగుడలోని భారత అభ్యున్నత పాఠశాలలో నిర్వహించారు. ఇందులో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆధార్, మీసేవా, పోస్ట్ ఆఫిస్, పలు బ్యాంకుల లోన్లు, బైక్ లోన్లు, కుల సంఘం ధృవీకరణ పత్రాల జారీ వంటి సేవలు కార్యక్రమాలు నిర్వహించారు. సంఘం తరపున త్వరలో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత ఖటిక్ సమాజ్ కార్యవర్గ సభ్యులు బిచుకారి సూర్య, తెలంగాణ ఖటిక్ సమాజ్ అధ్యక్షులు నేతీకార్ మోహన్ లాల్, గోగీకార్ నర్సింగ్ రావ్, హైదరాబాద్ నగర ఖటిక్ సమాజ్ అధ్యక్షులు గౌలికార్ రాజేష్, ప్రధాన కార్యదర్శి కామ్లేకార్ సందీప్, జమాల్ పూర్ సాయిబాబ, కాంటేకార్ బాబురావు, ఉల్కుందకార్ నర్సింగ్ రావ్, పంతులు రాకేష్, ఏ గంగారామ్, కే రవి, నవీన్, యూత్ అధ్యక్షులు జి బాలాజీ, ఎం ఘన్ శ్యామ్, కె జానకి రామ్, ఏ రాజ్ కుమార్, విశాల్ తదితరులు పాల్గొన్నారు.

## స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలా..? ఖండించిన ఎమ్మెల్యే రాగమయి!



'స్పీకర్‌ను అవమానించడం అంటే శాసనసభ గౌరవాన్ని అవమానించడమే" --- తాతా మధు వ్యాఖ్యలపై ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ ఫైర్

సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి సెప్టెంబర్ 07 : తెలంగాణ శాసనసభ స్పీకర్‌పై ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలపై సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ తీవ్రంగా స్పందించారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న స్పీకర్‌ను కించపరిచేలా మాట్లాడటం ప్రజాస్వామ్య విలువలను అవమానించడమేనని ఆమె మండిపడ్డారు.రాజకీయ విభేదాలు వేరు.. పదవుల గౌరవం వేరు!స్పీకర్ పదవి ఏ ఒక్క పార్టీకి, వ్యక్తికి సంబంధించినది కాదని ఎమ్మెల్యే రాగమయి స్పష్టం చేశారు. అది శాసనసభ గౌరవానికి, ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రతీక అన్నారు. రాజకీయంగా భిన్నాభిప్రాయాలు ఉండొచ్చని, అయితే రాజ్యాంగబద్ధమైన పదవుల గౌరవాన్ని కించపరిచేలా వ్యక్తిగత దూషణలు, అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు.“స్పీకర్‌ను అవమానించడం అంటే శాసనసభ గౌరవాన్ని, ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించడమే” అని ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ పేర్కొన్నారు.

వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి

తాతా మధు తన అనుచిత వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవడంతో పాటు తెలంగాణ శాసనసభ స్పీకర్‌కు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని ఎమ్మెల్యే రాగమయి డిమాండ్ చేశారు. రాజ్యాంగ సంస్థల గౌరవాన్ని కాపాడటం ప్రతి ప్రజాప్రతినిధి బాధ్యత అని ఆమె స్పష్టం చేశారు.

## జగదీష్ రెడ్డిని పరామర్శించిన కేటీఆర్, బీఆర్ఎస్ నేతలు



అసెంబ్లీ వద్ద సోమవారం ఉదయం జరిగిన తోపులాటలో అస్వస్థతకు గురై నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టీ. రామారావు పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అసెంబ్లీ వద్ద గాయపడిన అనంతరం పోలీసులు అరెస్ట్ చేసి తెలంగాణ భవన్లో జగదీశ్ రెడ్డి గారిని దింపారు. ఆయన బిపి 185 కు పైగా ఉన్న పోలీసులు బయటకి పంపించకపోవడంతో... పార్టీ సీనియర్ నేతల ఆందోళనతో నిమ్స్ కి తరలించారు. అక్కడ జగదీష్ రెడ్డి గారు చికిత్స తీసుకుంటున్నారు. కేటీఆర్‌తో పాటు రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, శాసనమండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, మాజీ మంత్రులు వేముల ప్రశాంత్ రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్ రావు, ఎమ్మెల్యేలు డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి, పాడి కౌశిక్ రెడ్డి తదితర బీఆర్ఎస్ నేతలు జగదీష్ రెడ్డిని పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు.

## ఐసీఎఫ్ఏఐ లా స్కూల్లో శ్రీ ఎన్. జె. యసస్వీ మెమోరియల్ 11వ మూట్ కోర్ట్ పోటీ--2026 ఘనంగా ముగింపు





**హైదరాబాద్, సెప్టెంబర్ 7, 2026 (ప్రజాబలం ప్రతినిధి)** ఐసీఎఫ్ఏఐ లా స్కూల్, ఐఎఫ్‌హెచ్‌ఈ, హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ ఎన్. జె. యసస్వీ మెమోరియల్ 11వ మూట్ కోర్ట్ పోటీ--2026 సెప్టెంబర్ 4 నుంచి 6 వరకు క్యాంపస్‌లో విజయవంతంగా జరిగింది.

పోటీ చివరి రోజు సెప్టెంబర్ 6, 2026న సెమీఫైనల్ రౌండ్లు జరిగాయి. ఇందులో అగ్రస్థానంలో నిలిచిన నాలుగు జట్లు ఫైనల్‌లో చోటు కోసం పోటీపడ్డాయి. ఉత్కంఠభరితమైన వాదనలు, అత్యుత్తమ న్యాయపరమైన నైపుణ్యాలను ప్రదర్శించిన అనంతరం రెండు జట్లు గ్రాండ్ ఫైనల్‌కు అర్హత సాధించాయి. ఫైనల్ పోటీలో పాల్గొన్న జట్లు అద్భుతమైన న్యాయ పరిజ్ఞానం, పరిశోధన, వాదనా పటిమ, వక్తృత్వ ప్రతిభను ప్రదర్శించాయి.

ఫైనల్ రౌండ్లకు తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు గౌరవనీయ శ్రీ జస్టిస్ సుద్దాల చలపతి రావు, గౌరవనీయ శ్రీ జస్టిస్ గాడి ప్రవీణ్ కుమార్ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. సెమీఫైనల్ రౌండ్లకు పదవీ విరమణ చేసిన న్యాయమూర్తులు, ప్రాథమిక మరియు క్వార్టర్ ఫైనల్ రౌండ్లకు న్యాయవాదులు, అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.

ఈ పోటీ ముగింపు సందర్భంగా నిర్వహించిన వాలెడిక్టరీ కార్యక్రమానికి ఐసీఎఫ్ఏఐ గ్రూప్ చైర్‌పర్సన్ శ్రీమతి శోభా రాణి యసస్వీ గారు ముఖ్య అతిథులు మరియు ఇతర ప్రముఖుల సమక్షంలో హాజరయ్యారు.

కార్యక్రమంలో మొదటగా మూట్ కోర్ట్ సొసైటీ కోఆర్డినేటర్ డా. సాయన్ దాస్ మూడు రోజుల పోటీకి సంబంధించిన అధికారిక నివేదికను సమర్పించారు.

అనంతరం ఐసీఎఫ్ఏఐ లా స్కూల్, ఐఎఫ్‌హెచ్‌ఈ, హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ (డా.) పూజారి రవిశేఖరరాజు అధ్యక్షోపన్యాసం చేశారు. మూడు రోజుల పాటు జరిగిన పోటీ విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన న్యాయమూర్తులు, అధ్యాపకులు, పాల్గొన్న అన్ని జట్లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

తదుపరి ఐఎఫ్‌హెచ్‌ఈ లా స్కూల్ డైరెక్టర్ జనరల్ ప్రొఫెసర్ (డా.) విజయేందర్ కుమార్ ప్రత్యేక ప్రసంగం చేశారు. ఈ పోటీ ద్వారా విద్యార్థులు పొందిన జ్ఞానం, నైపుణ్యాలను తమ భవిష్యత్ న్యాయ వృత్తిలో వినియోగించుకోవాలని, ప్రతిభను మరింత మెరుగుపరుచుకుంటూ నిరంతరం నేర్చుకునే స్ఫూర్తిని కొనసాగించాలని ఆయన సూచించారు.

తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి గౌరవనీయ శ్రీ జస్టిస్ గాడి ప్రవీణ్ కుమార్, గౌరవ అతిథిగా ప్రసంగిస్తూ, వాదనల్లో సృజనాత్మకతను పెంపొందించుకోవడంతో పాటు కేసులను సమర్థవంతంగా ప్రదర్శించడంపై విద్యార్థులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

ముఖ్య అతిథి గౌరవనీయ శ్రీ జస్టిస్ సుద్దాల చలపతి రావు, తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, పోటీలో పాల్గొన్న అన్ని జట్లు ప్రదర్శించిన అత్యుత్తమ న్యాయ నైపుణ్యాలు, అంకితభావాన్ని అభినందించారు.

శ్రీ ఎన్. జె. యసస్వీ మెమోరియల్ 11వ మూట్ కోర్ట్ పోటీ--2026లో మొత్తం రూ. 2,00,000 నగదు బహుమతులు అందజేయబడ్డాయి.

విజేతలు:

- విజేత: పారుల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లా, పారుల్ యూనివర్సిటీ
- ప్రథమ రన్నరప్: ూఎఖవీ చీవీ×మీా, స్కూల్ ఆఫ్ లా, బెంగళూరు
- ద్వితీయ రన్నరప్: న్యూ లా కాలేజ్, భారతి విద్యాపీఠ్ (డీమ్డ్ టు బీ యూనివర్సిటీ), పుణే
- బెస్ట్ మెమోరియల్: సెయింట్ జోసెఫ్ కాలేజ్ ఆఫ్ లా
- బెస్ట్ స్పీకర్: KIIT స్కూల్ ఆఫ్ లా, KIIT యూనివర్సిటీ
- బెస్ట్ రీసెర్చర్: శివ్ నాడార్ స్కూల్ ఆఫ్ లా, శివ్ నాడార్ యూనివర్సిటీ

అనంతరం ఐసీఎఫ్ఏఐ లా స్కూల్, ఐఎఫ్‌హెచ్‌ఈ, హైదరాబాద్ మూట్ కోర్ట్ సొసైటీ సభ్యురాలు డా. శ్రీదేవి డి. శెట్ కృతజ్ఞతలు తెలిపారు. పోటీలోని అన్ని రౌండ్ల న్యాయ నిర్ణేతలు, అధ్యాపక సమన్వయకర్తలు, విద్యార్థి అధ్యక్షుడు, సీనియర్ వైస్ ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్లు, జనరల్ సెక్రటరీలు, కోర్ కమిటీ సభ్యులు, టెక్నికల్ టీమ్‌తో పాటు లీగల్-టెక్ భాగస్వామి మానుపాత్ర, కవరేజ్ భాగస్వామి నజరియా అందించిన విలువైన సహకారానికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

జాతీయ గీతంతో వాలెడిక్టరీ కార్యక్రమం ముగిసింది.శ్రీ ఎన్. జె. యసస్వీ మెమోరియల్ మూట్ కోర్ట్ పోటీను ఐసీఎఫ్ఏఐ వ్యవస్థాపకులు దివంగత శ్రీ ఎన్. జె. యసస్వీ గారి స్మారకార్థం ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నారు. దేశవ్యాప్తంగా ఉన్న న్యాయ విద్యార్థుల్లో న్యాయ పరిజ్ఞానం, పరిశోధనా సామర్థ్యం, నాయకత్వ లక్షణాలు, స్నేహభావం మరియు వాదనా నైపుణ్యాలను పెంపొందించడం ఈ పోటీ ప్రధాన లక్ష్యం. 2026లో నిర్వహించిన 11వ ఎడిషన్ కూడా ఈ లక్ష్యాన్ని విజయవంతంగా కొనసాగించింది. యువ న్యాయ విద్యార్థులకు తమ వాదనా నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడానికి, న్యాయ పరిశోధనలో ప్రతిభను చాటుకోవడానికి, భవిష్యత్ న్యాయ వృత్తిలో రాణించేందుకు ఈ పోటీ ఒక గొప్ప వేదికగా నిలిచింది.

## మహాధర్నాకు వెళ్లకుండా బీజేపీ నేతల ముందస్తు అరెస్టు



**జహీరాబాద్, సెప్టెంబర్ 7 ప్రజాబలం ప్రతినిధి:** ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపును డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యార్థి మహాధర్నాకు వెళ్లకుండా జహీరాబాద్, చిరాగ్‌పల్లి పోలీస్‌స్టేషన్ల పరిధిలో పలువురు బీజేపీ నాయకులను పోలీసులు ముందస్తుగా హౌస్ అరెస్టు చేశారు. అనంతరం కొందరిని చిరాగ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బీజేపీ సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి నౌబాద్ జగన్నాథ్ మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలపై నిరసన తెలిపేందుకు వెళ్తున్న నాయకులను అడ్డుకోవడం అప్రజాస్వామికమన్నారు. అరెస్టయిన వారిలో జగన్నాథ్, పట్టణ అధ్యక్షులు పూల సంతోష్, సీనియర్ నాయకులు శ్రీనివాస్ గౌడ్ , కౌన్సిలర్లు శ్రవణ్, బొగ్గుల సంతోష్ , సురేష్ పూరి ,హిందూస్, సురేష్, ప్రతాప్‌రెడ్డి, నరేష్, నాగేష్ తదితరులు ఉన్నారు.

# అసెంబ్లీ అరెస్టులపై సత్తుపల్లిలో గులాబీ గర్జన!

## నల్ల జెండాలతో కదిలిన బీఆర్ఎస్ దండు..

## సండ్ర సారథ్యంలో భారీ నిరసన..

**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి 07:** అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల అరెస్టులపై సత్తుపల్లిలో గులాబీ శ్రేణులు భగ్గుమన్నాయి. సండ్ర వెంకట వీరయ్య ఆధ్వర్యంలో నల్ల కండువాలు, నల్ల జెండాలతో భారీ ర్యాలీ చేపట్టి కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలతో పట్టణాన్ని హోరెత్తించారు.





**ప్రశ్నించే గొంతును అణచలేరు!**

అసెంబ్లీలో ప్రజా సమస్యలను ప్రశ్నించడం ప్రతిపక్షం హక్కు అని, ఆ హక్కును అడ్డుకునే ప్రయత్నం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని సండ్ర వెంకట వీరయ్య మండిపడ్డారు. నల్ల దుస్తులతో అసెంబ్లీకి వెళ్లిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అడ్డుకోవడం, పలువురు నేతలను అదుపులోకి తీసుకోవడాన్ని తీవ్రంగా ఖండించారు. "పార్లమెంట్‌లో నల్ల దుస్తులతో నిరసన తెలిపే హక్కు ఉంటే.. అసెంబ్లీలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులకు అదే హక్కు ఎందుకు ఉండకూడదు?" అని సండ్ర ప్రశ్నించారు.

**1000 రోజుల పాలన.. హామీలపై నిలదీత**

కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలన పూర్తి చేసుకున్నా.. ఎన్నికల సమయంలో ప్రకటించిన ఆరు గ్యారెంటీలు, 13 డిక్లరేషన్లు, 420 హామీల అమలుపై ప్రజల్లో ఇంకా అనేక ప్రశ్నలు ఉన్నాయని సండ్ర అన్నారు. మహిళలకు రూ. 2,500, యువతకు ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, మెగా డీఎస్సీ, జాబ్ క్యాలెండర్, కల్యాణలక్ష్మి--షాదీ ముబారక్‌లో తులం బంగారం, పేదలకు ఇళ్ల వంటి హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

**ప్రజా సమస్యలపై పోరాటం ఆగదు**

ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని సండ్ర స్పష్టం చేశారు. అనంతరం ప్రజల నుంచి సేకరించిన వివిధ సమస్యలపై వినతిపత్రాలను ప్రజావాణిలో అధికారులకు సమర్పించారు.

# ప్రజావాణి అర్జీలను వెంటనే పరిష్కరించాలి

## మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి



**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం సెప్టెంబర్ 7:** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన అర్జీలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా నిబంధనల ప్రకారం వెంటనే పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి ఐఏఎస్ అధికారులను ఆదేశించారు.

సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్ తో కలిసి కలెక్టర్ అర్జీదారుల నుండి వినతులను స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ, పంచాయతీ రాజ్, సివిల్ సప్లైస్, మున్సిపల్ తదితర శాఖలకు సంబంధించి మొత్తం 105 దరఖాస్తులు ప్రజల నుండి స్వీకరించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన బాధితుల సమస్యలకు ప్రాధాన్యతనిచ్చి వేగంగా పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్ లైన్ లో వెంట వెంట నమోదు చేయాలని సంబంధిత అధికారులకు కలెక్టరు సూచించారు.

ఈ సమావేశంలో డిఆర్ఓ మాలతి, లా ఆఫీసర్ చంద్రావతి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# హమారప్రసాద్ దిష్టిబొమ్మ దగ్ధం

## డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కల్పిత నాయకుడని పుస్తకం రాసినందుకు





**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి సెప్టెంబర్ 07 ప్రజాబలం సంగారెడ్డి జిల్లా:** ప్రపంచ మేధావి, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, "కల్పిత నాయకుడని "ఒక "కల్పిత పుస్తకం రాస్తున్న" (హమారా ప్రసాద్,) నిన్నఆదివారం పుల్కల్ మండల కేంద్రంలో హామర ప్రసాద్, దిష్టిబొమ్మను పుల్కల్ మండల అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో తగలబెట్టడం జరిగింది, పుల్కల్ పోలీస్ స్టేషన్లో హమారప్రసాద్,మీద కంప్లైంట్ కూడా ఇవ్వడం జరిగింది, ఈ కార్యక్రమంలో పెద్ద రెడ్డిపేట మాజీ సర్పంచ్ తలారి అంజయ్య, సింగూరు మధుసూదన్, బేగరి కరుణాకర్, పుల్కల్ ఉపసర్పంచ్ ప్రవీణ్, మేతరి శ్రీనివాస్, నిరంజన్, లక్ష్మణ్, కృష్ణ, ఏసు, ఉదయ్, ప్రవీణ్, వినయ్, పోచయ్య,కిరణ్, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు......

# బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల అరెస్టులకు నిరసనగా రాస్తారోకో

## జహీరాబాద్‌లో ఆగ్రహ జ్వాలలు.. ప్రభుత్వ తీరుపై బీఆర్ఎస్ శ్రేణుల మండిపాటు




**జహీరాబాద్, సెప్టెంబరు 7 ప్రజాబలం ప్రతినిధి:** అసెంబ్లీ వర్షాకాల సమావేశాలకు నల్ల టీషర్టులతో హాజరైన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ జహీరాబాద్‌లో ఆ పార్టీ శ్రేణులు ఆందోళన చేపట్టాయి. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి, అనంతరం రాస్తారోకో, ధర్నా చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై అసెంబ్లీ వేదికగా ప్రధాన ప్రతిపక్షంగా ప్రశ్నించేందుకు వెళ్తున్న తమ పార్టీ ప్రజాప్రతినిధులను పోలీసులు అరెస్టు చేయడం సరికాదన్నారు. రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మహిళా ప్రజాప్రతినిధుల పట్ల ప్రభుత్వం, పోలీసులు వ్యవహరించిన తీరు సిగ్గుచేటని విమర్శించారు. ప్రజా సమస్యలను లేవనెత్తకుండా ప్రతిపక్ష గొంతును అణచివేయాలని ప్రభుత్వం చూస్తోందని ఆరోపించారు.

కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ గుండప్ప, జహీరాబాద్ మండల పార్టీ అధ్యక్షుడు తట్టు నారాయణ, ఝరాసంగం మండల అధ్యక్షుడు వెంకటేశం, మొగుడంపల్లి మండల అధ్యక్షుడు సంజీవ్‌రెడ్డి, కోహీర్ మండల అధ్యక్షుడు నర్సింలు, మాజీ మున్సిపల్ చైర్మన్ తంజీం, సీనియర్ నాయకులు నామా రవికిరణ్, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు బండి మోహన్, మహిళా పట్టణ అధ్యక్షురాలు మంజుల, అనుషమ్మ, పద్మజ, మాజీ పట్టణ అధ్యక్షులు యాకూబ్, నరసింహారెడ్డి, సంగమేశ్వర్, నరసింహగౌడ్, జె.రవికిరణ్, పట్టణ కౌన్సిలర్లు, వివిధ గ్రామాల సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నల్ల చొక్కలేసుకొని శాసన సభకు రావడం నేరమా ?








**గండిపేట మండలం ప్రజాబలం ప్రతినిధి 7 సెప్టెంబర్ 2026.** కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనలో ఆరు గ్యారంటీలు, 420 హామీలు అమలు వైఫల్యాలపై నిరసనగా బీ.ఆర్.ఎస్ శాసన సభ్యులు నల్లటి దుస్తులను ధరించి అసెంబ్లీకి రావడం, ప్రాంగణం వద్ద జరిగిన ప్రధాన పరిణామాలలో భాగంగా శాసన సభ్యులు అసెంబ్లీకి రాకుండా ఆపడం ప్రజాస్వామ్యానికే అవమానం, పై పెచ్చు నల్ల యూనిఫాం వేసుకున్నారనే నేపథ్యంతో పోలీసుల నడవడిక ప్రజా ప్రతినిదులను అగౌరవ పరచడమే, ఈ విషయంలో ప్రజాస్వామ్యానికే అతీతమైన అధికారాలు పోలీసు వ్యవస్థకు లేవు, ప్రజాస్వామ్యన్ని కాపాడటం ప్రభుత్వ బాధ్యత కాగా ప్రజలచే ఎన్నుకోబడిన ప్రజా ప్రతినిధి మహేశ్వరం నియోజకవర్గం గౌరవ ఎమ్మెల్యే శ్రీమతి పి. సబితా ఇంద్రారెడ్డి పట్ల పోలీసులు దురుసుగా ప్రవర్తించడం, ఆమె జుట్టు పట్టుకున్నారని వస్తున్న ఆరోపణలు ప్రజాస్వామ్య విలువలను అవమానించడమే కాకుండా, గౌరవానికి తీవ్రమైన భంగం కలిగించే చర్య. నల్ల చొక్కాలు ఏసుకొని నినాదాల ప్లకార్డులు సభ లోపల పట్టుకోవడానికి, నల్ల చొక్కాలు ఏసుకొని చొక్క జేబుకు నిరసన కార్డులు తగిలించు కోవడానికి, నల్ల చొక్కల పైన నినాదాలు రాసుకోవడాని తేడా ఏమున్నదొ: పార్లమెంటులో రాహుల్ గాంధీ , పక్క రాష్ట్రాల్లో చంద్ర బాబులు చేసింది తప్పు కానప్పుడు తెలంగాణలో నల్లదుస్తులతో గౌరవ శాసన సభ్యులు అసెంబ్లికి రావడం తప్పు ఎలా అవుతుందని, ప్రజాస్వామ్య జీవన విధానంలో రంగుల బేదం లేకుండా గౌరవ ప్రథమంగా తోచిన రీతిలో బట్టలు ధరించడం స్వేచ్చనుసారం కాగా అట్టి సాకుతో అసెంబ్లికి రానీయక పోవడం శోచనీయం, ప్రజా ప్రతినిధులను రక్షించి చట్టాన్ని అమలు చేయాల్సిన పోలీసులు తమ అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ ఇలాంటి ప్రవర్తనకు పాల్పడటం ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థనీయం కాదు. ఈ అహంకార పూరిత, నిరంకుశ, ప్రజాస్వామ్య విరుద్ధ పోలీసు వైఖరిని మణికొండ, నెక్నాంపూర్ మున్సిపల్ డివిజన్ల భారత రాష్ట్ర సమితి పార్టీ నాయకుడు అందె లక్ష్మణ్ రావు తీవ్రంగా ఖండించడం, ఇలాంటి ఘటనలపై ప్రభుత్వం మౌనం వహిస్తే, అది పోలీసు అధికార దుర్వినియోగానికి పరోక్షంగా మద్దతు ఇచ్చినట్లే అవుతుంది కాబట్టి ప్రజాస్వామ్య గౌరవాన్ని, చట్టబద్ధ పాలనను కాపాడేందుకు ఇట్టి ఘటనకు బాధ్యులైన పోలీసు అధికారి/ సిబ్బందిని తక్షణమే సస్పెండ్ చేసి, కాలపరిమితితో కూడిన నిష్పక్షపాత విచారణ జరిపి, చట్టప్రకారం కఠినమైన క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం.

# మలబార్ గోల్డ్ ౘ డైమండ్స్ 'నైరా' కలెక్షన్ ఆవిష్కరణ

మలబార్ గోల్డ్ ౘ డైమండ్స్ ప్రముఖ నటి, మోడల్ శ్రీనిధి శెట్టిని బ్రాండ్ ముఖంగా పరిచయం చేస్తూ 'నైరా' పేరుతో కొత్త సహజ రత్నాల ఆభరణాల కలెక్షన్‌ను జూబ్లీహిల్స్ లో ఆవిష్కరించింది. సాంప్రదాయ చిత్తై, పచ్చి హస్తకళా స్ఫూర్తితో రూపొందించిన ఈ కలెక్షన్‌లో బంగారంతో పాటు సహజ రత్నాలను వినూత్న డిజైన్లలో పొందుపరిచారు.ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటకలో నిర్వహిస్తున్న జెమ్‌స్టోన్ జ్యువెలరీ ఫెస్టివల్‌లో భాగంగా 'నైరా'ను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా రత్నాలు, అన్‌కట్ ఆభరణాల తయారీ ఛార్జీలపై 25 శాతం వరకు తగ్గింపు అందిస్తున్నట్లు సంస్థ తెలిపింది. ఈ ఆఫర్ సెప్టెంబర్ 14, 2026 వరకు కొనసాగనుంది.మలబార్ గ్రూప్ ఛైర్మన్ ఎం.పి. అహ్మద్ మాట్లాడుతూ.. సహజ రత్నాల ప్రత్యేకతను ఆధునిక డిజైన్‌తో మేళవించి 'నైరా'ను రూపొందించామని తెలిపారు.

# ప్రజావాణికి 56 ఫిర్యాదులు

**ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలి -- జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి**

**ప్రజావాణిలో మొత్తం 56 ఫిర్యాదుల స్వీకరణ**

**రెవెన్యూ శాఖకు 27, ఇతర శాఖలకు 29 వినతులు**

**అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలి**

**ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి**

**రంగారెడ్డి ప్రజాబలం ప్రతినిధి:** రంగారెడ్డి జిల్లా సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి మొత్తం 56 ఫిర్యాదులు అందాయి. ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి దృష్టికి తీసుకువచ్చి వినతిపత్రాలు సమర్పించారు.



ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి అందుతున్న ప్రతి వినతిని సంబంధిత శాఖల అధికారులు అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి, ఎలాంటి జాప్యం లేకుండా పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా నిరంతరం సమీక్షిస్తూ, నిర్దేశిత గడువులోగా పరిష్కారం చూపాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి, ప్రజలకు సత్వర సేవలు అందించాలని తెలిపారు. ప్రజావాణిలో రెవెన్యూ శాఖకు సంబంధించిన 27, ఇతర శాఖలకు సంబంధించిన 29, మొత్తం 56 వినతులు అందినట్లు అధికారులు తెలిపారు.

ప్రజావాణి అనంతరం కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో రూపొందించిన "మట్టి గణపతిని పూజిద్దాం – – పర్యావరణాన్ని పరిరక్షిద్దాం" అనే సందేశంతో రూపొందించిన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి ఆవిష్కరించారు.



ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ నెల 14న వినాయక చవితి సందర్భంగా జిల్లాలోని ప్రజలు పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించి, పర్యావరణహితంగా వేడుకలను నిర్వహించాలని, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (ప్లాశ్రీ) విగ్రహాలకు బదులుగా మట్టి గణపతులను ప్రతిష్ఠించాలని, సహజసిద్ధమైన రంగులు, పర్యావరణహిత అలంకరణలను వినియోగించాలని కలెక్టర్ సూచించారు. ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించేందుకు సంబంధిత శాఖలు విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి శారద, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## పిల్లిగుండ్ల ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశంలో పాల్గొన్నగ్రామ సర్పంచ్ ఆకుల పద్మ సంజీవరెడ్డి



**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి సెప్టెంబర్ 7(ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలంపిల్లిగుండ్ల గ్రామంలో బ్యాగరి శ్రీనివాస్ గారి ఇందిరమ్మ ఇళ్ళు గృహప్రవేశం కార్యక్రమంలో సర్పంచ్ ఎ.పద్మ సంజీవరెడ్డి ప్రారంభోత్సవం చేశారు వారి దంపతులకు ప్రభుత్వం తరపున బట్టలను అందించి ఆశీర్వదించడము జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.సంజీవరెడ్డి మాట్లాడుతూ ఇది ప్రజా ప్రభుత్వం ఇళ్లు లేని పేదలకు అందరికీ ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు గౌరవనీయులు తెలంగాణ శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ సర్ ఆశీస్సులతో గ్రామం అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు.గత పదేళ్ల పాలనలో నిరుపేదలకు బి.ఆర్.ఎస్ ప్రభుత్వం లో ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన పేదలకు ఇళ్లు ఇస్తున్నారని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మల్లేశం, వార్డు సభ్యులు యాదయ్య, మాజీ ఉప సర్పంచ్ ఎ. సుదర్శన్ రెడ్డి , గ్రామ పెద్దలు శంకర్, శంకరయ్య, మొగులయ్య, సత్తయ్య, శివయ్య,శేఖర్ స్వామి , యువ నాయకుడు ప్రజా సేవలో వాడబడుతున్నభరత్ భూషన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు



## తిరుపతిలో ట్రావెల్స్ మేనేజర్ పై రౌడీ షీటర్ దాడి

తిరుపతి లో ఒక ట్రావెల్స్ మేనేజర్ పై రౌడీ షీటర్ దాడికి దిగారు. బాధితుడి ఫోన్ పగలగొట్టి, మెడలో గోల్డ్ చైన్ లాక్కొని చంపేస్తానంటూ బెదిరింపులకు గురి చేసారు. చెర్లోపల్లి ఆయన్ డిజిటల్ ఎగ్జామినేషన్ సెంటర్ సమీపంలో ఘటన జరిగింది. సుండుపల్లి మండలం మంచిరెడ్డిపల్లికి చెందిన చంద్రమోహన్ పుదీపట్ల కృష్ణ ట్రావెల్స్ లో మేనేజర్ . ఈనెల 4న రోడ్డుపై ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్న వారికి హారన్ కొట్టాడని అడ్డగించి దాడికి దిగారు. నా పేరు అజీమ్, నేను రౌడీషీటర్, మిమ్మల్ని చంపేస్తా అంటూ దాడి చేసి మెడలోని 9 గ్రాముల బంగారు చైను లాక్కున్నాడు. బాధితుడు పి.చంద్రమోహన్ తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసాడు.

కొర్లగుంట కొత్తపల్లికి చెందిన రౌడీ షీటర్ సయ్యద్ అజీమ్, తిరుపతి రూరల్ అవిలాలకు చెందిన గోశాల రుద్ర ను పోలీసులు అరెస్టు చేసారు. వినయ్ అలియాస్ బబ్లు కోసం పోలీసులు గాలింపు చేపట్టారు.

# మర్పల్లి మండల మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లు ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలి



**వికారాబాద్ నియోజకవర్గం సెప్టెంబర్ 7(ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలంపెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని ప్రజావాణి మర్పల్లి లో ఫిర్యాదు పట్లూర్ గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలని కోరుతూ మాజీ సర్పంచ్ ఇందిరా అశోక్ ఈరోజు మర్పల్లి ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎస్‌డీఎఫ్ నిధులతో గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టి పూర్తి చేసినట్లు తెలిపారు. అయితే చేసిన పనులకు సంబంధించి సుమారు రూ.9 లక్షల బిల్లులు ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే విడుదల చేయాలని అధికారులను కోరారు.

గ్రామాల అభివృద్ధి కోసం పలువురు సర్పంచులు అప్పులు చేసి అభివృద్ధి పనులు చేపట్టారని ప్రభుత్వం మారిన అనంతరం చేసిన పనులకు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో మాజీ సర్పంచులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. బిల్లులు అందక కొందరు మాజీ సర్పంచులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని పేర్కొన్నారు.

గ్రామ అభివృద్ధి పనులకు రాజకీయాలకు సంబంధం లేకుండా, పూర్తయిన పనులకు సంబంధించిన బిల్లులను పరిశీలించి వెంటనే విడుదల చేయాలని, ప్రభుత్వని విజ్ఞప్తి చేయడం జరుగుతుందని పట్లూర్ మాజీ సర్పంచ్ ఇందిరా అశోక్ తెలిపారు

# మర్పల్లి బి.ఆర్.ఎస్ నాయకులు కాంగ్రెస్ హామీలు ఎక్కడ? ప్రజలకు సమాధానం చెప్పాలి

**ఎన్నికల హామీలు అమలు చేయాలని ప్రజావాణిలో బి.ఆర్.ఎస్ ఫిర్యాదు**

**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి సెప్టెంబర్ 7(ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:**మర్పల్లి మండలం ప్రజలకుఎన్నికల సమయంలో హామీల వర్షం కురిపించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇప్పుడు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో నిర్లక్ష్యం చేస్తోందని మర్పల్లి మాజీ వైస్ ఎంపీపీ మోహన్‌రెడ్డి, మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ తీవ్రంగా విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.




మర్పల్లి మండల బి ఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం మండల ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి అర్హులైన లబ్ధిదారులతో కలిసి హాజరై ఎంపీడీవో, ఎమ్మార్వోలకు వినతిపత్రాలు అందజేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ కళ్యాణలక్ష్మి కింద తులం బంగారం, ఇందిరమ్మ ఇళ్లు, విద్యార్థులకు స్కూటీలు, వృద్ధులకు పెన్షన్ల పెంపు, రైతు భరోసా, రూ.2 లక్షల రుణమాఫీ, నిరుద్యోగులకు ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, మహిళలకు నెలకు రూ.2,500, విద్యార్థులకు రూ.5 లక్షల విద్యా భరోసా వంటి అనేక హామీలను ఇచ్చిందని గుర్తు చేశారు."హామీలు ఇచ్చి ఓట్లు తీసుకున్న తర్వాత ప్రజల సమస్యలను పట్టించుకోకపోవడం ఏ విధమైన పాలన?" అని వారు ప్రశ్నించారు. ప్రభుత్వం ఏర్పడి 1000 రోజులు పూర్తవుతున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో అనేకం ఇంకా అమలుకు నోచుకోలేదని విమర్శించారు.

అర్హత ఉన్నప్పటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందక అనేక కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని వారు పేర్కొన్నారు. పథకాలకు దరఖాస్తు చేసుకున్న అర్హులైన లబ్ధిదారులను గుర్తించి నిబంధనల ప్రకారం వెంటనే ప్రయోజనం కల్పించాలని అధికారులను కోరారు.

ప్రజలకు ఇచ్చిన హామీలను కేవలం ఎన్నికల ప్రచారానికే పరిమితం చేయకుండా.. వాటి అమలుపై ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోతే బి ఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజలను సమీకరించి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులైన లబ్ధిదారులకు న్యాయం చేయాలని కోరారు. ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుపై ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని వారు అన్నారు.

ఈ కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు మధుకర్, టౌన్ పార్టీ అధ్యక్షుడు గఫ్ఫార్, మాజీ రైతుబంధు అధ్యక్షుడు నాయబ్ గౌడ్, మాజీ కోఆప్షన్ సభ్యుడు సోహెల్, పి ఎ సి ఎస్ డైరెక్టర్ యాదయ్య, మండల పార్టీ సీనియర్ నాయకులు డి.అశోక్, రచయ్య, కృష్ణారెడ్డి, జైపాల్‌రెడ్డి, మంగలి శ్రీనివాస్, బి.రవి, జి.అశోక్, చంటి, అనంతి, సోషల్ మీడియా వికాస్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# జూదం ఆడుతున్న ముగ్గురు అరెస్టు



**జహీరాబాద్, సెప్టెంబర్ 7 ప్రజాబలం ప్రతినిధి:** మొగుడంపల్లి మండలం గుడుపల్లి గ్రామ శివారులో జూదం ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను చిరాగ్‌పల్లి పోలీసులు అరెస్టు చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్‌ఐ వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం దాడి నిర్వహించారు. ఈ సందర్భంగా జూదం ఆడుతున్న గుడుపల్లి గ్రామానికి చెందిన ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.7,390 నగదు, మూడు సెల్‌ఫోన్లు, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ వినయ్‌కుమార్ తెలిపారు. జూదం, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com